

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 1-12-2024 | పేజీలు: 14 +28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 226 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య ఉ. 11.50 తదుపరి పాడ్యమి; నక్షత్రం: అనూరాధ మ. 2.24 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 8.18-10.00; దుర్ముహూర్తం: సా. 4.07-4.51; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మాఫియా భరతం పడతా!

బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తా: చంద్రబాబు



ప్రజావేదిక వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు భుజంపై చేయి వేసి ఆప్యాయంగా మాట్లాడుతున్న వృద్ధురాలు

13

జగన్ పాలనలో భూ రికార్డులు తారుమారు చేశారు. ల్యాండ్ ప్రొటెక్షన్ యాక్టు పేరుతో భూ కబ్జాలు చేసి ఇష్టాను సారంగా రికార్డులు మార్చేశారు. మాకు అందుతున్న ఫిర్యాదుల్లో సగం భూ సమస్యలే. దీనిని బట్టే భూ బకాసురులు ఎంతలా చెలరేగిపోయారో అర్థమవుతోంది.

- సీఎం చంద్రబాబు

భూ కబ్జాలు, గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

మద్యంలో నేతలు జోక్యం చేసుకుంటే వదలం

ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం

రాయలసీమను రతనాలసీమగా మారుస్తాం

5 నెలల్లో 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం

రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు

2047 నాటికి రాష్ట్రం నంబర్ వన్

జనాభా పెంచండి.. అదే మన ఆస్తి: సీఎం

'అనంత' నేమకల్లులో పింఛన్లు పంచిన బాబు

13

ఒక రోజు ముందుగానే పింఛన్

తొలి రోజే 94.54% పంపిణీ పూర్తి

పలు జిల్లాల్లో వర్షంలోనూ 'భరోసా'


భర్త చనిపోతే మరుసటి నెలలోనే భార్యకు వితంతు పెన్షన్.. ఆదేశాలు జారీ

రంపచోడవరం రెవెన్యూ డివిజన్ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు 245 కి.మీ. దూరంలో ఉంది. రంపచోడవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి దూరం 225 కిలోమీటర్లు. అంటే... జిల్లా కేంద్రం కంటే రాష్ట్ర రాజధానే దగ్గరన్నమాట.

శ్రీకాకుళం జిల్లాలోని రాజాం నియోజకవర్గాన్ని రాజకీయ కోణంలో విజయనగరం జిల్లాలోకి తెచ్చారు. ఓ కీలక నేత సామాజికవర్గ ప్రజలు రాజాం నియోజకవర్గంలో ఎక్కువగా ఉండటంతో.. స్థానికులకు ఇష్టం లేకున్నా శ్రీకాకుళం నుంచి తొలగించి విజయనగరంలో కలిపారన్న విమర్శలున్నాయి.

విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు, గన్నవరం మండలాలను తీసుకెళ్లి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న మచిలీపట్నం కేంద్రంగా కృష్ణా జిల్లాలో కలిపారు.

చాలా నియోజకవర్గాల్లో కొన్ని మండలాలను ఓ జిల్లాలో, మరికొన్ని మండలాలను ఇంకో జిల్లాలో కలిపేశారు. పార్లమెంటు నియోజక వర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లను కూడా ఇలాగే విడదీశారు.



జగన్ పెట్టిన జిల్లాల కష్టాలు

నాడు ప్రజాస్వామ్య స్ఫూర్తికి భిన్నంగా 13 కొత్త జిల్లాల ఏర్పాటు

ప్రజాభిప్రాయాలు, ప్రయోజనాలు గాలికి

భౌగోళిక పరిస్థితులు, పాలనా అవసరాలు పట్టించుకోకుండా జిల్లాల పునర్విభజన

రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట

ఈ తప్పులను సరిదిద్దుతామన్న హామీని చంద్రబాబు నెరవేర్చాలని ప్రజల ఆకాంక్ష

ప్రజలను వెంటాడుతున్న సమస్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో జరిగిన వ్యవస్థల విధ్వంసంలో జిల్లాల పునర్విభజన ఒకటి. జగన్ సర్కారు పోయినా ఆయన చేసిన తప్పులకు ప్రజలు ఇప్పటికీ కష్టాలు పడుతున్నారు. నాడు ప్రజల అభిప్రాయాలు, భౌగోళిక పరిస్థితులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. పారదర్శకతకు, శాస్త్రీయతకు చోటు లేకుండా.. రాజకీయ ప్రయోజనాలు, స్వలాభం కోసం, అస్మదీయులకు లబ్ధి కలిగేలా వ్యవహరించారు. జగన్ నిర్వాకం వల్ల గత రెండున్నర సంవత్సరాలుగా ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అన్న తేడా లేకుండా

మిగతా 12వ పేజీలో...

జనమే వేస్తారు.. జగన్‌పై దావా!



ప్రభుత్వాలు లంచాలకు ఆశపడి స్వార్థం కోసం తీసుకునే నిర్ణయాల వల్ల తాము మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే ప్రజలకు ఉన్న వెసులుబాటు ఏమిటి? తమకు నష్టం కలిగించిన పాలకులను న్యాయస్థానాలకు లాగే వెసులుబాటు ప్రజలకు ఉంటుందా లేదా?

లంచం తీసుకోకుండా జగన్ ఒప్పందం కుదుర్చుకున్నారంటే ఒక్కరు కూడా నమ్మరు. ఆయన మద్దతుదారులకు కూడా ఈ విషయంలో క్లారిటీ ఉంటుంది. అదానీతో డీల్స్ కుదుర్చుకుంటే తాను సేఫ్‌గా ఉంటానని జగన్ రెడ్డికి తెలుసు. అందుకే రాష్ట్రంలోని వనరులన్నీ అదానీకి దోచి పెట్టడానికి జగన్ రెడ్డి తెగబడ్డారు.

అబద్ధాలకు చొక్కా ప్యాంట్ తగిలిస్తే జగన్ రెడ్డి కనిపిస్తారు. ఈ స్థాయిలో అలవోకగా అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిన జగన్‌కు డాక్టరేట్ ఇవ్వాల్సిందే. అమెరికా ఏజెన్సీలు తన పేరు ఎక్కడా ప్రస్తావించలేదని జగన్ మరో పచ్చి అబద్ధం చెప్పారు.

జగన్ రెడ్డి ధన దాహం ఏ పాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు అమాయకత్వం నటించినా నమ్మే వాళ్లు ఎవరూ లేరు. ప్రతిఫలం లేకుండా అతను ఏ పనీ చేయడన్న విషయం అందరికీ తెలిసిందే. కాకినాడ, గంగవరం పోర్టులు చేతులు మారడం వెనుక ఏమి జరిగిందో అందరికీ ఎరుకే.

సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం విషయమై తనపై అవాస్తవాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' పత్రిక 48 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే వంద కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేస్తానని ఆయన హెచ్చరించడం వింతగా ఉంది. వంద కోట్లు ఏమి ఖర్మ - లంచంగా తీసుకున్న 1750 కోట్ల రూపాయలు సరిపోలేదనుకుంటే అంతే మొత్తానికి పరువు నష్టం దావా వేసుకోవచ్చు.

అదానీ-జగన్ డీల్ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉండబోతున్నదో తెలియదు. ఈ ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలన్న పాపులర్ డిమాండ్ ఉంది. అయితే ఒప్పందంలో చేర్చిన నిబంధనల ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే అదానీ కంపెనీకి మూడు వేల కోట్ల రూపాయలను నష్టపరిహారం కింద చెల్లించాల్సి వస్తుంది.

కొత్త పలుకు

-ఆర్కే విశ్లేషణ 4లో..

చెన్నై జలదిగ్బంధం

తమిళనాట పలు జిల్లాల్లో తుఫాను బీభత్సం

స్తంభించిన జనజీవనం.. చెన్నై ఎయిర్‌పోర్ట్ మూత

మూతపడిన విద్యాలయాలు, వ్యాపార సంస్థలు

విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి

సహాయ చర్యలకు 30 వేల మంది పోలీసులు

రంగంలోకి 18 ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

అమ్మా క్యాంటీన్లలో ఉచితంగా ఆహార పంపిణీ

చెన్నై, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు తమిళనాడు రాజధాని చెన్నైని ముంచేశాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రధాన ప్రాంతాల్లో సైతం ఎటుచూసినా చెరువులు, నదుల్లా కనిపిస్తున్నాయి. టీ.నగర్, కోడంబాక్కం, నుంగంబాక్కం, పురుషవాక్కం, మైలాపూర్ తదితర ప్రాంతాలు సైతం జలదిగ్బంధంలో

మిగతా 2వ పేజీలో...

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో కోతకు గురైన ఇళ్లు



'ఫెంగల్' అలజడి

మహాబలిపురం, కారైక్కాల్ మధ్య తీరం దాటిన తుఫాన్

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కుంభవృష్టి

'నెల్లూరు'లో 20 అడుగులు ముందుకు సంద్రం

కాకినాడ జిల్లాలో మత్స్యకారుల ఇళ్లు ధ్వంసం

కృష్ణపట్నం పోర్టులో 6వ నంబరు హెచ్చరిక

విశాఖ, తిరుపతిలో పలు విమానాలు రద్దు

పలు జిల్లాల్లో నీట మునిగిన పంటలు

నేడు, రేపు దక్షిణ కోస్తా, సీమలో భారీవర్షాలు

14



9

టీసీఎస్ వచ్చేస్తోంది

విశాఖలో దిగ్గజ ఐటీ కంపెనీకి లైన్‌క్లియర్

లీజుకు 'డల్లాస్ టెక్నాలజీస్' బిల్డింగ్.. రుషికొండ ఐటీ పార్కు హిల్-2పై ఆఫీస్

లీజు ఒప్పందానికి ప్రభుత్వం పచ్చజెండా.. అదనపు స్థలం కేటాయింపునకూ ఓకే

అన్ని శాఖలూ సహకరించాలని ఆదేశం.. తొలి దశలో 2 వేల మందికి ఉద్యోగాలు

అమరావతిలో రూ. 50 కోట్లతో తపాలా ప్రధాన కార్యాలయం

14

మరో రూ.20 కోట్లతో ఉద్యోగుల క్వార్టర్లు: కేంద్ర మంత్రి పెమ్మసాని

కేంద్రం నిధులతో కొండవీడు అభివృద్ధికి కృషి: ఎంపీ కృష్ణదేవరాయలు

2030 నాటికి సోలార్ విద్యుత్ రూ.1.90కే!

టెరీ అధ్యయనంలో వెల్లడి

13



పీఎస్ఆర్ | కాంతి రాణా | విశాల్ గున్నీ

వారిపై దయ చూపొద్దు

చట్టాన్ని అమలు చేయాల్సిన వారే ఉల్లంఘించారు

కాంతి రాణా, విశాల్ గున్నీ ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేయండి

పీఎస్ఆర్ ఆంజనేయులు సూచనతో అమాయక మహిళను కేసులో ఇరికించారు

విద్యాసాగర్‌తో కలిసి కుట్రలో పాల్గొన్నారు

పోలీసు శాఖకు అపకీర్తి తెచ్చారు

జెత్వానీ కేసులో హైకోర్టులో సీఐడీ కౌంటర్లు

14

'మహా' సంకటం

- ముహూర్తం ఖరారైనా మహా కొత్త సీఎంపై వీడని సందిగ్ధత
- డిసెంబరు 5 సాయంత్రం 5 గంటలకు సీఎం ప్రమాణం
- బీజేపీ నుంచే కొత్త సీఎం ఉంటారన్న అజిత్ పవార్



ముంబై, నవంబరు30: మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేతే అవుతారని ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ చెప్పారు. శివసేనతో పాటు తన పార్టీ నుంచి డిప్యూటీ సీఎంలు ఉంటారని తెలిపారు. అయితే ఇంకా మంత్రిత్వ శాఖల కేటాయింపులు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యం కావడం మహారాష్ట్రలో కొత్తకాదన్నారు. 1999లో నెల రోజుల సమయం పట్టిందని అజిత్ పవార్ గుర్తు చేశారు. నవంబరు 23న ఫలితాలు రాగానే బీజేపీ సీఎంగా దేవేంద్ర ఫడణవీస్‌కు అజిత్ పవార్ మద్దతు పలికారు. డిసెంబరు 5న సాయంత్రం 5 గంటలకు ముంబైలోని ఆజాద్ మైదానంలో మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం కొలువుతీరబోతుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవ్‌నకులే తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారని ఆయన వెల్లడించారు. అయితే ముఖ్యమంత్రిగా ఎవరు ప్రమాణం చేస్తారనేది మాత్రం చంద్రశేఖర్ వెల్లడించలేదు. మరోవైపు, ఢిల్లీలో బీజేపీ అధిష్ఠానంతో మహాయుతి నేతల సమావేశం తర్వాత ముంబై నుంచి తన సొంతూరు సతారాకు వెళ్లిపోయిన ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేకు ప్రస్తుతం అనారోగ్యంగా ఉందని శివసేన వర్గాలు తెలిపాయి. జ్వరం, వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన డాక్టర్ల బృందం పర్యవేక్షణలో ఉన్నారని మాజీ మంత్రి ఉదయ్ సామంత్ తెలిపారు.

పాదయాత్రలో కేజ్రీవాల్‌పై దాడికి యత్నం

న్యూఢిల్లీ, నవంబరు 30: ఆప్ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్‌పై ఓ యువకుడు దాడికి యత్నించాడు. పార్టీ శ్రేణులతో కలసి కేజ్రీవాల్ పాదయాత్ర చేస్తుండగా.. ఏదో ద్రావణం ఆయనపై చల్లి పైకి దూసుకెళ్లాడు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, ఆప్ నేతలు ఆ యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. శనివారం దక్షిణ ఢిల్లీలోని మాలవీయనగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి పాల్పడిన యువకుడిని అశోక్ ఝాగా పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. కేజ్రీవాల్‌పై చల్లింది నీరే అయి ఉంటుందని భావిస్తున్నారు. ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. 'ఢిల్లీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ దాడి వెనక బీజేపీ హస్తం ఉంది' అని ఆరోపించారు. ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ ఆప్ ఆరోపణలను తిప్పికొట్టారు. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సానుభూతి కోసం కేజ్రీవాల్ మళ్లీ పాత ట్రిక్కునే వాడారు. ఇప్పటికే చెంపదెబ్బలు, ఇంకు చల్లడం చూశాం.. ఇప్పుడు అలాంటిదే మరొకటి. నిందితుడిని విచారిస్తే అన్ని విషయాలు బయటికొస్తాయి' అని వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్‌పై విచారణకు అన్ని అనుమతులు: ఈడీ

న్యూఢిల్లీ, నవంబరు 30: మద్యం విధానం కుంభకోణంలో కేజ్రీవాల్‌ను విచారించేందుకు అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని ఈడీ శనివారం న్యాయస్థానానికి తెలిపింది. ఆయనపై సీబీఐ కేసు నమోదు చేసిన సందర్భంగా తీసుకున్న అనుమతులు సమగ్రమైనవని పేర్కొంది. అవినీతి నిరోధక చట్టంతో పాటు, నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) ప్రకారం కూడా విచారణ జరిపేందుకు సమగ్ర అనుమతులు తీసుకున్నట్టు తెలిపింది. వీటితో పాటుగా దర్యాప్తులో భాగంగా వెలుగులోకి వచ్చే కొత్త నేరాలపైనా విచారణ చేసేందుకు కూడా ముందుగానే అనుమతులు పొందామని వివరించింది. తాను సీఎంగా పనిచేసిన సమయంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు వచ్చినందున ముందస్తు అనుమతులు తప్పనిసరి అని, కానీ ఈడీ ఆ పని చేయలేదని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు.

కశ్మీర్‌లో 4వేల కానిస్టేబుల్ పోస్టులకు 5.59 లక్షల మంది పోటీ

జమ్మూ, నవంబరు 30: జమ్మూకశ్మీర్‌లో 4,002 కానిస్టేబుల్ పోస్టులకు 5.59 లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సగటున ఒక్కో పోస్టుకు 139 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లో 4,002 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 20 జిల్లాల్లోని 856 కేంద్రాల్లో డిసెంబరు 1, 8, 22వ తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. డిసెంబరు 1న 2,62,863 మంది, డిసెంబరు 8న 1,67,609 మంది, డిసెంబరు 22న 1,28,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షను కట్టుదిట్టమైన భద్రత నడుమ అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఎన్నో ఏళ్ల తర్వాత కానిస్టేబుళ్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనందున వయసు కారణంగా తాము అవకాశం కోల్పోయామని పేర్కొంటూ కొంతమంది యువకులు శనివారం ధర్నాకు దిగారు. వయసు సడలింపు ఇవ్వాలని, పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

ఇస్రో-నాసా ఐఎస్ఎస్ మిషన్.. భారత వ్యోమగాములకు ప్రాథమిక శిక్షణ పూర్తి

బెంగళూరు, నవంబరు 30: భారత, అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థలు సంయుక్తంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు చేపట్టనున్న యాక్సియమ్-4 మిషన్‌కు ఎంపిక చేసిన ఇద్దరు భారతీయ వ్యోమగాములు విజయవంతంగా ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్నారని ఇస్రో వెల్లడించింది. గగన్‌యాత్రీలుగా పిలిచే ప్రైమ్ గ్రూపు కెప్టెన్ సుభాన్షు శుక్లా, బ్యాకప్ గ్రూపు కెప్టెన్ ప్రశాంత్ బాలక్రిష్ణన్ నాయక్ ఈ ఏడాది ఆగస్టు మొదటి వారం నుంచి అమెరికాలో శిక్షణ తీసుకుంటున్నారు. ప్రాథమిక దశలో మిషన్ సంబంధిత గ్రౌండ్ ఫెసిలిటీ టూర్లపై అవగాహన, మిషన్ ప్రయోగ దశల అవలోకనం, స్పేస్‌ఎక్స్ సూట్ ఫిట్ తనిఖీలు, అంతరిక్ష ఆహార ఎంపికలపై శిక్షణ పూర్తి చేసుకున్నారని ఇస్రో తెలిపింది. తర్వాతి దశలో మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు చెందిన యూఎస్ ఆర్బిటల్ సెగ్మెంట్ మిగిలిన మాడ్యూల్స్‌ను పరిష్కరించడం, మైక్రో గ్రావిటీ వాతావరణంలో శాస్త్రీయ పరిశోధనలు చేయడంపై శిక్షణ ఇవ్వనున్నారు.

విచారణకు రావాలని వక్కలిగ స్వామిజీకి నోటీసు

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఓటు హక్కు రద్దు చేయాలని వ్యాఖ్యానించిన విశ్వ వక్కలిగ మహా సంస్థానం మఠాధిపతి చంద్రశేఖరనాథ స్వామిజీకి ఉప్పారపేట పోలీసులు నోటీసులు జారీ చేశారు. డిసెంబరు 2వ తేదీ ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని సూచించారు. దీంతో స్వామిజీ ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే ఆయన ముస్లింలకు క్షమాపణలు తెలిపారు. తాజాగా శనివారం ఆయన స్పందిస్తూ, తమ మఠానికి ముస్లింలు కూడా భక్తులుగా వస్తారన్నారు. నోటీసు విషయం తెలియదని, తనకు ఆరోగ్యం బాగా లేదని, కేన్సర్‌తో విశ్రాంతి తీసుకుంటున్నానని తెలిపారు.

9599687085

- రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు దేశవ్యాప్త హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ, నవంబరు 30: మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కోసం క్యాన్సర్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కొందరు ప్రముఖ వైద్యులు బృందంగా ఏర్పడి హెల్ప్‌లైన్ నంబర్ 9599687085ను ప్రారంభించారు. దేశంలో రొమ్ము క్యాన్సర్‌పై ఏర్పాటు చేసిన మొట్టమొదటి హెల్ప్‌లైన్ ఇదే. ఇది ఎల్లవేళలా(24/7) అందుబాటులో ఉంటుంది. ఎవరైనా ఈ నంబర్‌కు కాల్ చేసి రొమ్ము క్యాన్సర్ పట్ల ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు. వైద్యుల సలహాలు తీసుకోవచ్చు. వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స అందించడానికి కూడా ఈ టోల్ ఫ్రీ నంబర్ దోహదం చేస్తుందని సీనియర్ వైద్యుడు అశీశ్ గుప్తా చెప్పారు. ఆయనే క్యాన్సర్ ముక్త్ భారత్ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్నారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకుంటే 50% వరకు డిస్కౌంట్ ఉంటుందని ఆయన తెలిపారు. మహిళల్లో ఈ వ్యాధిని తొలిదశల్లోనే గుర్తించి చికిత్స అందించడం ఈ హెల్ప్‌లైన్ వెనుక ప్రధాన ఉద్దేశ్యమని ఆయన వివరించారు. 50-64ఏళ్ల మధ్య వయస్సున్న మహిళలకు రొమ్ము క్యాన్సర్ ముప్పు ఎక్కువని చెప్పారు. అయితే, ఇటీవలి కాలంలో నమోదైన కేసుల్లో 25% కేసులు 40 ఏళ్ల లోపు వారివేనని ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో భారతదేశంలో 2లక్షల మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడ్డారని అంచనా.

చెన్నై జలదిగ్బంధం

(మొదటి పేజీ తరువాయి)



చెన్నైలో నీట మునిగిన మౌంట్ రోడ్డు

చిక్కుకున్నాయి. నగరంలో ప్రభుత్వ రవాణా 80 శాతం స్తంభించింది. కొన్నిచోట్ల రోడ్లపై మోకాలిలోతు నీరు నిలిచిపోవడంతో పాదచారులు సైతం తిరగలేని పరిస్థితి నెలకొంది. మూడు రోజుల నుంచి వణికిస్తున్న ఫెంగల్ తుపాను తీరానికి సమీపించే కొద్దీ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించడంతో తమిళనాడులోని 9 జిల్లాల్లో శుక్రవారం నుంచి విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. చెన్నైతో పాటు కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కడలూరు, రాణిపేట, విల్లుపురం, మైలాడుదురై, నాగపట్నం, తిరువారూర్, తంజావూర్, పుదుకోట, రామనాథపురం, తిరునల్వేలి, కన్నియాకుమారి, పుదుచ్చేరి, కారైక్కాల్ జిల్లాల్లో శుక్రవారం నుంచి శనివారం రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. కొన్ని చోట్ల ఈదురుగాలులు కూడా తోడవ్వడంతో వృక్షాలు కూలిపోయాయి. దీనికి తోడు సముద్రం అల్లకల్లోలంగా తయారైంది. తీర ప్రాంతాల్లో 75-95 కి.మీ వేగంతో గాలులు వీయడంతో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల సముద్రపు అలలు 7 మీటర్ల ఎత్తుకు ఎగసిపడ్డాయి. తిరుచ్చెందూర్‌లో సముద్రపు నీరు 80 అడుగుల మేర వెనక్కి వెళ్లడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. చెన్నైలో విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు కూడా మూతబడ్డాయి. సహాయ చర్యల కోసం 30 వేల మంది పోలీసులు, 18 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విద్యుదాఘాతానికి గురై చెన్నైలోని ప్యారీస్ ప్రాంతంలో ఒకరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లోనూ ఒక్కొక్కరు మరణించారు.

7 జిల్లాలకు రెడ్ అలెర్ట్..

ఆదివారం చెన్నైతో పాటు 7 జిల్లాలకు రెడ్ అలెర్ట్, 9 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. రెడ్ అలెర్ట్ జారీ చేసిన చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు, రాణిపేట తదితర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించింది.

విమానాల మళ్లింపు..

ఈదురు గాలులతోపాటు రన్‌వేపై వరదనీరు చేరడంతో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం ఉదయం వరకు చెన్నై విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. చెన్నై రావాల్సిన 10 విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. చెన్నై నుంచి బయలుదేరాల్సిన 55 విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతో అత్యవసరంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెన్నైలో శనివారం మధ్యాహ్నం నుంచి సబర్బన్ రైలు సేవలు సైతం పాక్షికంగా నిలిచిపోయాయి. అదేవిధంగా చెన్నై రావాల్సిన కొన్ని ఎక్స్‌ప్రెస్‌లను సైతం నగర శివారు స్టేషన్ల నుంచే వెనక్కి మళ్లించారు.

అమ్మా క్యాంటీన్లు కిటకిట..

చెన్నైవ్యాప్తంగా వరదనీరు చేరడంతో ఉపాధి లేని కూలీలు, హోటళ్లు లేక సాధారణ ప్రజలు తీవ్ర అవస్థలు పడే అవకాశముందన్న కారణంగా శనివారం చెన్నైలోని అమ్మా క్యాంటీన్లలో ఉచితంగా ఆహారం అందించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలు జారీ చేశారు. క్యాంటీన్‌కు వచ్చినవారందరికీ ఎలాంటి నిబంధనలూ లేకుండా ఆహారం అందించాలని స్పష్టం చేశారు. దీంతో అమ్మా క్యాంటీన్ల వద్ద రద్దీ నెలకొంది.

10 విమాన సర్వీసులు రద్దు

శంషాబాద్ రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోనూ పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శంషాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన 7 విమానాలు, చెన్నై వెళ్లాల్సిన మరో మూడు విమానాలను శనివారం వాతావారణం అనుకూలించక రద్దు చేశారు. ముంబై నుంచి చెన్నై వెళ్లాల్సినఇండిగో విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. విమానంలో మహిళలు, చిన్నపిల్లలు సహా 200 మంది ప్రయాణికులు ఉన్నారు. అలాగే ఢిల్లీ నుంచి చెన్నై వెళ్లాల్సిన ఎయిరిండియా విమానాన్ని శంషాబాద్‌లో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించారు. ఎయిర్‌లైన్స్ అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు ప్రత్యేక బస ఏర్పాటు చేసినట్లు సమాచారం. విమానాలు రద్దవడంతో టికెట్ డబ్బులు వెనక్కివ్వాలని శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళనకు దిగినట్లు సమాచారం.

లోకం తీరు



అక్రమాస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా నీటిపారుదల శాఖ ఏఈఈ

అమెరికా అదానీని క్రిమినల్ అన్నా మోదీ ఆయన్నే సమర్థిస్తున్నారు

విద్వేషం, విభజనకు బీజేపీ ఆజ్యం: రాహుల్

వయనాడ్, నవంబరు 30: దేశంలో విద్వేషాలు, విభజనకు బీజేపీ ఆజ్యం పోస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. పారిశ్రామికవేత్త అదానీకి ప్రధాని మోదీ అండగా ఉన్నారని ధ్వజమెత్తారు. ఇటీవల లోక్‌సభకు ఎన్నికైన వయనాడ్ ఎంపీ, తన చెల్లెలు ప్రియాంకతో కలిసి శనివారం వయనాడ్‌లో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. 'లోక్‌సభలో ఓ రాజకీయ సిద్ధాంతంపై మేం పోరాడుతున్నాం. బీజేపీ మాత్రం విద్వేషం, విభజన, కోపం, హింసల గురించి మాట్లాడుతోంది. రాజ్యాంగం ప్రజలందరినీ సమానంగా చూడాలని చెబుతోంది. మోదీ మాత్రం అదానీని ప్రత్యేకంగా చూస్తున్నారు. అదానీని అమెరికా క్రిమినల్ అని అన్నా, ముడుపుల కేసులో ఆయనపై అభియోగాలు మోపినా లెక్కచేయనని.. ఇక్కడ మాత్రం అభియోగాలు మోపబోమని ప్రధాని చెబుతున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. వయనాడ్ ప్రజల హృదయాల్లో ఉన్న భావనే ప్రియాంకను ఎంపీ స్థాయికి తీసుకొచ్చిందన్నారు.

ఈసీ.. మోదీ ఇంటి ముందు కుక్క

- మహారాష్ట్ర కాంగ్రెస్ నేత భాయ్ జగ్‌తప్ తీవ్ర వ్యాఖ్య



న్యూఢిల్లీ/పుణె, నవంబరు 30: ఎన్నికల కమిషన్‌పై మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత, శాసనమండలిలో ఆ పార్టీ ఉప నేత భాయ్ జగ్‌తప్ తీవ్ర విమర్శ చేశారు. ప్రధాని మోదీ ఇంటి ముందు కూర్చున్న కుక్క అని శుక్రవారం ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి నెలకొల్పిన వ్యవస్థలన్నీ మోదీ ప్రభావంతో కీలుబొమ్మలుగా మారాయి. మహారాష్ట్ర ప్రజలు బీజేపీ-శివసేన-ఎన్‌సీపీలతో కూడిన మహాయుతి సర్కారుకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. అయితే ఈవీఎంల ట్యాంపరింగ్‌తో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వేరుగా వచ్చాయి. ప్రధాని తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు బ్యాలెట్ పేపర్లు వాడాలన్నారు. మరి ఇప్పుడు ఏమైంది' అని నిలదీశారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. ఈసీ పరువుకు భంగం కలిగించే విధంగా మాట్లాడారని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మండిపడ్డారు. మహారాష్ట్ర బీజేపీ జగ్‌దప్‌పై ఈసీకి, ముంబై పోలీసు కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసింది. తన వ్యాఖ్యలపై పెద్దఎత్తున దుమారం రేగుతున్నా.. క్షమాపణ చెప్పేందుకు ఆయన నిరాకరించారు. మరోవైపు, మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న కాంగ్రెస్ ఆరోపణలను ఎన్నికల కమిషన్ (ఈసీ) ఖండించింది. వాటిలో వాస్తవం లేదని స్పష్టంచేసింది. ఆ పార్టీ లేవనెత్తిన అంశాలపై మంగళవారం (3న) చర్చలకు ఆహ్వానించింది. ఈసీ కార్యదర్శి ఎస్‌కే దాస్ కాంగ్రెస్ తరఫు న్యాయవాది ఉమర్ హోడాకు ఈ మేరకు శనివారం లేఖ రాశారు.

ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, ధనబలం: పవార్

మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్నికల యంత్రాంగాన్ని నియంత్రించేందుకు పెద్దఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని.. ధన బలం కూడా ప్రయోగించారని ఎన్‌సీపీ(ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ ఆరోపించారు. ఇంత దుర్వినియోగం లోక్‌సభ ఎన్నికల్లో గానీ, మరే రాష్ట్ర ఎన్నికల్లో గానీ జరుగలేదని ధ్వజమెత్తారు. ఈవీఎంలలో అవకతవకలపై జ్యోతిబా ఫూలే నివాసంలో సీనియర్ సామాజిక కార్యకర్త బాబా అధవ్ చేపట్టిన మూడ్రోజుల నిరసన కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈవీఎంలలో అదనంగా కొన్ని ఓట్లు వేశారని మహా వికాస్ అఘాడీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో కొంత నిజముందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో అధికార దుర్వినియోగాన్ని చూస్తుంటామని.. అయితే డబ్బు, అధికార దుర్వినియోగంతో ఎన్నిక యంత్రాంగం మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకోవడం ఇంతకుముందెన్నడూ చూడలేదని చెప్పారు.

మతపరమైన ఉద్రిక్తతలపై తక్షణ చర్యలు తీసుకోండి

- ప్రధానికి విశ్రాంత ఉన్నతాధికారుల లేఖ
- మాజీ సీఈసీ, ఢిల్లీ మాజీ ఎల్జీ సంతకం

న్యూఢిల్లీ, నవంబరు 30: దేశంలో పెరుగుతున్న మతపరమైన ఉద్రికత్తలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరుతూ ప్రముఖ విశ్రాంత ఐఏఎస్ అధికారులు, దౌత్యవేత్తలు, ప్రజాప్రతినిధుల బృందం ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాసింది. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో హిందూ-ముస్లిం సంబంధాలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేసింది. మతపరమైన విభేదాలను తీవ్రతరం చేసిన ఘటనల నేపథ్యంలో మైనారిటీ వర్గాలైన ముస్లింలు, కొంతవరకూ క్రైస్తవుల్లో తీవ్ర ఆందోళన, అభద్రతా భావం చోటు చేసుకున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి పాలనా యంత్రాంగం ముస్లింలపై హింస, వివక్షను ప్రోత్సహిస్తూ, వారిపట్ల పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. గొడ్డు మాంసం తీసుకెళ్తున్నారన్న ఆరోపణలపై వ్యక్తులను కొట్టి చంపడం, విద్వేష ప్రసంగాలు, ముస్లింల ఇళ్లను ధ్వంసం చేయడం వంటి ఘటనలు ఈ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. ముస్లింల యాజమాన్యంలో ఉన్న వ్యాపారాలపై దాడులు జరుగుతున్నాయని, ఇది దేశ ఆర్థిక, సామాజిక పతనానికి దారి తీస్తుందని హెచ్చరించారు. విభజన శక్తులకు వ్యతిరేకంగా దృఢమైన వైఖరి తీసుకోవాలని, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని గౌరవించేలా, చట్టబద్ధ పాలనను నిలబెట్టేలా చూడాలని కోరారు. ఇటువంటి అలజడుల నేపథ్యంలో సమాజం పురోభివృద్ధి చెందడం సాధ్యం కాదని, 'అభివృద్ధి చెందిన భారత్' కల నెరవేరబోదని ఆ లేఖలో పేర్కొన్నారు. లేఖపై సంతకాలు చేసిన 17మందిలో ప్రణాళికా సంఘం మాజీ కార్యదర్శి ఎన్‌సీ సక్సేనా, ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ, ఆర్మీ మాజీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఉద్దీన్ షా తదితరులు ఉన్నారు.

కల్యాణ వైభోగమే



పెళ్లి ఖర్చు ఎంతైనా తగ్గేదేలే.. దేశంలో వివాహ సగటు బడ్జెట్ 36.5 లక్షలు

- గతేడాది కంటే 7 శాతం పెరుగుదల
- వేదికలు, కేటరింగ్‌కే ఖర్చు ఎక్కువ
- 2 నెలల్లో రూ. 6 లక్షల కోట్ల వ్యాపారం
- వెడ్‌మీగుడ్ సంస్థ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 30: ఖర్చుకు తగ్గేదేలే. పెళ్లి వేడుక అదిరిపోవాలి. ఇదే ట్రెండ్ ప్రస్తుతం వివాహం చేసుకునే జంటల్లో కనిపిస్తోంది. వివాహ వేడుకను జీవితంలో ఓ మధుర జ్ఞాపకంలా నిలుపుకోవడానికి ఖర్చుకు వెనుకాడటం లేదు. వివాహ వేడుకల తీరు కల్యాణ మండపాలు, కన్వెన్షన్ సెంటర్లు దాటి డెస్టినేషన్ వెడ్డింగ్ వరకు వచ్చింది. ప్రీ వెడ్డింగ్ షూట్లు, హల్దీ ఫంక్షన్లతో హడావుడి కూడా బాగా పెరిగింది. అలాగే బడ్జెట్ కూడా పెరిగింది. వేలు, లక్షలు దాటి కోట్లకు చేరింది. ఇటీవలే మనం చూశాం.. మన దేశ కుబేరుడు ముకేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ కల్యాణాన్ని న భూతో న భవిష్యతి అన్నట్లే చేశారు. ఈ పెళ్లికి సుమారు రూ. 5 వేల కోట్లు ఖర్చు అయిందని అంచనా వేశారు. వివాహం అద్వితీయంగా చేసుకోవాలనే ఆలోచనతో ప్రజలు ఖర్చుకు వెనుకాడటం లేదు. ఈ ఏడాది భారతీయుల వివాహ బడ్జెట్ గణనీయంగా పెరిగింది. అది సగటున రూ. 36.5 లక్షలకు పెరిగిందని వెడ్‌మీగుడ్ అనే వెడ్డింగ్ ప్లానింగ్ కంపెనీ అధ్యయనంలో వెల్లడైంది. అదే డెస్టినేషన్ వెడ్డింగ్ అయితే సగటున రూ. 51 లక్షలుగా ఉందని ఆ కంపెనీ తెలిపింది. గతేడాది కంటే ఇది 7 శాతం పెరిగిందని అంచనా వేసింది. వేదిక, కేటరింగ్ ఖర్చులు ఏటేటా 10 శాతం చొప్పున పెరగడమే పెళ్లి బడ్జెట్ హెచ్చు అవడానికి మూల కారణమని వెల్లడించింది. జ్యూయలరీ, డెకొరేషన్‌కు కూడా బాగానే వ్యయం అవుతోంది. డెస్టినేషన్ వెడ్డింగ్ కాన్సెప్ట్ వచ్చాక ఇప్పుడు పెళ్లి వేడుకకు కోటి రూపాయలు ఖర్చు సాధారణం అయిపోయింది. సెలబ్రిటీల వెడ్డింగ్‌ల ప్రభావం కూడా దీనిపై ఉంది. తమ పెళ్లి వేడుక లాంటిది మరొకటి ఉండకూడదని కూడా భావిస్తూ జంటలు ఖర్చుకు వెనుకాడటంలేదు. "ఎంత వీలైతే అంత గొప్పగా వివాహ వేడుక చేసుకోవాలని అంతా భావిస్తున్నారు. వేదికకు ఎక్కువ బడ్జెట్ కేటాయిస్తున్నారు. దాని తర్వాత కేటరింగ్‌కు, మంచి వెడ్డింగ్ ప్లానింగ్ ఏజెన్సీకి ఖర్చు చేస్తున్నారు. మంచి ఇల్లు కొనడానికి, పిల్లలకు ఘనంగా పెళ్లి చేయడానికే తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారు" అని టైలర్‌మేడ్‌ఎక్స్‌పీరియన్స్ అనే సంస్థ ఫౌండర్ శంశాక్ గుప్తా తెలిపారు. "ప్రస్తుతం వివాహం స్వభావం మారిపోయింది. పెళ్లిళ్లలో చిందులకు జెనరేషన్ జెడ్ తరం జంటలు మక్కువ చూపుతున్నాయి. రెస్టారెంట్లపైన కాక్‌టైల్ పార్టీలా పెళ్లి వేడుకను మార్చేస్తున్నారు. థీమ్డ్ వెల్‌కం డిన్నర్లను చూస్తే పాశ్చాత్య ప్రభావం మన వాళ్లపైన ఎలా ఉందో తెలుస్తోంది" అని వెడ్‌మీగుడ్ కోఫౌండర్ మెహెక్ సాగర్ సహానీ అన్నారు.

రెండు నెలల్లో 48 లక్షల పెళ్లిళ్లు

వివాహాల బడ్జెట్ పెరగడంతో కొత్త ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. ప్రత్యేకమైన కేటరింగ్ చేసే వారికి, ఆర్టిస్టులకు ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో సుమారు 48 లక్షల వివాహాలు జరుగుతాయని కాన్ఫడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్(సీఏఐటీ) అంచనా వేసింది. ఈ వివాహాల ద్వారా సుమారు రూ. 6 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని లెక్కలుగట్టింది.

సెలబ్రిటీల వివాహ ఖర్చు ఇలా..


ఇషా అంబానీ, ఆనంద్ పిరామిల్: **రూ. 700 కోట్లు**
సుశాంతో రాయ్, సీమంతో రాయ్: **రూ. 554 కోట్లు**
బ్రాహ్మణిరెడ్డి, రాజీవ్ రెడ్డి: **రూ. 500 కోట్లు**
శృష్టి మిత్తల్, గుల్‌రాజ్ బెహల్: **రూ. 500 కోట్లు**
వనిశా మిత్తల్, అమిత్ భాటియా: **రూ. 240 కోట్లు**
సోనమ్ వశ్వానీ, నవీన్ ఫాబియానీ: **రూ.210 కోట్లు**
విరాట్ కోహ్లీ, అనుష్కా శర్మ: **రూ. 100 కోట్లు**
అదెల్ సజన్, సనా ఖాన్: **రూ. 100 కోట్లు**
రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్: **రూ. 77 కోట్లు**

అధ్యయన వివరాలు ఇవీ..

సర్వేలో పాల్గొన్న జంటలు: **3,500**
కోటి కన్నా ఎక్కువ ఖర్చు చేస్తామన్న వారు: **9%**
50 లక్షల నుంచి రూ. కోటి ఖర్చు : **9%**
15 లక్షల కన్నా తక్కువ చేస్తామన్నవారు: **40%**
15 లక్షల నుంచి రూ. 25 లక్షలు ఖర్చు చేస్తామన్నవారు: **19%**
25 లక్షల నుంచి రూ. 50 లక్షలు ఖర్చు చేస్తామన్నవారు: **23%**
పెళ్లికి వ్యక్తిగత, కుటుంబ సేవింగ్స్ మాత్రమే ఖర్చు చేస్తామన్నవారు: **82%**
లోన్లు తీసుకుంటామన్నవారు: **12%**
ఆస్తులు అమ్మి పెళ్లి చేసుకుంటాం అన్నవారు:**6%**

యుద్ధ రంగం నుంచి ఉక్రెయిన్ సైనికుల పలాయనం

లక్ష మందికి పైగా వెనక్కి



నాటోలో కలపండి

రష్యాతో యుద్ధాన్ని ముగించాలంటే.. తమ దేశ భూభాగాన్ని నాటో పరిధిలోకి తీసుకురావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. మా భూభాగానికి భద్రత కల్పిస్తామని నాటో హామీ ఇవ్వాలని, అప్పుడే తాము కాల్పుల విరమణకు అంగీకరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అయితే.. తన సూచనను నాటో పరిగణనలోకి తీసుకుంటుందా? అని చెప్పలేమని, అసలు తమను నాటోలో చేర్చుకుంటారో లేదో కూడా చెప్పలేని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.

కీవ్, నవంబరు 30: దాదాపు మూడేళ్లుగా 'తెగదు-ముడిపడదు' అన్నట్లుగా రష్యాతో యుద్ధం కొనసాగుతుండడంతో.. ఉక్రెయిన్ సైనికులు కదనరంగం నుంచి జారుకుంటూ.. కాలికి బుద్ధిచెబుతున్నారు. గడిచిన ఆర్నెల్లుగా ఈ జాడ్యం మరింతగా పెరిగిందని ఉక్రెయిన్ సైన్యాధికారులు చెబుతున్నారు. ఈ కారణంతో వుహెల్దర్ వంటి కీలక భూభాగాలను ఉక్రెయిన్ కోల్పోవాల్సి వచ్చిందంటున్నారు. ఒకవేళ కాల్పుల విరమణకు రష్యాతో చర్చలు జరిగితే.. తాజా పరిణామాలు తమకు ప్రతికూలంగా మారే ప్రమాదాలున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022 ఫిబ్రవరి 24న రష్యా దురాక్రమణ ప్రారంభమైనప్పటి నుంచి లక్ష మందికి పైగా ఉక్రెయిన్ సైనికులు చెప్పాపెట్టకుండా విధులకు ఎగనామం పెట్టినట్లు అధికారిక గణాంకాలు చెబుతుండగా.. అనధికారికంగా ఈ సంఖ్య 2 లక్షలకు పైనే ఉంటుందని అంచనా. రష్యాతో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్ సైన్యం పలచబడుతోంది. మరణాలు, గాయాలతోపాటు.. అనారోగ్య సమస్యలతో సెలవులు పెట్టి, తిరిగి రానివారు.. చెప్పాపెట్టకుండా వెళ్లిపోయినవారి వల్ల ఈ పరిస్థితి నెలకొందని 72 బ్రిగేడ్‌కు చెందిన ఓ అధికారి వెల్లడించారు.

యుద్ధం భయానకం

రష్యా దాడులు భయానకంగా ఉంటున్నాయని, వాటిని తట్టుకుని, ఎదురుదాడి చేసే వనరులు తమ వద్ద లేవని సైన్యంలో విధులకు ఎగనామం పెట్టిన సెర్హీ నెజ్డిలోప్ అనే సైనికుడు పేర్కొన్నారు. "క్షేత్రస్థాయిలో పరిస్థితులు దారుణంగా ఉంటున్నాయి. రష్యా మాపై 50 షెల్స్‌ను ప్రయోగిస్తే.. మా సామర్థ్యం ఒక షెల్ మాత్రమే..! రష్యా దాడుల్లో మా తోటి సైనికుల శరీరాలు ఛిద్రమవ్వడం చూశాను. అరకొర వనరులతో మా పరిస్థితి కూడా అలాగే తయారవుతుందనే ఆందోళనతో బయటకు వచ్చాను. మా పై అధికారులు క్షేత్రస్థాయిలో ఉండరు. మాకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంటారు. రేడియో సెట్ల ద్వారా ఆదేశాలు జారీ చేస్తారు" అని వివరించారు. సైన్యం కంపెనీల్లో 120 మంది సైనికులు ఉంటారని.. ప్రస్తుతం ఒక్కో కంపెనీలో వారి సంఖ్య 10కి పడిపోయిందని ఓ ఉన్నతాధికారి వివరించారు.

ప్రపంచ మద్దతు కూడగట్టండి

- బంగ్లా దాడులపై కేంద్రానికి ఆరెస్సెస్ వినతి

న్యూఢిల్లీ, నవంబరు 30: బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మద్దతు కూడగట్టాలని ఆరెస్సెస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అన్యాయంగా అరెస్టు చేసిన ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబళే శనివారం డిమాండ్ చేశారు. 'బంగ్లాదేశ్‌లో హిందువులపై ఇస్లామిక్ ఛాందసవాదులు చేస్తున్న దాడులు, హత్యలు, దోపిడీలు, దహనాలు, అమానవీయ దౌర్జన్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ చర్యలను ఆరెస్సెస్ ఖండిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం, ఇతర ఏజెన్సీలు హింసను అంతం చేయలేని నిశ్శబ్ద ప్రేక్షకులుగా మిగిలిపోయాయని ఆరెస్సెస్ ఆరోపించింది. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రత కోసం ప్రపంచ వ్యాప్తంగా 150కి పైగా దేశాల్లోని లక్షలాది మంది ఇస్కాన్ భక్తులు ఆదివారం (డిసెంబరు 1న) ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇదిలాఉండగా, చట్టోగ్రామ్‌లో శుక్రవారం వందలాది మంది ఆందోళనకారులు హిందూ వ్యతిరేక, ఇస్కాన్ వ్యతిరేక నినాదాలు చేస్తూ.. మూడు దేవాలయాలపై దాడికి పాల్పడ్డారు.

తాడేపల్లి ప్యాలెస్‌కు.. కప్పం 50 వేలు!



అమ్మఒడి పథకం కింద బడికి వెళ్లే పిల్లలున్న కుటుంబాలకు జగన్ ఐదేళ్లలో ఇచ్చింది రూ.55 వేలు. మద్యం అలవాటున్న కుటుంబాల నుంచి జేట్యాక్స్ రూపంలో ఐదేళ్లలో వసూలు చేసింది రూ.50 వేలు. అంటే అమ్మఒడికి ఎంత ఇచ్చారో దాదాపుగా అంతే స్థాయిలో వెనక్కి లాక్కున్నారు.

జేట్యాక్స్ అంటే మద్యం సీసా తయారీ ఖర్చు, ప్రభుత్వానికి వెళ్లే పన్నులు కాదు. వాటికి అదనంగా వైసీపీ పెద్దలకు చెల్లించిన ముడుపులు. ఈ రూపంలో ఒక్కో వ్యక్తి ఐదేళ్లలో అక్షరాలా రూ.50 వేలకు పైగా కప్పం కట్టాడు.

గత ఐదేళ్లలో ఒక్కో మందుబాబు కట్టిన జేట్యాక్స్ ఇది

క్వార్టర్ సీసాపై రూ.30-50 బాదుడు

- మద్యం తాగేవారిని నిలువునా దోచిన నాటి ప్రభుత్వం
- అమ్మఒడికి ఇచ్చిందంతా లిక్కర్‌లో బాదుడు
- కమీషన్ల కోసం కంపెనీలకు అధిక ధరల చెల్లింపు
- పెంచిన మొత్తం జేట్యాక్స్ రూపంలో నాటి ప్రభుత్వ పెద్దల జేబుల్లోకే
- పేదల సంపాదనలో సగం తాగుడుకే
- ఇప్పుడు జగన్ దిగిపోవడంతో జేట్యాక్స్‌కు చెల్లు
- టెండర్ల కమిటీ ముందుకు వెళ్లకముందే ధరలు తగ్గిస్తున్న కంపెనీలు
- ముడుపుల బాధ లేకపోవడం వల్లే!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సంపూర్ణ మద్యపాన నిషేధం హామీతో గద్దెనెక్కిన జగన్.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోగా మద్యాన్ని కమీషన్లకు కేంద్రంగా వాడుకున్నారు. ఎక్కడా వసూళ్లు అనే పదం కనిపించకుండా పక్కా ప్లాన్‌తో ఏకంగా మద్యం కంపెనీల నుంచే ప్రభుత్వ పెద్దలు ముడుపులు వసూలు చేసుకున్నారు. ఫలితంగా కంపెనీలకు ఇచ్చే ధర కంటే అదనంగా చెల్లించారు. ధర పెంచడంతో ఆ భారం వినియోగదారులపై పడింది. పక్క రాష్ట్రాల్లో లేని ధరలు మన దగ్గర బాదారు. ఒక బ్రాండ్ ధర పొరుగు రాష్ట్రంలో క్వార్టర్ రూ.170 ఉంటే ఏపీలో రూ.220కి అమ్మారు. ఒకే బ్రాండ్, ఒకే పరిమాణం, ఒకే క్వాలిటీ అయినప్పుడు ఇంత తేడా ఎలా వచ్చింది? ఈ ప్రశ్నకు అప్పటి ప్రభుత్వం సమాధానం చెప్పలేదు. పోనీ అలా భారీగా పెంచిన ధరల వల్ల వచ్చిన పన్నులు ప్రభుత్వానికి వెళ్లాయా అంటే అదీ లేదు. వినియోగదారుల నుంచి కంపెనీలకు వెళ్లి, అక్కడినుంచి జేట్యాక్స్ రూపంలో తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయి. ఇలా అన్ని బ్రాండ్లపై అదనంగా వసూలు చేశారు. సగటున చూస్తే క్వార్టర్‌పై రూ.30 అదనంగా బాదేశారు. ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే మందుబాబులు ప్రతిరోజూ వారి సంపాదన నుంచి సగటున రూ.30 తాడేపల్లి ప్యాలెస్‌కు జేట్యాక్స్ కట్టారు. అది ఐదేళ్లకు లెక్కిస్తే రూ.50 వేలు దాటిపోయింది. అదే జేట్యాక్స్ లేకపోతే ప్రతిరోజూ మందు తాగినా ఆ రూ.50 వేలు పేద కుటుంబాలకు మిగిలేవి. కానీ కమీషన్లే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పేదల జేబులు ఖాళీ చేసి మరీ అదనపు వసూళ్లకు తెగబడింది. కూటమి ప్రభుత్వం ఇప్పుడు అవే బ్రాండ్ల ధరలు తగ్గించడంతో అసలు విషయం బయటపడుతోంది.

30 లక్షల కుటుంబాలపై ప్రభావం

జాతీయ సర్వే సంస్థల అంచనాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 30 లక్షల మందికి మద్యం తాగే అలవాటుంది (వీరు కాకుండా అప్పుడప్పుడు తాగేవారూ ఉన్నారు). అంటే 30 లక్షల కుటుంబాలపై గత ప్రభుత్వంలో ఆర్థిక భారం పెరిగింది. అసలే మద్యం ధరలు పెరిగాయనుకుంటే, అదనంగా జేట్యాక్స్‌తో ఇంకా దోపిడీకి గురయ్యారు. 2019-24 మధ్య రాష్ట్రంలో రూ.99,413 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అందులో దాదాపు 10 శాతం జేట్యాక్స్ అనే వాదన ఉంది. అయితే అందరికీ వాటాలు పోగా తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.3,113 కోట్లు అందాయని కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది.

కుటుంబాలు ఛిన్నాభిన్నం

గత ప్రభుత్వంలో పేదల కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయి. మద్యనిషేధం చేస్తారని మహిళలు పెట్టుకున్న ఆశలపై నీళ్లు గుమ్మరించడమే గాక.. మందు పేరుతో దోపిడీ చేశారు. దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తామని చెప్పిన జగన్.. తొలుత భారీగా రేట్లు పెంచారు. అదంతా తాగుడును తగ్గించడానికేనని నమ్మబలికారు. తీరా చూస్తే ధరలు పెంచింది పేదల కోసం కాదని, జేట్యాక్స్ కోసమని తర్వాత బయటపడింది. కరోనా సమయంలో బాగా పెంచి.. తర్వాత తగ్గించుకుంటూ వచ్చారు. అయినా పొరుగు రాష్ట్రాల కంటే ఎక్కువగానే ఉంది. దీనికి ఏకైక కారణం కమీషన్లు. దీంతో అంతకుముందు పేదలు రోజు కూలీలో పావు వంతు మందుకు ఖర్చు పెడితే.. జగన్ జమానాలో సగానికిపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీ పనులు చేసుకునేవారిలో మద్యం అలవాటున్నవారు రోజుకు కనీసం ఒక క్వార్టర్ తాగుతారు. అంటే ప్రతిరోజూ వారి సంపాదనలో మందుకు ఖర్చు పెట్టడమే కాకుండా రూ.30 నుంచి రూ.50 జేట్యాక్స్ కూడా కట్టారు. ఇలా ఏడాదికి రూ.10 వేలు, ఐదేళ్లకు రూ.50 వేలు జేట్యాక్స్ కట్టారు.

ఇప్పుడూ ఆరోపణలేనంటారా?

జగన్ హయాంలో మద్యం ధరలు పెంచినప్పటి నుంచీ ఈ కమీషన్ల వ్యవహారంపై విమర్శలు ప్రారంభమయ్యాయి. జేట్యాక్స్ కోసమే భారీగా రేట్లు పెంచారని అప్పట్లో ప్రతిపక్షాలు విమర్శించాయి. కాదని అప్పట్లో వైసీపీ తీవ్రంగా ఖండించింది. మద్యం కంపెనీలే ధరలు పెంచాయంటూ ఐదేళ్లపాటు నమ్మించే ప్రయత్నం చేసింది. అదే నిజమైతే ఇప్పుడా కంపెనీలు ధరలు తగ్గించడం ఎలా సాధ్యమైంది? ప్రభుత్వం మారిపోగానే ధరలు ఎందుకు తగ్గించుకుంటున్నాయి? త్వరలో టెండర్ల కమిటీ ముందు చర్చలు జరగాల్సి ఉన్నా ముందుగానే ఎందుకు రేట్లు తగ్గించేశాయి? ఇప్పుడు కమీషన్లు లేవన్నదే వీటికి సమాధానం. దాదాపుగా అన్ని కంపెనీలు ప్రస్తుతం ఇస్తున్న ధర కంటే తక్కువకే మద్యం సరఫరా చేస్తామని ముందుకొస్తున్నాయి. కమీషన్ల బెడద తీరడంతో ఇంత కాలం అదనంగా తీసుకున్న నగదును వదులుకునేందుకు సిద్ధపడుతున్నాయి.

తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేధం

» ఉల్లంఘిస్తే చర్యలు: టీటీడీ

తిరుమల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రాజకీయ ప్రసంగాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది. 'తిరుమల పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలలో కొంతకాలంగా కొందరు రాజకీయ నాయకులు దర్శనం తర్వాత ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ బోర్డు ఇటీవల తీర్మానించింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, రాజకీయ ప్రసంగాలకు దూరంగా ఉండి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు' అని శనివారం ఓ ప్రకటనలో టీటీడీ పేర్కొంది.



విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, గవర్నర్ అబ్దుల్ నజీర్

యువతే మన దేశ భవిష్యత్

» మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

తాడేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యువతే మన దేశ భవిష్యత్ అని, విద్య వలన వినయం వస్తుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి కేఎల్‌యూ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ యువతకు శారీరక దృఢత్వం అవసరమని యోగా, ప్రాణాయామం, వ్యాయామం చేస్తూ ఎప్పుడూ దృఢంగా ఉండాలన్నారు. వినయం మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళుతుందన్నారు. 21వ శతాబ్దంలో కేవలం డిగ్రీ ఉంటే సరిపోదని, డిగ్రీతోపాటు నైపుణ్యాలు నేటి యువతకు అవసరమని పేర్కొన్నారు. ప్రపంచం నూతన ఆవిష్కరణలతో దూసుకుపోతోందని, అందులో భారత యువత కూడా ఏమాత్రం తీసిపోదన్నారు. నిత్యం నేర్చుకునే తత్వమే అత్యంత శక్తిమంతమైన ఆయుధమన్నారు. చదువుకునేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎంతో మంది ఉంటారని, తానూ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినవాడినేని తెలిపారు. ఉన్నత పాఠశాల విద్య కోసం రోజూ 6 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి వచ్చేవాడినని తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా 2024 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 4,706 మందికి డిగ్రీలు, 42 బంగారు, 37 రజిత పతకాలు, 166 పీహెచ్‌డీ, 604 పీజీ, 3,936 యుజీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

టీసీఎస్ ప్రాంగణ ఎంపికల్లో ఆర్వీఆర్ అండ్ జేసీ హవా

» వివిధ బ్రాంచీల్లో 321 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బహుళజాతి సంస్థ టాటా కన్సల్‌టెన్సీ సర్వీసెస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో గుంటూరు ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారని, అత్యధిక మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శనివారం తెలిపారు. టీసీఎస్ ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు ప్రైమ్‌రోల్ రూ.9 లక్షలు, డిజిటల్ రోల్ రూ.7లక్షలు, నింజా రోల్ 3.5 లక్షలు తదితర భారీ ప్యాకేజీలతో మొత్తం 321 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రకటించారు. ఇందులో సీఎస్ఈ విద్యార్థులు 102 మంది, ఈసీ నుంచి 51, ఐటీ నుంచి 45, సీఎస్ఎం నుంచి 33, సీఎస్‌బీఎస్ నుంచి 26, సీఎస్‌డీ నుంచి 20, ఐఓటి నుంచి 20, ఈఈఈ నుంచి 9, మెకానికల్ నుంచి 5, సివిల్ నుంచి 3, ఎంసిఏ నుంచి ఏడుగురు చొప్పున మొత్తం 321 మంది ఉద్యోగాలు సాధించారని వివరించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అవసరమైన శిక్షణ అందించడం వల్లే అత్యధిక మంది ఉద్యోగాలు సాధించారని ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను శనివారం కళాశాలలో అభినందించారు.

దేవాలయ భూమిని కొట్టేసిన వైసీపీ సర్పంచ్!

- రూ.3 కోట్లు స్వాహా చేసిన ఫీల్డ్ అసిస్టెంట్
- టీడీపీ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదుల వెల్లువ

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వం దేవాలయానికి కేటాయించిన భూమిని వైసీపీకి చెందిన సర్పంచ్ దొంగ పట్టాతో స్వాహా చేశాడని, ఆ భూమిని తిరిగి ఆలయానికి ఇప్పించాలని గ్రామస్థులు టీడీపీ గ్రీవెన్స్ కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు శనివారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం సానిపాయి గ్రామంలోని శివాలయానికి 2019లో ప్రభుత్వం కొంత భూమి కేటాయించిందని, గ్రామ సర్పంచ్ నేతి ఆంజనేయులు అధికారులతో కుమ్మక్కై, తనకు 1978లోనే ఆ భూమికి పట్టా ఇచ్చినట్లు దొంగ రికార్డులు సృష్టించి కబ్జా చేశారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరులో ఉపాధి హామీ పథకం పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ రూ.3 కోట్ల మేర అక్రమాలకు పాల్పడ్డాడని, అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చారు. మునీస్ షరీఫ్ అనే ఏఆర్ కానిస్టేబుల్ తనను పెళ్లి చేసుకొంటానని నమ్మించి ఎంగేజ్‌మెంట్ చేసుకొని, రూ.50 లక్షలు ఇస్తేనే చేసుకొంటానని షరతులు పెడుతున్నాడని బాపట్ల జిల్లా చినగంజాంకు చెందిన సయ్యద్ కరిష్మా గోడు వెళ్లబోసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో తనపై అట్రాసిటీ చట్టం సహా పలు కేసులు పెట్టి వేధించారని, చంద్రబాబు అరెస్టు సమయంలో అప్పటి ఎస్సై తనను బైండోవర్ చేయడంతో పాటు తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేశారని కోనసీమ జిల్లా ఆదురు గ్రామానికి చెందిన కొల్లు నరసింహారావు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

» విజయనగరం జిల్లాలో ఘటన

భోగాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపాన జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు శ్రీకాకుళం జిల్లా వాసులు దుర్మరణం చెందారు. ఓ కారు పంక్చరై డివైడర్ దాటుకుని అవతల వైపునకు వెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న శ్రీకాకుళం నగరానికి చెందిన గవిడి వెంకటరమణ కౌశిక్(27), మొడి జయేశ్(20), వడ్డి మణిబాల(24), వడ్డి అభినవ్(27) అక్కడికక్కడే మృతి చెందగా లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి.



మీగడ రామలింగస్వామికి గురజాడ పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలి

జస్టిస్ ఎన్వీ రమణ

విజయనగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష సజీవంగా ఉండాలంటే మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని విజయనగరంలోని ఆనందగజపతిరాజు ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన గురజాడ విశిష్ట పురస్కారం ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత, దర్శకుడు మీగడ రామలింగస్వామికి పురస్కారాన్ని అందజేశారు. అనంతరం జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ పరభాష వ్యామోహంలో పడి మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదని సూచించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ జీవో జారీ చేయడం దురదృష్టకరమని, ఆ కేసును హైకోర్టు కొట్టివేసినా, సుప్రీంకోర్టుకు వెళ్లారని, తెలుగు భాషను రక్షించేందుకైనా రాష్ట్ర ప్రభుత్వం ఆ కేసును ఉపసంహరించుకోవాలని జస్టిస్ రమణ సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జనమే వేస్తారు... జగన్‌పై దావా!

అదానీ కంపెనీతో సోలార్ పవర్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్న వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిస్సిగ్గుగా బుకాయింపునకు తెగబడుతున్నారు. తక్కువ ధరకు ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా లక్ష కోట్లకు పైగా సంపద సృష్టించానని, అందుకు తనను సన్మానించాల్సింది పోయి రాళ్లు వేస్తారా అని అమాయకత్వం ప్రదర్శించే ప్రయత్నం చేశారు. ఈ మాటలు విన్నాక, ప్రజలు వెర్రివాళ్లని ఆయన కచ్చితంగా భావిస్తున్నారని అర్థమవుతుంది. ట్రాన్స్‌మిషన్ నష్టం వగైరా అదనపు భారాలను పక్కన పెట్టినా ఒక యూనిట్ రెండు రూపాయలా 49 పైసలకు 25 ఏళ్లపాటు కొనుగోలు చేసేలా జగన్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇంతా చేసి విద్యుత్ సరఫరా ఇంకా ప్రారంభం కూడా కాలేదు! కానీ, బహిరంగ మార్కెట్‌లో సౌర విద్యుత్ ధర ఇప్పటికే రెండు రూపాయలకు పడిపోయింది. మునుముందు మరింత తగ్గవచ్చు. జగన్ బాబూ ఇప్పుడు చెప్పు! లక్ష కోట్ల రూపాయల సంపదను సృష్టించావా? ప్రజల నెత్తిన 25 ఏళ్ల పాటు లక్షల కోట్ల భారాన్ని వేశావా? వచ్చే పదేళ్లలో సౌర విద్యుత్ రేటు యూనిట్ రూపాయిన్నరకు పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి సంపద సృష్టించారా? ప్రజల జేబులు గుల్ల చేశారా? అబద్ధాలకు చొక్కా ప్యాంట్ తగిలిస్తే జగన్‌రెడ్డి కనిపిస్తారు. ఈ స్థాయిలో అలవోకగా అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిన జగన్‌కు డాక్టరేట్ ఇవ్వాల్సిందే. అమెరికా ఏజెన్సీలు తన పేరు ఎక్కడా ప్రస్తావించలేదని జగన్ మరో పచ్చి అబద్ధం చెప్పారు. ఎస్ఈసీ తన ఫిర్యాదులో 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి' జగన్మోహన్‌రెడ్డికి లంచం ఇచ్చారని పేర్కొనడం వాస్తవం కాదా? జగన్‌రెడ్డి ధన దాహం ఏ పాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు అమాయకత్వం నటించినా నమ్మేవాళ్లు ఎవరూ లేరు. ప్రతిఫలం లేకుండా అతను ఏ పనీ చేయడన్న విషయం అందరికీ తెలిసిందే. కాకినాడ, గంగవరం పోర్టులు చేతులు మారడం వెనుక ఏమి జరిగిందో అందరికీ ఎరుకే. అదానీకి కేంద్ర ప్రభుత్వంలో ఉన్న పలుకుబడిని అడ్డుపెట్టుకొని విద్యుత్ కొనుగోలు ఒప్పందం నుంచి తప్పించుకోవచ్చునని జగన్‌రెడ్డి భావిస్తుండవచ్చు. చేసిన పాపాలు వెంటాడుతూనే ఉంటాయి. సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం విషయమై తనపై అవాస్తవాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' పత్రిక 48 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే వంద కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేస్తానని ఆయన హెచ్చరించడం వింతగా ఉంది. వంద కోట్లు ఏమి ఖర్మ – లంచంగా తీసుకున్న 1750 కోట్ల రూపాయలు సరిపోలేదనుకుంటే అంతే మొత్తానికి పరువు నష్టం దావా వేసుకోవచ్చు. నిజానికి జగన్‌రెడ్డి మాపై పరువు నష్టం దావా వేయడం కాదు– ఆంధ్రప్రదేశ్ ప్రజలే ముందుకొచ్చి ఈ దిక్కుమాలిన విద్యుత్ ఒప్పందం కుదుర్చుకొని తమపై మోయలేని భారం వేసినందుకు జగన్‌రెడ్డిపై దావా వేయడంతో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు చొరవ తీసుకోవాలి. అదానీ–జగన్ డీల్ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉండబోతున్నదో తెలియదు. ఈ ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలన్న పాపులర్ డిమాండ్ ఉంది. అయితే ఒప్పందంలో చేర్చిన నిబంధనల ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే అదానీ కంపెనీకి మూడు వేల కోట్ల రూపాయలను నష్టపరిహారం కింద చెల్లించాల్సి వస్తుంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. జగన్‌రెడ్డి తన స్వార్థం కోసం ప్రజలనే కాదు– ప్రస్తుత ప్రభుత్వాన్ని కూడా ఇరికించారు. ఒకవేళ ఒప్పందం రద్దయితే నష్టపరిహారంగా లభించే మూడు వేల కోట్ల రూపాయలలో లంచంగా ఇచ్చిన సొమ్ము పోయినా అదానీ కంపెనీకి 1250 కోట్ల రూపాయలు మిగులుతాయి. అంటే ఈ ఒప్పందం అమలు అయినా కాకపోయినా అటు జగన్, ఇటు అదానీ కోల్పోయేది ఏమీ లేదు. ప్రజలు మాత్రం అదనపు భారాన్ని మోయాల్సిందే. ప్రభుత్వాలు లంచాలకు ఆశపడి స్వార్థం కోసం తీసుకునే నిర్ణయాల వల్ల తాము మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే ప్రజలకు ఉన్న వెసులుబాటు ఏమిటి? తమకు నష్టం కలిగించిన పాలకులను న్యాయస్థానాలకు లాగే వెసులుబాటు ప్రజలకు ఉంటుందా లేదా? అన్నది న్యాయ నిపుణులు చెప్పాలి. ఇటువంటి వెసులుబాటు ప్రస్తుతం లేని పక్షంలో ఆ దిశగా చట్టాలను సవరించాల్సిన అవసరం ఉంది. అలా జరిగినప్పుడు మాత్రమే పాలకుల్లో జవాబుదారీతనం వస్తుంది. లేనిపక్షంలో ఏమరుపాటుతో అధికారం కట్టబెట్టిన పాపానికి సదరు పాలకులు చేసే పాపాలకు ప్రజలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది.

> ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ముతక భాషను వినీవినీ ప్రజలు విసుగు చెందారు. ఇప్పుడు అక్కడ ప్రభుత్వం మారిన తర్వాత బూతులు పోయాయి. నాటి ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తున్నాయి. ఆమోదయోగ్యం కాని భాషను ఇప్పుడు తెలంగాణలో వాడుతున్నారు. ప్రతిపక్షానికి పరిమితమవాల్సి వస్తుందని ఊహించని కేటీఆర్‌వంటి వారిలో అసహనం ఏర్పడటం సహజం. సీనియర్ అధికారులను కూడా కేటీఆర్ వాడూ వీడూ అని సంబోధించడాన్ని ప్రజలు హర్షించడం లేదు. ఇలాంటి పద ప్రయోగాలు అహంభావానికి నిదర్శనంగా నిలుస్తాయి. అలాంటప్పుడు భాష విషయంలోగానీ, సవాళ్ల విషయంలోగానీ కేటీఆర్‌తో ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి పోటీపడకూడదు. ముఖ్యమంత్రి తన భాషను సరిదిద్దుకోవాలని, హుందాతనాన్ని ప్రదర్శించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కేంద్రం, రాష్ట్రం చేతిలో జగన్ భవిష్యత్తు...

అదానీ–జగన్ డీల్ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియదు. ఈ అంశంపై చర్చ జరగకుండానే పార్లమెంటు ఉభయ సభలూ వాయిదా పడుతున్నాయి. దీంతో కేంద్ర వైఖరి ఏమిటో తెలియని పరిస్థితి. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రాన్ని ధిక్కరించి చర్యలు తీసుకొనే స్థితిలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లేదు. అందుకే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా జగన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం లేదు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. నిజానికి ఇందులో పరిశీలించాల్సింది ఏమీ లేదు. రాజకీయంగా ఎదురవుతున్న పరిస్థితుల గురించి చెప్పుకోలేరు కనుక పరిశీలిస్తున్నామని ప్రభుత్వంలో ఉన్నవారు చెప్పుకొంటున్నారు. గజం మిథ్య పలాయనం మిథ్యగా ఈ వ్యవహారం ముగిసినా ఆశ్చర్యపడాల్సిన అవసరం ఉండదు. అదానీని మినహాయించి జగన్‌రెడ్డికి మాత్రం ఈ కుంభకోణాన్ని పరిమితం చేయడంలోని సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం దృష్టి పెడుతుందేమో తెలియదు. ప్రభుత్వ నిర్ణయాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించే హక్కు పౌరులకు ఉంటుంది. ఈ విద్యుత్ కొనుగోలు ఒప్పందం కూడా ప్రభుత్వ నిర్ణయమే. రాష్ట్రంలోని ప్రతి పౌరుడిపై దీని ప్రభావం ఉంటుంది. ఈ కారణంగా ప్రభుత్వ నిర్ణయ బాధితులుగా ఎవరైనా కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉందో లేదో న్యాయ నిపుణులు చెప్పాలి. ఈ వ్యవహారంలో జగన్‌రెడ్డి ఫీంకరింపులు, హూంకరింపులు ఎలా ఉన్నా ప్రజా క్షేత్రంలో ఆయన దోషిగా నిలబడక తప్పదు. లంచం తీసుకోకుండా ఆయన ఈ ఒప్పందం కుదుర్చుకున్నారంటే ఒక్కరు కూడా నమ్మరు. ఆయన మద్దతుదారులకు కూడా ఈ విషయంలో క్లారిటీ ఉంటుంది. అదానీతో డీల్స్ కుదుర్చుకుంటే తాను సేఫ్‌గా ఉంటానని జగన్‌రెడ్డికి తెలుసు. అందుకే రాష్ట్రంలోని వనరులన్నీ అదానీకి దోచి పెట్టడానికి జగన్‌రెడ్డి తెగబడ్డారు. ఉభయకుశలోపరి అంటే ఇదే! వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలి వానకు కుప్పకూలుతుంది అంటారు. తండ్రి అధికారంలో ఉన్నప్పటి నుంచి అక్రమ సంపాదనకు అలవాటు పడిన జగన్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా తీసుకున్న నిర్ణయంతో వలలో చిక్కారు. గతంలో 'నేను అధికారంలో ఉన్నానా? లంచాలు తీసుకోవడానికి!' అని బుకాయించేవారు. ఇప్పుడు ఆయన అధికారంలో ఉన్నప్పుడే ఇది జరిగింది కనుక అదే బుకాయింపు కుదరదు. అయితే ఇంకో నాలుగు రోజులు పోతే ప్రజలు కూడా అలవాటు ప్రకారం ఈ కుంభకోణాన్ని మరచిపోవచ్చు. జగన్ ధీమా కూడా అదే. తన రాజకీయ ప్రత్యర్థి ఇంత కాలానికి తన చేతికి చిక్కినందున ఈ మహదావకాశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వదులుకుంటారా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. కేంద్ర పెద్దలను నొప్పించకుండా ఒప్పించగలిగితే తన రాజకీయ ప్రత్యర్థిని దెబ్బ కొట్టే అవకాశం చంద్రబాబుకు లభిస్తుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడానికి అదానీ సిద్ధపడితే మాత్రం జగన్‌రెడ్డి సేఫ్ అవుతారు. ఈ కుంభకోణం కోల్డ్ స్టోరేజీకి చేరుతుందా? లేక జగన్ మెడకు చుట్టుకుంటుందా? అన్నది తేలాలంటే మరికొద్ది రోజులు వేచిచూడాల్సిందే!

ఏడాది పాలన ఎటు?

ఇప్పుడు తెలంగాణ విషయానికి వద్దాం! తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతోంది. రాష్ట్ర విభజన తర్వాత తొమ్మిదిన్నరేళ్లు ప్రతిపక్షానికే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో రేవంత్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న తన లక్ష్యాన్ని కూడా ఆయన నెరవేర్చుకున్నారు. అనూహ్యంగా ప్రతిపక్షానికి పరిమితమైన భారత రాష్ట్ర సమితి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. గతంలో మంత్రి పదవి చేపట్టిన అనుభవం కూడా లేని రేవంత్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను ఇప్పుడు సమీక్షించుకుందాం! పార్టీలో ఎంతో మంది సీనియర్లు ఉన్నప్పటికీ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టుబట్టి మరీ రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారు. ఆ పదవిపై ఆశలు పెట్టుకున్న భట్టి విక్రమార్క, ఉత్తమకుమార్ రెడ్డి వంటివారు సర్దుకుపోవాల్సిన పరిస్థితి. రేవంత్‌రెడ్డి కూడా పార్టీలో తనపై అసంతృప్తి ఏర్పడకుండా సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్టీ పరంగా రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వపరంగా ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో మాత్రం కొంత విఫలమయ్యారని మాత్రం చెప్పవచ్చు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ప్రజల్లో అంచనాలు అమాంతం పెరిగాయి. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చింది. అయితే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కేసీఆర్ ఉన్నప్పుడే క్షీణించింది. దీంతో పాత పథకాలతో పాటు కొత్త పథకాల అమలుకు నిధుల కొరత ఏర్పడింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దూకుడుగా వ్యవహరించడాన్ని ప్రజలు హర్షిస్తారు గానీ ప్రభుత్వాధినేతగా ఆచితూచి వ్యవహరించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడం వల్ల రేవంత్‌రెడ్డి కొన్ని సమస్యలను కొని తెచ్చుకున్నారు. రైతులకు రుణ మాఫీ అమలు విషయంలో ముఖ్యమంత్రి తొందరపడ్డారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పన్నిన ఉచ్చులో రేవంత్ చిక్కుకున్నారు. పాత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూ కొత్త పథకాల అమలుకు పూనుకుంటే ప్రజలు హర్షిస్తారుగానీ, అమలులో ఉన్న పథకాలను నిలిపివేసి కొత్తగా ఎన్ని పథకాలు అమలు చేసినా ప్రజలు సంతృప్తి చెందరన్న మౌలిక సూత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించారు. అందుబాటులో ఉన్న నిధులన్నింటినీ రైతు రుణ మాఫీకి మళ్లించడం వలన పాత పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా రైతు భరోసా వంటి పథకాల అమలు నిలిచిపోయింది. దీనిపై ప్రజల్లో, ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ పరిస్థితిని గ్రహించిన రేవంత్‌రెడ్డి రైతు భరోసా ఇవ్వటానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పెదవి విరవడానికి పెన్షన్ల పెంపు వంటి హామీలతోపాటు అభివృద్ధి పథకాల అమలు నిలిచిపోవడం కూడా కారణంగా కనిపిస్తోంది. అనేక నీటి పారుదల ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా నిలిచిపోయాయి. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యం లోపించడంతో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కోసం వెతుక్కోవలసిన పరిస్థితి! కేసీఆర్ పాలనలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు కూడా చెల్లింపులకు నోచుకోలేదు. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం మందగించింది. ఈ కారణాల వల్ల ప్రజల వద్ద నగదు చెలామణీ తగ్గిపోయింది. ఫలితంగా ప్రజల్లో ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ లోపించింది.

ఏడాదిలోనే ఎందుకీ మార్పు...

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొత్తలో ఆయన వ్యవహార శైలి పట్ల ప్రజల్లో మంచి స్పందనే వచ్చింది. అయితే ప్రభుత్వాధినేతగా నిర్ణయాలు తీసుకొనే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడంతో ఆయన విమర్శలను కొని తెచ్చుకుంటున్నారు. ఉదాహరణకు 'హైడ్రా' ఏర్పాటు! చెరువులు, కుంటల పరిరక్షణకు హైడ్రా ఏర్పాటును అందరూ స్వాగతించారు. ఎప్పుడయితే పేదలు, మధ్యతరగతి వాళ్లు నిర్మించుకున్న, కొనుగోలు చేసిన ఇళ్లను కూల్చే ప్రయత్నం జరిగిందో అప్పటి నుంచి హైడ్రాపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ఫాం హౌజ్‌లను కూల్చివేసినప్పుడు స్వాగతించిన వాళ్లు సామాన్య ప్రజల ఇళ్ల జోలికి వచ్చేసరికి వ్యతిరేకించారు. అదే సమయంలో మూసీ ప్రక్షాళన తెరమీదకు రావడంతో ప్రజల్లో ప్రభుత్వంపై అపోహలు నెలకొన్నాయి. మూసీ ప్రక్షాళన– హైడ్రా వంటి ఆపరేషన్లను ఒకే పర్యాయం అమలు చేయాలనుకోవడమే ప్రభుత్వం చేసిన తప్పు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆరేడు నియోజక వర్గాలకు సాగునీరు అందించే మూసీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందిగానీ, మొదటగా మూసీకి ఇరువైపులా ఉన్న ఇళ్లను కూల్చివేయబోతున్నట్టుగా వాటిపై ఎరుపు రంగు అక్షరాలతో మార్కింగ్ చేయించడం మరో తప్పిదం. నిజానికి ఈ చర్యకు హైడ్రాతో సంబంధం లేదు. అయినా హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలు జరగబోతున్నాయన్న ప్రచారం జరిగింది. దీంతో మూసీ ప్రక్షాళనను ప్రజలు అపార్థం చేసుకున్నారు. నిజానికి ప్రభుత్వం కూడా ముందుగా ఆక్రమణల తొలగింపు జోలికి వెళ్లకుండా ఉండాల్సింది. పై నుంచి, కింది నుంచి మూసీ ప్రక్షాళన పనులు చేపట్టి ఉంటే ఈ ప్రాజెక్టును ప్రజలు అర్థం చేసుకొని స్వాగతించేవారు. సినిమాల్లో చూపించినట్టుగా ముఖ్యమంత్రిగా క్షణాల్లో అద్భుతాలు సృష్టించలేమన్న వాస్తవాన్ని రేవంత్‌రెడ్డి గ్రహించాలి. లక్ష్యం ఎంత మంచిదైనా దాన్ని చేరుకోవడానికి ఎంచుకొనే మార్గం కూడా ఉన్నతంగా ఉండాలి. ప్రభుత్వం అంటే ప్రతిపక్షాల నుంచి రాజకీయ చికాకులు ఎదురవడం సహజం. మూసీ ప్రక్షాళన, హైడ్రా ప్రాజెక్టు విషయంలో కూడా రాజకీయం మొదలైంది. ముఖ్యమంత్రి దుందుడుకుగా వ్యవహరించడమే అందుకు కారణం. దీంతో ప్రభుత్వాధినేతగా రేవంత్‌రెడ్డి పరిణతితో వ్యవహరించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది.

'మాట' మారాలి...

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తన భాషను కూడా మార్చుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషనే ఇప్పుడు కూడా వాడితే ప్రజలు హర్షించరు. తాను ఇప్పుడు ముఖ్యమంత్రిని అన్న విషయం మరచిపోయి భాష విషయంలో కేటీఆర్‌తో పోటీ పడటం, సవాళ్లు విసురుకోవడం తన స్థాయిని తగ్గించుకోవడమే అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ముతక భాషను వినీవినీ ప్రజలు విసుగు చెందారు. ఇప్పుడు అక్కడ ప్రభుత్వం మారిన తర్వాత బూతులు పోయాయి. నాటి ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తున్నాయి. ఆమోదయోగ్యం కాని భాషను ఇప్పుడు తెలంగాణలో వాడుతున్నారు. ప్రతిపక్షానికి పరిమితమవాల్సి వస్తుందని ఊహించని కేటీఆర్‌వంటి వారిలో అసహనం ఏర్పడటం సహజం. సీనియర్ అధికారులను కూడా కేటీఆర్ వాడూ వీడూ అని సంబోధించడాన్ని ప్రజలు హర్షించడం లేదు. ఇలాంటి పద ప్రయోగాలు అహంభావానికి నిదర్శనంగా నిలుస్తాయి. అలాంటప్పుడు భాష విషయంలోగానీ, సవాళ్ల విషయంలోగానీ కేటీఆర్‌తో ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి పోటీపడకూడదు. ముఖ్యమంత్రి తన భాషను సరిదిద్దుకోవాలని, హుందాతనాన్ని ప్రదర్శించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మొత్తమ్మీద నాలుగైదు విషయాలలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొందరపాటు ప్రదర్శించింది. అదే సమయంలో పాత పథకాల అమలు నిలిచిపోవడం కూడా ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఏర్పడటానికి కారణమైంది. రేవంత్‌రెడ్డి తన ఏడాది పాలనను సమీక్షించుకొని లోపాలను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయం!

బీఆర్‌ఎస్ పరిస్థితి ఏమిటి...

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా నాలుగేళ్ల గడువు ఉంది. ప్రభుత్వంపై ప్రజల్లో కొంత మేర అసంతృప్తి ఉందికానీ వ్యతిరేకత మాత్రం ఏర్పడలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని, ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, తమ పాలనకోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని కేసీఆర్ అండ్ కో భావిస్తున్నారు కానీ క్షేత్రస్థాయిలో అంత సీన్ లేదు. గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి నాయకులపై కోపం ఇంకా తగ్గలేదు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనను బేరీజు వేసుకుంటే ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి లేని మాట వాస్తవమే కానీ, భారత రాష్ట్ర సమితి పట్ల మాత్రం సానుకూలత ఏర్పడలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. కేసీఆర్ తొలి విడత పాలనలో క్రమశిక్షణ కనిపించేది. ఎమ్మెల్యేలలో భయం ఉండేది. ఫలితంగా వారు అరాచకాలకు పాల్పడటానికి సాహసించేవారు కాదు. ప్రజల్లో ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్ ఉండేది. ఉద్యోగులు, నిరుద్యోగులు స్వేచ్ఛ అనుభవించారు. కేసీఆర్ అంటే భయం కారణంగా ఎమ్మెల్యేలు, నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించారు. మలి విడత పాలన ఇందుకు పూర్తి భిన్నంగా ఉండింది. అధికార పార్టీ నాయకుల అరాచకాలు తార స్థాయికి చేరాయి. మంత్రులు, ఎమ్మెల్యేలను కేసీఆర్ జనం మీదకు వదిలేశారు. దీంతో వారంతా ప్రజాకంటకులుగా మారిపోయారు. ఉద్యోగ వర్గాలపై కూడా నిర్బంధాలు ఉండేవి. ప్రజల హక్కులకు భంగం వాటిల్లింది. ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఇటు ప్రజలకు, అటు ఉద్యోగులకు కల్పించారు. తొలి విడత పాలనలో కేసీఆర్ అంటే పార్టీ నాయకులకు భయం ఉండగా, మలి విడత పాలనలో కేసీఆర్ అండ్ కో అంటే ప్రజలు భయపడే పరిస్థితి. ఈ కారణంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై పూర్తి స్థాయి సంతృప్తి లేనప్పటికీ భారత రాష్ట్ర సమితి పట్ల ఇంకా సానుకూలత ఏర్పడటం లేదు. ఏడాది క్రితం పరిస్థితులను అప్పుడే ఎలా మరచిపోతామని ఆయా వర్గాలవారు వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా చేయకపోయినా స్వేచ్ఛను అనుభవిస్తున్నామని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్షంగా బీఆర్ఎస్ తొందరపడుతోందన్న అభిప్రాయం కూడా ప్రజల్లో ఉంది. 'నిన్నటిదాకా మీరే అధికారంలో ఉన్నారుగా? అప్పుడే ఏం కొంపలు మునిగాయని ఆందోళనలు చేస్తున్నారు?' అని భారత రాష్ట్ర సమితి నాయకులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం ఎలా ఉన్నప్పటికీ ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. బీఆర్ఎస్ నాయకులకు ఆరాటం ఉంటే ఉండవచ్చునుగానీ ప్రభుత్వాన్ని ఇప్పటికిప్పుడు మార్చేయాలన్న ఆరాటం ప్రజలకు ఉండదు కదా! ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి ఏడాది అనుభవం వచ్చింది. ప్రతిపక్షంగా బీఆర్ఎస్‌కు కూడా ఏడాది అనుభవం వచ్చింది. ఇప్పుడు ఉభయ పక్షాలూ ఈ ఏడాదిలో తప్పొప్పులను సమీక్షించుకోవడం అవసరం. ప్రభుత్వాధినేతగా తన పాత్రకు ఈ ఏడాది కాలంలో ఏ మేరకు న్యాయం చేయగలిగాను? అని రేవంత్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి. లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిచేసుకోవాలి. ప్రస్తుతానికి ప్రజల్లో రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగతంగా క్రేజ్ తగ్గలేదు. ముఖ్యమంత్రిగా ఆయన ఎంత వరకు సక్సెస్ అవుతారా అని ప్రజలు బేరీజు వేసుకునే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించి అందుకు అనుగుణంగా దిద్దుబాటు చర్యలు తీసుకుంటే ఇటు పార్టీ పైనా, అటు ప్రభుత్వంపైనా ఆయనకు పట్టు పెరుగుతుంది. ఏ ప్రభుత్వానికైనా ప్రతిపక్షం నుంచి ముప్పు రాదు. ప్రజల నుంచే ముప్పు ఉంటుంది. తమ అంచనాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయని ప్రభుత్వాలను విసిరికొట్టే శక్తి ప్రజలకు మాత్రమే ఉంది. కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడినందునే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగలిగింది. కాకపోతే కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం ఎలా అని ప్రజలు సందిగ్ధంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి తనను తాను ప్రత్యామ్నాయంగా ఆవిష్కరించుకున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌తో భారతీయ జనతా పార్టీ ఇక తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టిసారించే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో రేవంత్‌రెడ్డికి బీజేపీ నుంచి కూడా సవాళ్లు ఎదురవుతాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరింత ఆచితూచి అడుగులు వేయాలి. తన ప్రభుత్వంపై ప్రస్తుతానికి సణుగుడుకే పరిమితమైన ప్రజల్లో వ్యతిరేకత నెలకొనకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దృష్టి కేంద్రీకరించాలి. లేని పక్షంలో ఇంటా బయటా ఆయనకు సమస్యలు తప్పవు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ పార్టీ పట్ల ప్రజల్లో ఏడాది గడచినా సానుకూలత ఏర్పడకపోవడానికి కారణాలను అన్వేషించుకోవాలి. స్థానిక నాయకులను చూస్తేనే ప్రజలకు గతం గుర్తుకొస్తున్నందున కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే విషయాన్ని కూడా కేసీఆర్ ఆలోచించాలి. తొమ్మిదిన్నరేళ్లు అధికారం చెలాయించిన కేటీఆర్ వంటి వారు గతాన్ని మరచి అధికారులపై విరుచుకుపడటం వల్ల ప్రయోజనం ఉండదు. అధికారులను హెచ్చరించడం వేరు–దూషించడం, పరుష పదజాలం వాడటం వేరు అని కేటీఆర్ వంటి వారు గుర్తించాలి.

> తనపై అవాస్తవాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' పత్రిక 48 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే వంద కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేస్తానని జగన్ హెచ్చరించడం వింతగా ఉంది. వంద కోట్లు ఏమి ఖర్మ – లంచంగా తీసుకున్న 1750 కోట్ల రూపాయలు సరిపోలేదనుకుంటే అంతే మొత్తానికి పరువు నష్టం దావా వేసుకోవచ్చు.

> జగన్‌రెడ్డి ఫీంకరింపులు, హూంకరింపులు ఎలా ఉన్నా ప్రజా క్షేత్రంలో ఆయన దోషిగా నిలబడక తప్పదు. లంచం తీసుకోకుండా ఆయన ఈ ఒప్పందం కుదుర్చుకున్నారంటే ఒక్కరు కూడా నమ్మరు. ఆయన మద్దతుదారులకు కూడా ఈ విషయంలో క్లారిటీ ఉంటుంది. అదానీతో డీల్స్ కుదుర్చుకుంటే తాను సేఫ్‌గా ఉంటానని జగన్‌రెడ్డికి తెలుసు. అందుకే రాష్ట్రంలోని వనరులన్నీ అదానీకి దోచి పెట్టడానికి జగన్‌రెడ్డి తెగబడ్డారు. ఉభయకుశలోపరి అంటే ఇదే! గతంలో 'నేను అధికారంలో ఉన్నానా? లంచాలు తీసుకోవడానికి!' అని బుకాయించేవారు. ఇప్పుడు ఆయన అధికారంలో ఉన్నప్పుడే ఇది జరిగింది కనుక అదే బుకాయింపు కుదరదు. తన రాజకీయ ప్రత్యర్థి ఇంత కాలానికి తన చేతికి చిక్కినందున ఈ మహదావకాశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వదులుకుంటారా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.



> అదానీ కంపెనీతో సోలార్ పవర్ కొనుగోలు ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలన్న పాపులర్ డిమాండ్ ఉంది. అయితే ఒప్పందంలో చేర్చిన నిబంధనల ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే అదానీ కంపెనీకి మూడు వేల కోట్ల రూపాయలను నష్టపరిహారం కింద చెల్లించాల్సి వస్తుంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. జగన్‌రెడ్డి తన స్వార్థం కోసం ప్రజలనే కాదు– ప్రస్తుత ప్రభుత్వాన్ని కూడా ఇరికించారు. ఒకవేళ ఒప్పందం రద్దయితే నష్టపరిహారంగా లభించే మూడు వేల కోట్ల రూపాయలలో లంచంగా ఇచ్చిన సొమ్ము పోయినా అదానీ కంపెనీకి 1250 కోట్ల రూపాయలు మిగులుతాయి. అంటే ఈ ఒప్పందం అమలు అయినా కాకపోయినా అటు జగన్, ఇటు అదానీ కోల్పోయేది ఏమీ లేదు. ప్రజలు మాత్రం అదనపు భారాన్ని మోయాల్సిందే. ప్రభుత్వాలు లంచాలకు ఆశపడి స్వార్థం కోసం తీసుకునే నిర్ణయాల వల్ల తాము మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే ప్రజలకు ఉన్న వెసులుబాటు ఏమిటి? తమకు నష్టం కలిగించిన పాలకులను న్యాయస్థానాలకు లాగే సౌలభ్యం ప్రజలకు ఉంటుందా లేదా? అన్నది న్యాయ నిపుణులు చెప్పాలి.

పాత్రికేయ జగత్తు ధ్రువతార

> పత్రికా సంపాదకీయాలను ఒక ఉద్యమంగా, సామాజిక సంస్కరణలకు స్ఫూర్తిగా అధికార దుర్వినియోగంపై ఎక్కుపెట్టిన బాణాలుగా ఉపయోగించిన అక్షర యోధుడు నార్ల వెంకటేశ్వరరావు. స్వాతంత్ర్య పూర్వకాలానికి, స్వాతంత్ర్యానంతర సమాజానికి అక్షర వారధి నార్ల.

అది 1969వ సంవత్సరం. నేను గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో పి.యు.సి. చదువుతున్న రోజులు. ఒకరోజు సాయంత్రం గుడివాడలో యస్.పి.యస్. హైస్కూల్లో ఏదో సమావేశం జరుగుతుందని, ఆంధ్రజ్యోతి సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు వస్తున్నారని తెలిసి మిత్రులతో కలిసి అక్కడకు వెళ్లాను. కింగ్ సైజ్ సిగరెట్ లాగా నిటారుగా ఉన్న నార్ల గారిని చూశాను. ఆయన ప్రసంగం అయిపోయిన తర్వాత ఫిల్టర్ సిగరెట్ నోట్లో పెట్టుకుని పక్కకు వచ్చారు. అప్పట్లో నాలాగా చాలామందికి ఎవరైనా పెద్దవాళ్లు కనబడితే ఆటోగ్రాఫ్‌లు తీసుకోవటం అలవాటుగా, గొప్పగా ఉండేది. నేను ఆ కార్యక్రమంలో పంచి పెట్టిన ఒక కరపత్రం మడతపెట్టి వెనుక వైపు సంతకం చెయ్యమని నార్ల దగ్గరకు వెళ్లాను. ఆయన సంతకం బాగా పొడవుగా లాగుతూ 'నార్ల' కదా! నార సాగుతుంది అంటూ ఆటోగ్రాఫ్ ఇచ్చారు. ఆ రోజులలో నార్ల గురించి పెద్దవాళ్లు గొప్పగా చెబుతుంటే విని ఆయన పట్ల అభిమానం పెంచుకున్నాను. తరువాత నాలుగు సంవత్సరాలకు బి.ఏ. ఫైనల్ ఇయర్ చదువుతూ హిందీ కవుల గురించి వ్యాసాలు రాస్తూ ఉండేవాణ్ణి. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్న ప్రముఖులు తుర్లపాటి కుటుంబరావు, పురాణం సుబ్రహ్మణ్యంశర్మ నన్ను ప్రోత్సహిస్తూ నా వ్యాసాలు ఆంధ్రజ్యోతి దిన, వార పత్రికలలో ప్రచురణకు దోహదం చేశారు. ఒకసారి తుర్లపాటి కుటుంబరావు నన్ను నార్ల గదికి తీసుకువెళ్లి హిందీ బాగా చదువుకున్నాడు, హిందీ కవులు, రచయితల గురించి, వారి రచనల పైన వ్యాసాలు రాస్తుంటాడని చెప్పినప్పుడు, ఆయన నన్ను ఎగాదిగా చూసి, వ్యాసాలు చూస్తున్నాను బాగా రాస్తున్నావు. వారి గురించి మన తెలుగు వారికి తెలియాలి కదా! అంటూ నన్ను ప్రోత్సహించారు.

నార్ల వెంకటేశ్వరరావు కేవలం జర్నలిస్టే కాదు, స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, రచయిత, విమర్శకుడు, నాటక కర్త, చరిత్రకారుడు, అనువాదకుడు, ఆధునిక తెలుగు జర్నలిజానికి ఆద్యుడు. సంపాదకీయాలను ఒక ఉద్యమంగా, సామాజిక సంస్కరణలకు స్ఫూర్తిగా అధికార దుర్వినియోగంపై ఎక్కుపెట్టిన బాణాలుగా ఉపయోగించిన అక్షర యోధుడు. నిజాయితీకి, నిర్భీతికి పర్యాయపదం నార్ల. 1958 నుంచి 1970 వరకు రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికైన ఏకైక తెలుగు జర్నలిస్టు. అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని ప్రదర్శించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వాతంత్ర్య పూర్వకాలానికి, స్వాతంత్ర్యానంతర సమాజానికి అక్షర వారధి నార్ల.

సంపాదకుడుగా నార్ల బృహత్కార్యాల గురించి చెప్పాలంటే అదొక చరిత్రే అవుతుంది. ఒక సంపాదకుడుగా ఆయన ప్రజాభిప్రాయాల సేకరణలో ముందున్నాడు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సమయంలో రాష్ట్ర రాజధానిని గుంటూరులో ఏర్పాటు చేయాలని ఆయన చేసిన విజ్ఞప్తి పాటించి ఉంటే నేటి అనేక సమస్యలు తలెత్తేవి కావేమో. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఆ పేరు సూచించింది ఆయనే. గాంధీ మహాత్ముడు చనిపోయినప్పుడు ఆయన రాసిన సంపాదకీయం ఎందరినో చలింపచేసింది. వేటూరి ప్రభాకరశాస్త్రి లాంటి ఉద్దండ సాహితీవేత్త సైతం 'సంపాదకీయ రచయితకు చేతులెత్తి నమస్కరిస్తున్నా'నని ప్రకటించారు. తెలుగు భాషకు, పదజాలానికి ఆయన కొత్త ఒరవడిని తీర్చిదిద్దారు.

నార్ల పత్రికా సంపాదకుడే కాదు, గొప్ప రచయిత కూడా, ఆయన వేలాది రచనలు చేశారు. తన కళాశాల రోజుల్లోనే 'స్వదేశీ సంస్థానాలు' పేరిట భారతదేశంలో సంస్థానాల గురించి రాశారు. ఇది చాలా అద్భుతమైన పుస్తకమని కృష్ణాపత్రికలో ముట్నూరి కృష్ణారావు ప్రశంసించారు. ఆయన రాసిన 'నేటి రష్యా' అనే పుస్తకాన్ని నాటి హైదరాబాద్, మద్రాస్, మైసూర్ ప్రభుత్వాలు నిషేధించాయి. వీరేశలింగం, గురజాడ, వేమనలపై ఆయన రాసిన రచనలు అనేక భారతీయ భాషల్లో వెలువడ్డాయి. మాటామంతీ, కొత్త గడ్డ, ఆషామాషీ, జైలు, పంచారాం మొదలైన రచనల్లో ఆయన సమాజంలో దురన్యాయాలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపారు. ఆహారం రచించాలని తపించే నార్లను చూసి ఖాసా సుబ్బారావు లాంటి ప్రముఖ జర్నలిస్టులు కూడా 'విరామ మెరుగని రాక్షసుడు' అని అభివర్ణించారు.



సంస్కృత భాష వల్లే మన సంస్కృతి విస్తరిస్తుందన్న అభిప్రాయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సంస్కృతంతో నిమిత్తం లేని మన సంస్కృతి ఘనతను ఆయన వివరించారు. అంధవిశ్వాసాలను, మూఢ నమ్మకాలను ప్రశ్నిస్తూ 'సీత జోస్యం' రాశారు. రామాయణంలో అగ్ర కులాధిపత్యాన్ని ప్రశ్నిస్తూ 'శంబుక వధ' రచించారు. బౌద్ధమతాన్ని అభిమానించారు. నరకంలో హరిశ్చంద్రుడు, జాబాలి, ద్రౌపది మొదలైన అనేక రచనలు చేశారు. భగవద్గీత, ఉపనిషత్తులపై, భారతదేశంలో మేధో దారిద్ర్యంపై ఆయన ఆంగ్లంలో అనేక రచనలు చేశారు. అలాంటి సంపాదకులు, రచయితలు, బహుముఖ ప్రజ్ఞాశాలులు ముఖ్యంగా నిర్భయంతో ఎవరినైనా ఎదిరించగల ధీరోదాత్తులూ నేటి కాలంలో అరుదు. నార్ల వారసత్వాన్ని సగమైనా కొనసాగించగలిగితే మన పత్రికారంగం ఎంతో బాగుపడినట్లే లెక్క.

కాల క్రమేణ నార్ల పట్ల దినదిన ప్రవర్ధమానంగా పెరిగిన గౌరవం ఫలితంగా నేను రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు నా నిధులతో విశాఖపట్నంలో 10 లక్షల రూపాయలతో ప్రెస్ క్లబ్ నిర్మాణం చేయించి నార్ల వెంకటేశ్వరరావు భవనంగా నామకరణం చేయించి, ఆనాటి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చేత ప్రారంభింపచేశాను. తరువాత 2010 ఏప్రిల్‌లో నా స్వంత ఖర్చులతో నార్ల కాంస్య విగ్రహాన్ని తయారు చేయించి ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ చేత విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య ఆడిటోరియం ప్రాంగణంలో ప్రతిష్ఠింపజేశాను. తెలుగు పత్రికా రంగాన్ని మలుపులు తిప్పిన అక్షర యోధుడు సంపాదక ధీరుడు నార్ల వెంకటేశ్వరరావు.


▪ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
జాతీయ అధ్యక్షులు, విశ్వ హిందీ పరిషత్

(నేడు నార్ల జయంతి)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

ఆదివారం 1 డిసెంబరు 2024



కంకిపాడులో రోడ్డు ప్రమాద దృశ్యం



విధి ఎవరిని ఎప్పుడు ఎలా బలి తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. అప్పటివరకు కారులో సరదాగా కబుర్లు చెప్పుకొంటూ బయల్దేరిన ముగ్గురు స్నేహితులు అనుకోని ప్రమాదానికి గురై మృతిచెందగా, తనయుడి మృతివార్త విని ఓ తల్లి గుండె పగిలి చనిపోయింది. హృదయవిదారకమైన ఈ విషాద సంఘటన కంకిపాడులోని జాతీయ రహదారిపై జరగ్గా, మృతులు మచిలీపట్నానికి చెందినవారు.

విషాదం

కంకిపాడులో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు స్నేహితుల దుర్మరణం

తనయుడి మృతివార్త విని తల్లి మృతి

- మృతులు మచిలీపట్నంలోని బలరామునిపేటకు చెందినవారు
- మందుల కోసం విజయవాడ వచ్చి వెళ్తుండగా ప్రమాదం

మచిలీపట్నం టౌన్/కంకిపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని బలరామునిపేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి చింతా రవిబాబు (35) తన తండ్రి రామారావుకు విజయవాడ నుంచి మందులు తెచ్చేందుకు బయల్దేరాడు. స్నేహితులు.. బైక్ ఫైనాన్సర్ చీలి ఏసుబాబు (27), రైల్వే కాంట్రాక్టు ఉద్యోగి చీలి భాను (26)తో కలిసి కారులో శనివారం ఉదయం విజయవాడ వెళ్లారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో కంకిపాడు రెండో ఫ్లైఓవర్ వద్దకు రాగా, కారులో ఓ చక్రానికి గాలిపోయి అదుపుతప్పింది. మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వస్తున్న చేపల లోడువ్యానును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏసుబాబు, రవిబాబు, భాను అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడి చనిపోయారు. మరో వ్యక్తి సీటులోనే ఇరుక్కుపోవడంతో మృతిచెందాడు. ఈ ఘటనలో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. వ్యాను డ్రైవర్ కురెళ్ల కిషోర్ (26) వాహనంలోనే ఇరుక్కుపోయాడు. బాధ భరించలేక కిషోర్ హాహాకారాలు చేశాడు. కిషోర్‌ను బయటకు తీసేందుకు పోలీసులు గంటపాటు శ్రమించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, సంఘటనా



చీలి ఏసుబాబు (ఫైల్)



చీలి భాను (ఫైల్)



చింతా రవిబాబు (ఫైల్)

మిగతా 6లో..

• జీవవైవిధ్య నాణేలు



కాయిన్ ఎక్స్‌పోలో ప్రత్యేకం

8

గురువారం రాత్రి బెంజిసర్కిల్ వద్ద జోరువాన



గుడివాడ మండలం బొమ్ములూరులో రోడ్ల వెంబడి ధాన్యపు రాశులు



ఫెంగల్ కలవరం

కృష్ణాజిల్లాలో వర్షాలు.. అన్నదాతలు అతలాకుతలం

ఫెంగల్ తుఫాను కృష్ణాజిల్లాలో అలజడి సృష్టిస్తోంది. శుక్రవారం ఓ మోస్తరు వర్షంతో రైతులను కంగారు పెట్టించిన ఈ తుఫాను.. శనివారం కూడా విడతలవారీగా కురిసి పరుగులు పెట్టించింది. రోడ్లపై వేసిన ధాన్యపు రాశుల కిందకు వర్షపు నీరు చేరుతుండటం, ధాన్యాన్ని మిల్లులకు తరలించే అవకాశం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నగరంలోనూ మోస్తరు వర్షాలు కురిశాయి. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

రహదారులపై రాశులుగా పోసిన ధాన్యం

- టార్పాలిన్ పట్టాల కిందకు చేరుతున్న వర్షపునీరు
- ధాన్యం మొలకెత్తే అవకాశం ఉందని బెంబేలు
- మిల్లులకు తరలించే దారిలేక రైతుల అవస్థలు
- నేలవాలుతున్న కోతకు సిద్ధంగా ఉన్న వరి
- విజయవాడలోనూ తుఫాను ఎఫెక్ట్

మరో రెండు రోజులు వర్షాలు : వాతావరణ శాఖ

ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం : ఫెంగల్ తుఫాను కృష్ణాజిల్లా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని రాశులుగా పోసి ఉంచారు. రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిస్తే ధాన్యం తడిచిపోతుందని భయపడిపోతున్నారు. కోత కోయకుండా ఉన్న పంట వర్షం కారణంగా తడిచి.. కంకులు బరువెక్కి.. నేలవాలిపోతే, దానిపైకి నీరు చేరితే పంట చేతికి అందదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావానికి శుక్రవారం మధ్యాహ్నం నుంచి విడతలవారీగా వర్షం కురిసింది. శనివారం రాత్రి వరకు ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రైతుల్లో అలజడి రెట్టింపైంది. గత ఏడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫానును గుర్తుచేస్తూ ఫెంగల్ కూడా బీభత్సం సృష్టిస్తుందేమోనని కలవరపడుతున్నారు.

1.10 లక్షల హెక్టార్లలో పంట చేతికొచ్చే దశలో..

ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో వరి సాగైంది. ఇప్పటివరకు 26 వేల హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. కాల్వల శివారు భూముల్లో ఆలస్యంగా వరినాట్లు వేసిన 25 వేల హెక్టార్లలో వరిపైరు పొట్ట, వివిధ దశల్లో ఉంది. మరో 1.10 లక్షల హెక్టార్లలో కోతదశకు చేరుకుంది. డిసెంబరు 15లోగా ఈ విస్తీర్ణంలో అధికశాతం కోతలు పూర్తిచేయాల్సి ఉంది. తుఫాను ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో మిగతా 6లో..



అదిరెను స్టైల్

మారిస్ స్టెల్లా కాలేజీలో మిస్ స్టెల్లా ఫ్యాషన్ షో శనివారం సందడిగా జరిగింది. విద్యార్థినులు మోడరన్ దుస్తుల్లో క్యాట్‌వాక్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కు ఘన వీడ్కోలు

6లో

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు

21 నుంచి విరమణ ఉత్సవాలు

8లో

పెన్షన్లను సకాలంలో ఇవ్వండి

అధికారులతో కమిషనర్ ధ్యానచంద్ర

గ్రేటరే పరిష్కారం

గ్రేటర్ విజయవాడకు అడుగులు పడుతున్నాయి 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'మళ్లీ గ్రేటర్ ఆశలు' కథనంపై ప్రజాప్రతినిధులు స్పందించారు. గ్రేటర్ విజయవాడ జరక్కపోవటం వల్ల నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టడమే కాకుండా, పరిష్కారమయ్యే సమస్యలపైనా మాట్లాడారు.





డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్. చిత్రంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, కలెక్టర్ లక్ష్మీశ, జేసీ నిధి మీనా, కమిషనర్ ధ్యానచంద్ర (ఇన్‌సెట్‌లో) సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

డీఆర్‌సీ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్, కమిషనర్లకు సూచన
- గ్రేటర్‌తో అనేక సమస్యలు పరిష్కారమవుతాయని వెల్లడి
- త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తామన్న ఎంపీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని రైతు శిక్షణా కేంద్రంలో శనివారం డీఆర్‌సీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ గ్రేటర్ అంశం ప్రధానంగా మాట్లాడారు. ఎంపీ ప్రతిపాదనకు ప్రజాప్రతినిధులంతా మిగతా 6లో..

అధికారపక్షమే విపక్షంగా..

డీఆర్‌సీ సమావేశంలో సమస్యలు ఏకరువు

8లో

ఇసుక దుమారం

జెడ్పీ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్రతో సభ్యుల వాగ్వాదం

- పోడియం వద్ద నిరసనలు తెలిపిన వైసీపీ సభ్యులు, ఎంపీపీలు
- జెడ్పీ సమావేశం రోజు ఎన్టీఆర్ జిల్లా సమీక్ష ఎలా అంటూ ప్రశ్న
- ఇసుక అక్రమాలపై విచారణ జరుపుతాం : మంత్రి కొల్లు రవీంద్ర
- రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజా కొంటామని హామీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో లక్షలాది టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని, ఇసుక అక్రమ రవాణాపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తీసుకుని, అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు నిలదీశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన స్థానిక జెడ్పీ కన్వెన్షన్ హాల్లో శనివారం జిల్లా పరిషత్ సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ఇసుక రేవుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ వైసీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పోడియం వద్దకు వెళ్లి మంత్రి కొల్లు రవీంద్రతో వాగ్వివాదానికి దిగారు.



ఇసుక అక్రమ రవాణాపై పోడియం వద్ద ఆందోళన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు. చిత్రంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మంత్రి కొల్లు రవీంద్ర, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ఫిర్యాదు చేస్తే విచారణ చేయిస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. ధాన్యం సకాలంలో కొనకుండా రైతులను ఇబ్బందుల పాలుచేయడం, తేమశాతం పేరుతో తక్కువ ధరకే ధాన్యాన్ని కొనడంపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. జెడ్పీ సమావేశం రోజున ఎన్టీఆర్ జిల్లా సమీక్షా సమావేశం ఎలా ఏర్పాటు చేస్తారని సభ్యులు ప్రశ్నించారు.

ఇసుకమాయంపై నిరసన

కంచికచర్ల మండలం మాగల్లు, కీసర, కొండపల్లి, కంచల, మొగులూరు ఇసుక స్టాక్ పాయింట్లలో 2024, జూలై 27 వరకు ఎంతమేర ఇసుక నిల్వలు ఉన్నాయని సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా, అధికారులు 4,43,641 టన్నులు ఉన్నట్టు చూపారని కంచికచర్ల జెడ్పీటీసీ సభ్యురాలు వేముల ప్రశాంతి తన వద్ద ఆధారాలను చూపారు. కొద్దికాలంలోనే ఈ ఇసుక నిల్వలు మాయం చేశారని, ఈ సంఘటనపై అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని చెప్పారు. పోడియం వద్దకు వెళ్లి బైఠాయించారు. ఈ అంశంపై ఫిర్యాదు చేయకుండా చర్యలెలా తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ పత్రాలే ఆధారాలుగా భావించాలని ప్రశాంతి మంత్రితో వాగ్వివాదానికి దిగారు. వెంటనే వైసీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పోడియం వద్దకు వచ్చి ఇసుకను మాయం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ అంశంపై విచారణ చేయిస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. అవనిగడ్డ నియోజకవర్గం పులిగడ్డ మిగతా 6లో..

సమస్యలపై నిలదీయండి : జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మాజీ సీఎం వైఎస్ జగన్ సూచనల మేరకు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వైసీపీ సభ్యులు అధికారులను నిలదీయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సూచించారు. ధాన్యం కొనుగోలులో సక్రమంగా వ్యవహ రించకపోవడంతో పాటు వాతావరణం అనుకూలంగా లేని సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఆమె మంత్రి కొల్లు రవీంద్రతో వాదనకు దిగారు.



నారాయణపురంలో వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి

పేదల పక్షాన కూటమి ప్రభుత్వం

» పింఛన్ల పంపిణీలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన కూటమి ప్రభుత్వం నిలబడి ఉంది. దేశంలోనే అత్యధిక పింఛన్ నగదు నెలకు వృద్ధులకు రూ.4వేలు పింఛన్ ఇస్తున్న రాష్ట్రమిది. ఒకటో తారీఖు ఆదివారం వచ్చిందని, ఈనెలలో ఒక రోజు ముందుగానే అందిస్తున్నాం.' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం 46వ డివిజన్ నారాయణపురంలో కోదండ రామాలయం వద్ద ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2 లక్షల 70 వేల మందికి 80 శాతం పింఛన్లు ఉదయాన్నే పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 30,500 మందికి పంపిణీ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 60 లక్షల మందికి పింఛన్లు ఇస్తోందని ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో 2.26 లక్షల మందికి రూ.96.29 కోట్లు

కృష్ణాజిల్లాలో 2.37 లక్షల మందికి రూ.101 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, శనివారం సాయంత్రానికి 2,26,351 మందికి రూ.96.29 కోట్లు పంపిణీ చేసినట్లు డీఆర్డీయే పీడీ కన్నయ్యనాయుడు తెలిపారు.



పంట రక్షించుకునేందుకు

చల్లపల్లి - పెదకళ్లేపల్లి రోడ్డులో ధాన్యం ఆరబెడుతున్న రైతులు, కూలీలు

నానా పాట్లు

ధాన్యం ఆరబెట్టుకుంటూ..పరదాలు కప్పుకొంటూ రైతుల అవస్థలు

గాలులకు నేలకొరిగిన వరిపైరు.. మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు



చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో గాలులకు నేలకొరిగిన వరి

చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు నానా పాట్లు పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం వర్షం కురవటంతో ధాన్యపు రాశులపై పరదాలు కప్పిన రైతులు శనివారం ఉదయం వాటిని తొలగించి ఆరబెట్టుకున్నారు. కూలీల ఖర్చును భరించలేని రైతులు గ్రామాల్లో యంత్రాలతో కోయించి, ఎన్‌హెచ్-216 పైన, ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టుకుంటున్నారు. తుఫాను వార్తలతో ధాన్యపు రాశులను వర్షానికి తడవకుండా పరదాలు, టార్పాలిన్లు కప్పి పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆరిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుకుని రోడ్డుపక్కనే ఉంచి టార్పాలిన్‌లు కప్పారు. తేమశాతం ఎక్కువగా ఉన్న ధాన్యం హైవేపై ఆరబెట్టుకున్న వారంతా ఉదయం పరదాలు తొలగించి ఆరబెట్టుకున్నారు. మళ్లీ వర్షం కురవడంతో హడావుడిగా అవస్థలు పడుతూ పరదాలు కప్పారు. నేలపై ఆరబోసుకున్న ధాన్యం, వర్షం కారణంగా కొంతభాగం తడిసిపోవటంతో ఆరబెట్టుకునేందుకు ఇబ్బంది పడ్డారు. కొందరు రైతులకు పరదాలు లేక ధాన్యాన్ని అలాగే వదిలేశారు. దీంతో ధాన్యం వర్షానికి తడిసిపోయింది. తుపాను ప్రభావిత గాలులతో పలు గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది. అక్కడక్కడా కోతలు కోసిన రైతులు హడావుడిగా కుప్పలు వేసుకోగా, కొన్నిచోట్ల వరిపైరు పనలపైన ఉంది.



బొమ్ములూరులో హడావుడిగా బస్తాల్లో ధాన్యం నింపుతున్న కూలీలు

చలిగాలులు, చినుకులు

గుడివాడ రూరల్: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి చలిగాలులు, చినుకులు పడటంతో రైతులు పొలం నుంచి ధాన్యాన్ని బయటకు తేవటానికి నానా పాట్లు పడుతున్నారు. బొమ్ములూరు, చిరుచింతల, లింగవరం గ్రామాల్లో రైతులు ధాన్యం రాశులను కాపాడుకోవటానికి అద్దెకు పరదాలు తెచ్చుకుని కప్పుతున్నారు. కొందరు కాటాలు వేయించి బస్తాలను ఇళ్లకు, గోడౌన్లకు, చావిళ్లకు తరలించుకుంటున్నారు. మరికొందరు రేటు సంగతి చూద్దాం ముందు ధాన్యం తోలుకోండి అని మిల్లు యజమానులను ప్రాధేయపడి మిల్లులకు తోలుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ధాన్యం చేతికి అందదేమోనని ఆందోళన చెందుతున్నారు. వారం నుంచి కష్టపడుతున్నా అధికారులు, నాయకులు వచ్చి వెళ్లటమే కానీ పరిష్కారం కనపించటం లేదని బొమ్ములూరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిల్లుల నుంచి కొనుగోళ్లకు అనుమతి లేకపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెట్ సరిగా పనిచేయకపోవటం వల్ల రైతులకు సకాలంలో సేవలు అందడం లేదు.

గోడౌన్లు పరిశీలిస్తున్నాం: జేసీ గీతాంజలి శర్మ



భారీ వర్షాలు కురిస్తే ధాన్యం నిల్వ చేయడం కోసం తట్టివర్రులో ప్రైవేట్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న జేసీ గీతాంజలిశర్మ

గుడివాడ రూరల్: తుపాన్ రాష్ట్రం వైపు వస్తున్నందున గోడౌన్లను పరిశీలిస్తున్నామని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. శనివారం తట్టివర్రులో ఉన్న ప్రైవేట్ గోడౌన్‌ను జేసీ పరిశీలించారు. వర్షాలు భారీగా కురిస్తే ఒక పెద్ద గోడౌన్‌ను తమకు అప్పగించాలని యాజమాన్యంతో మాట్లాడారు. రైతులను ఆదుకోవటానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కోటేశ్వరరావు, ఏడీఏ ఎస్.రమాదేవి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంచులు, టార్పాలిన్ల కొరత

కూచిపూడి: కూచిపూడి, మొవ్వ, పెదసనగల్లు, చినముత్తేవి, భట్లపెనుమర్రు, కోసూరు, కాజ, నిడుమోలు గ్రామాల్లో రైతులు అకాల వర్షం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు తోడు గాలులు వీస్తుండటంతో వరికోతకు సిద్ధమైన పొలాలు నేలకొరిగాయి. ఈ ఏడాది అధికంగా యంత్రాలతో నూర్పిళ్లు చేశారు. రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. సంచుల కొరతతో నూర్చిన ధాన్యం ఎక్కడికక్కడే నిల్వ ఉండిపోయింది. ధాన్యాన్ని రక్షించుకునేందుకు టార్పాలిన్లు, పరదాల కొరత ఏర్పడింది. కాటా వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలంటే లారీల కొరత ఉంది. మిల్లుల్లో ధాన్యం దించుకోవడం లేదని తిప్పి పంపిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ధాన్యం తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టుకోవటం రైతులకు ప్రహసనంగా మారింది. అసలే తేమగా ఉన్న ధాన్యం వర్షాలకు తడిస్తే మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



మొవ్వలో ధాన్యం బస్తాలపై పరదాలు కప్పుతున్న రైతులు



జూపూడిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ జిల్లాలో 2, 31,127 మందికి

రూ.97.93 కోట్లు పంపిణీ

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 2,31,127 మంది పింఛన్‌దారులకు రూ.97.93 కోట్లను అందజేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలో వేకువజామునే వృద్ధాప్య పింఛన్‌దారుడు దొప్పలపూడి సాంబశివరావు, విభిన్న ప్రతిభావంతుల పింఛన్‌దారులు గౌరినేని శ్రీలేఖ, మొక్కపాటి సత్యశ్రీల ఇంటి తలుపుతట్టి పింఛన్ సొమ్మును అందజేశారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. గతంలో వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన వారి జాబితాను పునఃపరిశీలించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తామన్నారు. డీఆర్డీయే పీడీ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీతశర్మ, తహసీల్దార్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎంపీ కేశినేని చిన్నికి మొక్కను అందజేస్తున్న రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు పొలిశెట్టి లక్ష్మీ సత్యనారాయణశ్రేష్ఠి

మర్యాదపూర్వక కలయిక

వన్‌టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా నియమితులైన పొలిశెట్టి లక్ష్మీసత్యనారాయణ శ్రేష్ఠి మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేశ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు గడ్డం రవి, వీవీకే నరసింహారావు, సీఎల్ అరుణ్ పాల్గొన్నారు.

ఆడపిల్లకు జన్మనిచ్చిన బాలిక

» తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తి అఘాయిత్యం

» ఆలస్యంగా వెలుగులోకి వ్యవహారం.. నిందితుడిపై పోక్సో కేసు

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తండ్రి స్థానంలో ఉన్న వ్యక్తి పదహారేళ్ల బాలికను గర్భవతిని చేశాడు. ఆ బాలిక రెండు వారాల క్రితం ఆడ శిశువుకు జన్మనివ్వడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అజిత్‌సింగ్‌నగర్ లూనా సెంటర్ ప్రాంతానికి చెందిన బాలిక(16) సమీపంలోని ఓ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. బాలిక చిన్న వయస్సులోనే తల్లిదండ్రుల మధ్య విభేదాలు రావడంతో వారిద్దరూ విడిపోయారు. అప్పటి నుంచి బాలిక తల్లి వద్దనే ఉండి చదువుకుంటోంది. బాలిక తల్లి పదేళ్లక్రితం అదే ప్రాంతానికి చెందిన అనంత శంకర్‌దాస్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. బాలిక తల్లి హౌస్‌కీపింగ్ విధుల నిమిత్తం వేరే పట్టణాలకు వెళ్లి 15 రోజులపాటు అక్కడే ఉండేది. ఆ సమయంలో శంకర్‌దాస్ బాలికకు మాయమాటలు చెప్పి, బెదిరించి బాలికపై అఘాయిత్యానికి పాల్పడుతుండేవాడు. నాలుగు నెలల క్రితం బాలిక అనారోగ్యానికి గురికావడంతో విషయాన్ని తన తల్లికి చెప్పింది. దీంతో తల్లి వైద్య పరీక్షలు చేయించగా బాలిక గర్భవతి అని తేలింది. దీంతో అప్పటి నుంచి తల్లి బాలికను పాఠశాలకు మాన్పించి ఖమ్మంలోని బంధువుల ఇంటి వద్ద ఉంచింది. ఈనెల18న బాలిక ఆడ శిశువుకు జన్మనివ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆస్పత్రి నుంచి సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శంకర్‌దాస్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. శంకర్‌దాస్ పరారీలో ఉన్నాడు. శంకర్‌దాస్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నలుగురు మోటారు

దొంగల అరెస్టు

» 34 మోటార్లు, బైక్, కారు స్వాధీనం

నందివాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపల చెరువులపై మోటార్ల చోరీకి పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ సోమేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.3.16 లక్షల విలువ చేసే 34 మోటార్లు, ఓ కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మోటార్లు పోతున్నాయని పలువురు రైతులు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ కె.శ్రీనివాస్ తన సిబ్బందితో గస్తీ నియమించారు. నలుగురిని అదుపులోకి కేసు నమోదు చేసి గుడివాడ కోర్టుకు తరలించినట్లు తెలిపారు.





శ్రీమతి అమరావతి ఆడిషన్స్‌లో పాల్గొన్న మహిళలు

సొగసైన శ్రీమతులు

విజయవాడ సిటీలైఫ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తేజాస్ ఎలైట్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శనివారం ఓ ప్రైవేటు హోటల్‌లో శ్రీమతి అమరావతి తొమ్మిదో సీజన్ ఆడిషన్స్ నిర్వహించారు. మొత్తం 50 మంది మహిళలు పేర్లను నమోదు చేసుకోగా 30 మంది ఆడిషన్స్‌లో పాల్గొన్నారు. వారిలో 26 మందిని పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 14వ తేదీన ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని తేజాస్ ఎలైట్ ఈవెంట్స్ అధినేత ప్రదీప్‌చౌదరి వెల్లడించారు.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు

ఘన వీడ్కోలు

గన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనవీడ్కోలు లభించింది. రెండు రోజుల క్రితం ఢిల్లీ నుంచి విజయవాడ వచ్చిన సంగతి తెలిసిందే. రెండు రోజుల కార్యక్రమాల అనంతరం శనివారం రోడ్డు మార్గాన ఆయన విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం కోవింద్ దంపతులు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో హైదరాబాద్ వెళ్లారు. పలువురు అధికారులు వీడ్కోలు పలికారు.

దుకాణాలు ఇప్పిస్తానని మోసం చేసిన

వైసీపీ నాయకుడిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తనకు ఎమ్మెల్యే, రాజకీయ నాయకులు తెలుసని నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద వ్యాపార దుకాణాలు ఇప్పిస్తానని ఓ మహిళను నమ్మించి రూ.25 లక్షలు వసూలు చేసిన వైసీపీ నాయకుడు, అతని భార్యపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కేదారేశ్వరపేటకు చెందిన పల్లె శివపార్వతి ప్రభాస్ కాలేజీ వద్ద గల రైతుబజార్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంది. భర్త ముఠా పని చేస్తుంటాడు. మూడేళ్ల క్రితం వైసీపీ నాయకుడు మహేష్ అతని భార్య ఝాన్సీలు శివపార్వతికి పరిచమయ్యారు. తమకు ఎమ్మెల్యే, రాజకీయ నాయకులు తెలుసని ఆమెను నమ్మబలికారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వ్యాపార దుకాణాలు ఇప్పిస్తానని చెప్పి ఆమె వద్ద నుంచి రూ.25 లక్షలు, 14 కాసుల బంగారపు ఆభరణాలు విడతల వారీగా వసూలు చేశారు. అప్పటి నుంచి వ్యాపార దుకాణాల గురించి శివపార్వతి అడుగగా మహేష్, అతని భార్య అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారు. దీంతో విసిగిపోయిన మహిళ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేటరే పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

సంఘీబావం తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకోవటానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడతానని ఎంపీ స్పష్టం చేశారు.

కల సాకారం దిశగా..

రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో 45 గ్రామాలను కలిపి గ్రేటర్ సిటీగా చేయటానికి ప్రతిపాదనలు తీసుకొచ్చారు. విలీన ప్రతిపాదిత పంచాయతీల తీర్మానాలను కూడా తీసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ తీర్మానాలను పక్కన పెట్టేసింది. తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 'గ్రేటర్' అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా శనివారం డీఆర్‌సీ సమావేశం జరిగింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా గ్రేటర్ విలీన ప్రాంతాలను కృష్ణాజిల్లాలో కలపటం వల్ల తలెత్తిన సమస్యలపై ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరంలో ఉందని, విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న ఈ విమానాశ్రయం కృష్ణాజిల్లాలోకి వెళ్లిందన్నారు. అమరావతికి వచ్చే వీవీఐపీలు, వీఐపీలు విజయవాడ విమానాశ్రయానికి వస్తారని, కానీ, 65 కిలోమీటర్ల దూరం నుంచి పోలీసులు, జిల్లా యంత్రాంగ అధికారులు ఇక్కడికి వచ్చి ప్రొటోకాల్ విధులు నిర్వహించాల్సి వస్తోందని చెప్పారు. దీనిపై డీసీపీ కృష్ణమూర్తినాయుడు స్పందిస్తూ విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాన్ని కృష్ణాజిల్లా పోలీసులు చూడటం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గ్రేటర్ విజయవాడతో అనేక ప్రధానమైన సమస్యలు తొలగుతాయన్నారు. ప్రజాప్రతినిధులందరూ గ్రేటర్‌కు అనుకూలంగా ఉన్నారు కాబట్టి.. కమిషనర్, కలెక్టర్లు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ గ్రేటర్ విజయవాడపై త్వరలో సీఎంతో మాట్లాడతామని, ఎన్ని గ్రామాలను విలీనం చేయాలన్న దానిపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.

విషాదం

(5వ పేజీ తరువాయి)

స్థలాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎస్పీ ఆర్.గంగాధరరావు సందర్శించారు.

తనయుడు లేడని తెలిసి తనువు చాలించిన తల్లి

ముగ్గురు స్నేహితుల మృతితో బలరామునిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులంతా హుటాహుటిన కంకిపాడు వెళ్లారు. కాగా, ఏసుబాబు మృతి వార్త విన్న తల్లి సుధారాణి (60) గుండెపోటుకు గురై మృతిచెందారు. తనయుడి మృతివార్త విని గుండెలు బాదుకున్న ఆమె ఒక్కసారిగా హార్ట్ ఎటాక్‌కు గురయ్యారు. ఆమెను మచిలీపట్నం దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది.

ఫెంగల్ కలవరం

(5వ పేజీ తరువాయి)

పాటు మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల వెన్నులో వణుకు మొదలైంది. వర్షాలకు తోడు బలమైన గాలులు వీయడంతో గుడివాడ, నందివాడ, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో పైరు నేలవాలింది. గూడూరు మండలంలోని లేళ్లగరువు, కలపటం, ముక్కొల్లు తదితర గ్రామాల్లో కోతకోసిన పనలపై ఉన్న వరి తడిచిపోయింది. చల్లపల్లి, మొవ్వ, పామర్రు తదితర మండలాల్లో కోతకోసి ఉన్న పొలంలోని పంటది కూడా ఇదే పరిస్థితి. పెదప్రోలు, కంసాలిపాలెం, మోపిదేవి తదితర ప్రాంతాల్లో రాశులుగా పోసి ఉన్న ధాన్యం తడవకుండా ఉండేందుకు ఆర్డీవో స్వాతి ఆధ్వర్యంలో శనివారం రైతులకు టార్పాలిన్ పట్టాలు అందజేశారు.

రోడ్లపైనే ధాన్యపు రాశులు

కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారులు, డొంకరోడ్లు, పొలాల్లోని దిబ్బలపై ధాన్యాన్ని రాశులుగా పోసి ఉంచారు. శనివారం రాత్రి కూడా వర్షం కురుస్తూనే ఉండటంతో రాశుల అడుగు భాగంలోకి నీరు చేరింది. దీంతో రెండు అంగుళాల మందంలో ధాన్యం తడిచిపోతోందని, పరదాలు కప్పి ఉంచడం వల్ల మొలకలు వస్తాయని రైతులు చెబుతున్నారు. శనివారం వర్షం కురుస్తూనే ఉండటంతో ధాన్యాన్ని మిల్లులకు తరలించే అవకాశం లేకుండాపోయింది.

ఇసుక దుమారం

(5వ పేజీ తరువాయి)

సమీపంలో 16 రోజులుగా ఇసుకను అనధికారికంగా తరలించుకుపోతున్నారని, అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వంపై నిలదీత

ధాన్యం కొనుగోలు, తేమశాతం పేరుతో మద్దతు ధరలో కోత పెడుతున్న తీరుపై ఉమ్మడి జిల్లాకు చెందిన సభ్యులంతా అధికారులను నిలదీశారు. బస్తా ధాన్యానికి మద్దతు ధరను రూ.1,725 ఇవ్వాల్సి ఉండగా, రూ.1,380 నుంచి రూ.1,400కే ఇస్తున్నారన్నారు. ధాన్యం ఎత్తేందుకు సంచులు ఇవ్వకుండా, రవాణాకు వాహనాలను సమకూర్చకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వమే ధాన్యం కొంటున్నట్లు పైకి చెబుతున్నా, దళారులు చెప్పినట్టుగానే రైతుసేవా కేంద్రాల సిబ్బంది, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు నడుచుకుంటున్నారని సభ్యులు పేర్కొన్నారు. తేమశాతం అధికంగా ఉందని ముసునూరు, గన్నవరం, గూడూరు తదితర మండలాల్లో బస్తాకు 10 కిలోలు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారన్నారు. మోపిదేవి జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యాన్ని సక్రమంగానే కొంటోందని, రైతులకు మద్దతు ధర కూడా ఇస్తోందని, యంత్రాల ద్వారా అధికశాతం వరి కోతలు పూర్తిచేయడంతో కొనుగోలులో కొంతమేర ఇబ్బంది ఏర్పడిందన్నారు. దీంతో సభ్యులంతా లేచి ఆయనతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో మంత్రి కలుగజేసుకుని.. ప్రతి ధాన్యపు గింజను కొంటామని, వర్షాల వల్ల రైతులు కొంతమేర ఇబ్బందుల పాలవుతున్నారని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ గత ఏడాది నవంబరు నెలాఖరు నాటికి 35 వేల టన్నుల ధాన్యాన్ని కొనగా, ఈ ఏడాది ఇప్పటివరకు 95 వేల టన్నులు కొన్నామన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కార మార్గం

జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా జిల్లాను యూనిట్‌గా పరిగణించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళికను రూపొందించినట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కేంద్ర మంత్రులను కలిసి ఈ అంశంపై చర్చించినట్లు తెలిపారు. ఈ పథకం అమలు కోసం, నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరుపుతామన్నారు. కృష్ణాడెల్టాలో పంటకాల్వలు, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేసేందుకు వేసవిలో చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి : యార్లగడ్డ

స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్న, జిల్లాను అభివృద్ధి చేసేందుకు పాటుపడిన మహనీయుల విగ్రహాలను మచిలీపట్నంలో ఏర్పాటు చేసేందుకు జెడ్పీ పాలకవర్గం ఆమోదం తెలపాలని ప్రభుత్వవిప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రతిపాదన చేశారు. పింగళి వెంకయ్య, పట్టాభి సీతారామయ్య, కాకాని వెంకటరత్నం, అయ్యదేవర కాళేశ్వరరావు తదితర మహనీయుల విగ్రహాలకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని చెప్పారు. ఈ ప్రతిపాదనకు సభ్యులంతా ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	107, 115, 126
చికెన్ విత్ స్కిన్	204
చికెన్ స్కిన్‌లెస్	214

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 610

మైమరపించిన గాత్ర కచేరీ



విజయవాడకల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురంలోని రామకోటి క్షేత్రంలో జరుగుతున్న సద్గురు సంగీత సభ 31వ వార్షిక సంగీత మహోత్సవాలలో ఏడో రోజు శనివారం కార్యక్రమంలో ఐశ్వర్య విద్యా రఘునాథ్ గాత్రకచేరీ నిర్వహించారు. తొలుత ఆమె తోడి రాగ వర్ణం వినిపించి మైమరిపించారు. వీరికి వయోలిన్‌పై శివాని, మృదంగంపై ప్రసాద్, ఘటం రామకృష్ణలు వాద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని పోపూరి గౌరీనాథ్ నిర్వహించారు.

వృద్ధులకు ముఖ్యమంత్రి అండ

పటమట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వృద్ధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉండడమే కాకుండా ప్రతీ ఇంటికి పెద్దకొడుకు మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 12వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబుతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గద్దె రామ్మోహన్ స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులకు సీఎం ఒకటో తేదీనే పింఛన్లు అందజేసి వారికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. త్వరలోనే కొత్త పింఛన్లు ఇస్తామన్నారు. 60 ఏళ్లు పైబడిన వారు ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ఆర్టీసీ బస్సుల్లో25 శాతం రాయితీ పొందవచ్చునన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

14వ డివిజన్‌లోని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.2,34,920లను బాధితులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన కార్యాలయంలో శనివారం అందజేశారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న గద్దె రామ్మోహన్



పింఛన్ అందజేస్తున్న ఆర్డీఓ కావూరి చైతన్య

పటిష్ట ప్రణాళికతో పెన్షన్ల పంపిణీ

కృష్ణలంక: పటిష్ట ప్రణాళికతో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్నట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య అన్నారు. శనివారం ఆయన విజయవాడ ఉత్తర మండలం పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా అర్హులు ఎవరైనా వుంటే వారిని కూడా గుర్తించి పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.

రాణిగారితోట: 18వ డివిజన్‌లో శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని గెలిచిన వెంటనే అమలు చేస్తూ పెంచిన పెన్షన్లు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కాశి, శ్రీను, విజయ్, కాశయ్య, శ్రీను, దుర్గమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సమరం, మారు

ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమే

డాక్టర్ జి సమరం

పటమట,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో చైతన్యం వచ్చిన రోజున హెచ్ఐవీ/ ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమేనని ప్రముఖ వైద్యులు డాక్టర్ జి. సమరం పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ మారు అధ్యక్షతనశనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై ప్రసంగించారు. యాంటీ రిట్రో వైరల్ డ్రగ్స్ రావటంతో, వివిధ నివారణ చర్యలతోను హెచ్ ఐవీ కేసులు గణనీయంగా తగ్గిపోయాయన్నారు. రెయాంటీ రిట్రో వైరల్ డ్రగ్స్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, అయినా అవగాహన రాహిత్యం వలన ఆ సేవలు సక్రమంగా పొందటం లేదన్నారు. హెచ్ ఐవీ రాకుండా నెలనెలా చేయించుకునే ఇంజక్షన్లు కొన్ని దేశాల్లో అందుబాటులోకి వచ్చాయని సమరం తెలిపారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వ్యాపారితో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం కృష్ణలంక జాతీయ రహదారిని ఆనుకొని వున్న సర్వీసు రోడ్డులో పర్యటించి ఆ ప్రాంతంలో షాపులకు ట్రేడ్ లైసెన్స్ వుందా లేదా అని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారం చిన్నదైనా, పెద్దదైనా, వ్యాపారం చేసే ప్రతి వ్యక్తికి ట్రేడ్ లైసెన్స్ ఖచ్చితంగా ఉండాలని, ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శేషజీవితం ఆనందంగా గడపండి

పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు

గుణదల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన వారు శేషజీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుకుంటున్ననట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అభినందన సభ సీపీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించారు. పదవీ విరమణ చేసిన కంట్రోల్‌రూమ్ ఎస్ఐ బి.లక్ష్మీనారాయణ, వన్‌ట్రాఫిక్ ఏఎస్ఐ ఎ.చెన్నయ్యనాయుడు, సీసీఆర్‌బీ ఏఎస్ఐ సి.హెచ్.వి. నాగేశ్వరరావులను సీపీ దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేషజీవితం ఆరోగ్యవంతంగా, కుటుంబ సభ్యులతో గడపడానికి కేటాయించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, క్రైమ్ ఏడీసీపీ ఎం.రాజారావు, ఏవో సునీత, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి రూట్స్ ఆర్థిక సహాయం



బాధితురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న రూట్స్ సభ్యులు

పటమట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నోషల్ మంత్ సందర్భంగా రూట్స్‌హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలరోజుల నుంచి గడ్డం, హెయిర్ కట్ చేయించుకోకుండా ఉండి తద్వారా వచ్చే డబ్బును పేద కేన్సర్ బాధితురాలికి శనివారం అశోక్‌నగర్‌లోని రూట్స్ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి. విజయభాస్కర్ మాట్లాడుతూ ఈ నెలలో వసూలైన రూ.7వేలను తాడేపల్లిగూడెంకు చెందిన ధనమ్మ అనే కేన్సర్ బాధితురాలికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో చందు శ్రీనివాస్, డాక్టర్ బెనర్జీ, విజయలక్ష్మి, యలమందయ్య, క్రాంతి, కె. మాధవిలు పాల్గొన్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి



● పటమట సెంటర్ సాయి హోటల్, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర పాదచారులు రోడ్డు దాటడానికి జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతంలో పాఠశాలలు, కార్పొరేట్ కళాశాలలు ఎక్కువగా ఉన్నాయి. రోడ్డు దాటాలంటే ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందిగా మారింది.

మోతుకూరి అరుణ్‌కుమార్

● డివైడర్ లేని చోట జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. అయినప్పటికీ ఒకసారి నేషనల్ హైవే అథారిటీ వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తూర్పు ఎమ్మెల్యే

(పటమట, ఆంధ్రజ్యోతి)

సైబర్ క్రైమ్‌పై అందరూ అవగాహన పొందాలి



పోస్టర్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తదితరులు

లబ్బీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్‌పై అందరూ అవగాహన పొందాలని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన అన్నారు. ప్రపంచ సైబర్ భద్రతా దినోత్సవం సందర్భంగా శనివారం సిద్ధార్థ మహిళా కళాశాలలో పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్సనల్ డేటా దొంగతనం, ఆన్‌లైన్ మోసాలు, కంప్యూటర్ వ్యవస్థలపై దాడులు జరుగుతున్నాయని, ముఖ్యంగా ఆన్‌లైన్‌లో చేసే అన్ని కార్యకలాపాలను ప్రభావితం చేస్తున్నాయని, విద్యార్థులు సైబర్ క్రైమ్ భద్రత చర్యలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా పోస్టర్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో తరుణికి మొదటి స్థానం

ఆంధ్రా లయోల కళాశాలలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీల్లో తమ విద్యార్థిని డి.తరుణి(డిగ్రీ మొదటి సంవత్సరం) మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. డిసెంబరు 18నుంచి 26వరకు పంజాబ్‌లోని గురుకాశీ విశ్వవిద్యాలయంలో జరిగే ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కల్పన, స్పెషల్ ఆఫీసర్ మాధవి, యాజమాన్యం తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

భ్రమరాంబపురంలో కుక్కల స్వైరవిహారం

● బెంబేలెత్తుతున్న స్థానికులు ● పట్టించుకోని కార్పొరేషన్ సిబ్బంది



కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక భ్రమరాంబపురంలో కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. 20వ డివిజన్ పరిధిలోని అయితా రాములు కొట్టువీధి, అన్నమ్మ తల్లి గుడి సెంటర్, మలేరియా ఆస్పత్రి సెంటర్, జిమ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో రాత్రయితే చాలు వీధి కుక్కలు రోడ్లమీద స్వైరవిహారం చేస్తూ, రోడ్డుపై వెళ్లేవారిని అటకాయిస్తూ వారిని పడేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ సిబ్బంది వీధి కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో లయోలా కళాశాల విద్యార్థులు, సిబ్బంది

భారతీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో లయోలా కళాశాల ప్రాంతంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజలకు హెచ్ఐవీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.శేఖర్, డాక్టర్.ఆర్.జాన్, బి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

మొగల్రాజపురం: ఎయిడ్స్ రోగులు భయపడాల్సిన పని లేదని, మందులు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ కె. వసుంధర చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ డాక్టర్ ఎన్. విద్యాఖన్నా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని నివారించడం అసాధ్యమని, ఎయిడ్స్ వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మహిళా శిశుసంక్షేమ శాఖ డీసీపీవో ఎం.రాజేశ్వరరావు , నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణా సంస్థాన్ సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.

నయనానందకరం శివపార్వతుల కల్యాణం

పటమట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తబృందం అయ్యప్పనగర్ శాంతి రోడ్డులో మాసశివ రాత్రిని పురస్కరించుకుని ఏకాంబరేశ్వరుడు, కామాక్షిదేవిల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. 12వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గురుస్వామి శాయన బుజ్జి నేతృత్వంలో శ్రీరామమూర్తి, పవన్‌ల పర్యవేక్షణలో శివకల్యాణం నయనా నందకరంగా సాగింది. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కొబ్బరికాయ కొట్టి కల్యాణం ఘట్టాన్ని సామాన్యులకు అర్థమ య్యే రీతిలో వివరించారు. అయ్యప్పభక్త బృందం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు ప్రసాద వితరణ చేసి సన్మానించారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి సాయి బాబు, యుగంధర్, ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన

రాణిగారితోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో అండర్ గ్రౌండ్ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కృషి చేస్తున్నారని టీడీపీ తూర్పు బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కిర తిరుపతయ్య అన్నారు. డివిజన్‌లోని తమ్మిన పోతురాజు వీధిలో పొంగి పొర్లుతున్న యూజీడీ మ్యాన్‌హోల్ క్లీనింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడానికి వైసీపీ ప్రభుత్వంలో చేసిన యూజీడీ పనులే కారణమన్నారు. దీనిపై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అధికారులతో మాట్లాడుతున్నారని, త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతారని అన్నారు.

బాక్సింగ్‌లో పీబీ సిద్ధార్థకు పతకాల పంట



బాక్సింగ్ క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఆంధ్రా లయోలా కళాశాలలో 27న జరిగిన కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాల బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు ఐదు స్వర్ణాలు, రెండు రజతాలతో సత్తా చాటారు. రాజ్‌కుమార్, గణేష్, గంగాధర్, మాధవి స్వర్ణం, శైలజ స్వర్ణం, సురేంద్ర, పూర్వి రజతం సాధించారు.వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రమేష్, యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టీవీబీ కృష్ణారావులు అభినందించారు.

పోరంకి శ్రీ కృష్ణవేణిలో ఏయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్

పెనమలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ కార్యాలయం పోరంకి శ్రీ కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారని కళాశాల మేనేజిమెంట్ తెలిపింది. డిగ్రీ, పీజీ, డిప్లొమా విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది. వివరాలకు 9246837117, 9393935363, 08662581117 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పొట్టిశ్రీరాములు కాలేజీలో టెక్నాలజీ క్లబ్ ప్రారంభం

వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో ఎంసీఏ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల కోసం టెక్నాలజీ క్లబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్ మాట్లాడుతూ ఈ క్లబ్ ద్వారా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుంటారని, సమస్యలను సృజనాత్మకతతో ఆలోచించి పరిష్కరించుకుంటారన్నారు. పరిపాలనా విభాగం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్ బాబు, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలి శాస్త్రి, ఐక్యూఏసీ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, పరీక్షల కంట్రోలర్ డాక్టర్ ఎస్.మణికంఠ, టెక్నాలజీ క్లబ్ కో ఆర్డినేటర్ కోరాడ శిరీష పాల్గొన్నారు.

జీవవైవిధ్య నాణేలు

అడవులు, జంతువులు, పక్షులు, భూమి, జలవనరులు... ఇవన్నీ జీవవైవిధ్యంలో భాగాలు. ఇందులో ఏ అంశం అదుపుతప్పినా పర్యావరణానికి పెను ప్రమాదం సంభవిస్తుంది. పర్యావరణంలో చొరబడిన కాలుష్యం కారణంగా ఎదురవుతున్న సవాళ్లను ప్రపంచంలోని అన్ని దేశాలు చూస్తున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడుతున్న ఉద్గారాలు గాలిలో కాలుష్యాన్ని పెంచుతున్నాయి. అటవీ ప్రాంతం తగ్గిపోతుండడంతో జంతువులు, పక్షులు కనుమరుగవుతున్నాయి. భూమిపై పచ్చదనం తగ్గిపోవడంతో వాతావరణంలో వెచ్చదనం పెరుగుతోంది. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి ఐక్యరాజ్య సమితి కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఇందులో సభ్యత్వం కలిగిన దేశాలు ఈ లక్ష్యానికి అనుగుణంగా సదస్సులు నిర్వహించాయి. కొన్ని ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సదస్సులు, ఒప్పందాల జ్ఞాపకార్థం ఆయా దేశాలు కొన్ని నాణేలను ప్రత్యేకంగా ముద్రించాయి. వాటిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్




'స్టాక్‌హోం' కాయిన్



పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని 1972లో స్టాక్‌హోంలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పర్యావరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్టాక్‌హోం సదస్సు గౌరవార్థం కొన్ని దేశాలు నాణేలను ముద్రించాలని నిర్ణయించుకున్నాయి. వెండి, నికెల్ తామ్రంతో ఈ నాణేలను విడుదల చేశారు.

'ఉద్గారం' నాణెం...

పారిశ్రామికీకరణ నేపథ్యంలో అన్ని దేశాల్లో కాలుష్య కారకాలు పెరిగిపోతున్నాయి. ఇవన్నీ పర్యావరణంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా పరిశ్రమల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న నినాదంతో ఐక్యరాజ్య సమితి గ్రీన్‌బెల్టు పాలసీ రూపకల్పనకు 2009లో సదస్సును నిర్వహించారు. ఇందులో పాల్గొన్న దేశాలు వాటి జాతీయ ముద్రలతో పర్యావరణానికి సంబంధించిన గుర్తులను జోడించి వెండి, బంగారం నాణేలను ముద్రించాయి.





గజరాజులకు ఏ నాణెం

జీవవైవిధ్యంలో జంతువులు ఓ భాగం. ఏనుగుల పరిరక్షణకు పలావు దేశం లవ్‌సింబల్‌లో ఉండే నాణేన్ని విడుదల చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో మైక్రోనేషియా ప్రాంతంలో 500 ద్వీపాలతో ఈ దేశం ఉంటుంది. ఈ దేశానికి కోరోర్ అనే మరో పేరుంది. దీవుల్లో జరిగే వాణిజ్యానికి ఇది కేంద్ర బిందువు. ఈ దేశం 2013లో 5 డాలర్ల వెండి నాణేన్ని లక్కీ ఎలిఫెంట్స్ ఎవ్రీథింగ్ ఫర్ యూ నినాదంతో విడుదల చేసింది.

'ఎర్త్' కాయిన్

ప్రపంచ దేశాల్లోని ప్రజలకు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధిపై అవగాహన పెంచడానికి ఐక్యరాజ్య సమితి లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందుకోసం 1992లో రియో డీ జెనీరోలో పర్యావరణ అభివృద్ధి సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో పాల్గొన్న దేశాలు ఈ సదస్సు జ్ఞాపకార్థం వెండి, నికెల్ తామ్రంతో రియో ఎర్త్ సమ్మిట్ నాణేలను విడుదల చేశాయి.



'వాతావరణ' ఒప్పంద నాణెం

అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వాతావరణం. ఒకప్పుడు ఒక సైకిల్ ప్రకారం ఉండే వాతావరణంలో అనేక మార్పులు శరవేగంగా వచ్చాయి. ఎండలు తీవ్రంగా ఉన్న రోజుల్లో ఒక్కోసారి వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తాయి. ఏడాది మొత్తంలో ఎప్పుడు తుఫాన్లు వస్తాయో తెలియని పరిస్థితి. వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యమే దీనికి కారణమని అభివృద్ధి చెందిన దేశాలు గుర్తించాయి. కలుషితమైన వాతావరణంలో మార్పులు తీసుకురావడానికి 2015లో పారిస్ నగరంలో క్లైమేట్ చేంజస్ పేరుతో ఒక సదస్సును నిర్వహించారు. కాలుష్యమయమవుతున్న వాతావరణాన్ని తిరిగి మార్చడానికి చేపట్టాల్సిన విధానాలపై అగ్రిమెంట్‌ను రూపొందించుకుని ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సదస్సులో పాల్గొన్న దేశాలు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను సూచించే నాణేలను విడుదల చేశాయి.



భవనం ప్రారంభోత్సవంలో రవీంద్ర, కృష్ణప్రసాద్, నారాయణరావు, వేదవ్యాస్

చలసాని సారథ్యంలో విజయ డెయిరీ అభివృద్ధి

● చైర్మన్‌పై మాజీ ఎంపీ కనకమేడల ప్రశంసల జల్లు

పెడన, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చలసాని ఆంజనేయులు సారథ్యంలో విజయ డెయిరీ ఎంతగానో అభివృద్ధి చెందిందని, అత్యధిక పాల సేకరణ ధర చెల్లించడమే కాక నూతన ఫ్యాక్టరీని కూడా ప్రారంభించడం గొప్ప విశేషమని రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్ర అన్నారు. పెడన మండలం పెనుమల్లి గ్రామంలో రవీంద్ర ఎంపీ నిధులతో నిర్మించిన నూతన పాల సేకరణ కేంద్ర భవనాన్ని శనివారం సాయంత్రం రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ పోటీని తట్టుకుని కృష్ణామిల్క్ యూనియన్‌ను విజయపథంలో నడిపించిన ఆంజనేయులు నిజంగా అభినందనీయుడని ప్రశంసించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విజయ డెయిరీ పాడిరైతులకు అధిక ధర చెల్లించడమే కాక వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోవడం గొప్ప విశేషమన్నారు. కళ్యాణమస్తు పథకం కింద పాడి రైతుల ఇళ్లల్లో వివాహాలకు బంగారు నాణేలివ్వడం, క్షీరబంధు పథకం కింద చనిపోయిన పాడి రైతుల కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సాయం అందిస్తూ కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు బాసటగా నిలుస్తోందని ప్రశంసించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ విజయ డెయిరీ దినదినాభివృద్ధి చెందుతూ పాడి రైతులకు కొండంత అండగా నిలుస్తోందన్నారు. చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా చలసాని ఆంజనేయులు సారథ్యంలో కృష్ణామిల్క్ యూనియన్ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ, పాడి రైతుల సంక్షేమాన్ని కాంక్షించి డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు కల్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభ వంటి వినూత్న పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ప్రశంసించారు. కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్లు అర్జా వెంకట నగేష్, చలసాని చక్రపాణి, ఎండి కొల్లి ఈశ్వరబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.



కృష్ణలంకలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పెన్షన్లను సకాలంలో అందించండి

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెన్షన్లను సకాలంలో ప్రజలకు అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం కృష్ణలంకలోని 21వ డివిజన్‌లో ఆయన పర్యటించి పెన్షన్‌దారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఆ ప్రాంతంలోని ప్రజలతో ఆయన స్వయంగా మాట్లాడారు. ప్రతి నెల పెన్షన్ వస్తుందా? ఎంత వస్తుంది? ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని మాట్లాడి తెలుసుకొన్నారు. ప్రతి నెల సమయానికి పెన్షన్‌ను సిబ్బంది అందిస్తున్నారని ఎలాంటి సమస్యలు లేవని తెలుపగా కమిషనర్ సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటల వరకు, సర్కిల్-1 పరిధిలో 20,744 పెన్షన్లకు 19326, సర్కిల్-2 పరిధిలో 25,906 పెన్షన్లకు 23,877, సర్కిల్-3 పరిధిలో 20,721 పెన్షన్లకు 19,089, మూడు సర్కిల్స్ పరిధిలో మొత్తం 67,371 పెన్షన్‌లకు 62,292 పెన్షన్లు పంపిణీ చేశారని అంటే దాదాపు 93 శాతం పెన్షన్ పంపిణీ చేశారన్నారు. ఈ పర్యటనలో పీవో (యూసీడీ) నారాయణ, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, సీవో జగదీశ్వరి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్టీటీపీఎస్‌పై ఎన్జీటీ సుమోటో కేసు నమోదు

● నవంబరు 4న మా ప్రాణాలు హరించే ఎన్టీటీపీఎస్ మాకొద్దు కథనానికి స్పందన

ఇబ్రహీంపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ ఎదుట నవంబరు 3న కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు చేసిన నిరసన ప్రదర్శనను నవంబరు 4న మా ప్రాణాలు హరించే ఎన్టీటీపీఎస్ మా కొద్దు అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురించడం జరిగింది. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన కథనానికి స్పందించి నేషనల్ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సుమోటోగా కేసు తీసుకుంది. న్యాయమూర్తి ప్రకాష్ శ్రీవాస్తవ, చైర్‌పర్సన్ డాక్టర్ ఎ.సెంతిల్‌వేల్‌తో కూడిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రిన్సిపల్ బెంచ్ సుమోటోగా విచారణకు సిద్ధమైంది. ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడుతున్న దుమ్ము, బూడిద వల్ల ఇబ్రహీంపట్నం, కొండపల్లితో సుమారు 10 గ్రామాల్లోని ప్రజలకు గుండె, ఊపిరి తిత్తుల వ్యాధులు సంభవించడంతో పాటు ఆయా గ్రామాల్లోని పంటలు పాడుతున్నాయని పత్రికలో ప్రచురితమైన విషయాలను పరిగణలోకి తీసుకొని కాలుష్య నివారణ, నియంత్రణ యాక్ట్ 1981, పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు ఎన్జీటీ గమనించింది. ఈ కేసులో కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలను, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ, విజయవాడ జిల్లా మేజిస్ట్రేట్‌లను ట్రిబ్యునల్ ప్రతివాదులుగా చేర్చింది. తదుపరి విచారణ తేదీకి కనీసం ఒక వారం ముందు ట్రిబ్యునల్‌లోని సదరన్ జోనల్ బెంచ్ ముందు అఫిడవిట్ ద్వారా తమ స్పందనలు, ప్రత్యుత్తరాలను దాఖలు చేయాలని ప్రతివాదులను ఎన్జీటీ ఆదేశించింది. ట్రిబ్యునల్ తదుపరి చర్య కోసం అసలు దరఖాస్తును చెన్నైలోని దక్షిణ జోనల్ బెంచ్‌కు బదిలీ చేసింది. ఈ అంశాన్ని వచ్చే ఏడాది జనవరి 10 విచారణ చేయనున్నట్లు తెలిసింది.

ప్రతి నిర్మాణంలోనూ ప్రజల భాగస్వామ్యం

● రాజధాని అమరావతిలో తలపెట్టే ప్రతి పని ఇక ప్రజాభాగస్వామ్యంతోనే..!

● సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసు డిజైన్స్‌పై ప్రజాభిప్రాయ సేకరణ





విజయవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో తలపెట్టే ప్రతి పనికీ ప్రజలను భాగస్వామ్యం చేయాలన్న దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధానిలో చేపట్టే ఏ పనైనా, ప్రాజెక్టు నిర్మాణాలైనా ప్రజల ఆకాంక్షలు, సూచనల మేరకు ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సీఆర్‌డీఏ అధికారులు అమల్లోకి తీసుకు వచ్చారు. రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ డిజైన్స్ ఎలా ఉండాలన్న దానిపై సీఆర్‌డీఏ ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టింది. సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసుకు సంబంధించి రూపొందించిన మొత్తం 10 డిజైన్లను సీఆర్‌డీఏ అధికారులు తమ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఈ 10 డిజైన్లలో ఏది నచ్చిందో ఓటు వేసే పోల్ ఆప్షన్ ఇచ్చారు. వరుసగా పది నమూనాలుంటాయి. వీటిని జూమ్ చేసుకుని చూడొచ్చు. నచ్చిన డిజైన్‌ను ఎంచుకుంటే పేరు, విద్యార్హతలు, ఫోన్, రివ్యూ కోరుతూ ఒక పాపప్ వస్తుంది. అవి పూర్తి చేశాక సబ్‌మిట్ చేయాలి. శనివారం మధ్యాహ్నం అధికారికంగా వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రచారం చేపట్టకపోయినా సాయంత్రం 5 గంటల సమయానికి 438 మంది ఓటింగ్ వేశారు. ఆదివారం నుంచి సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసు డిజైన్లకు ఓటింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రజ్యోతి పాఠకులూ సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌కు వెళ్లి అందులోని మోడల్స్‌లో మీకు ఏది నచ్చిందో దానికి ఓటు వేయవచ్చు. ఈ పది డిజైన్లలో దేనికి మెజారిటీ ఓటింగ్ వస్తుందో ఆ డిజైన్‌నే సీఆర్‌డీఏ అధికారులు ఎంపిక చేస్తారు. మరింకెందుకింత ఆలస్యం..? వెంటనే సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌కు వెళ్లి నచ్చిన డిజైన్‌ను ఎంపిక చేసుకోండి.

అధికారపక్షమే విపక్షంగా..!

● డీఆర్‌సీలో సమస్యల ఏకరువు! ● రోడ్లు, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, పారిశ్రామికం, పర్యాటక రంగాలపై చర్చ



ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వసంత కృష్ణ ప్రసాద్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రోడ్లు, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, పర్యాటకం, పారిశ్రామికం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయటానికి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులే విపక్షంగా వ్యవహరిస్తూ జిల్లా అధికారులకు కీలక సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా శనివారం రైతుశిక్షణ కేంద్రంలో జరిగిన డీఆర్‌సీ సమావేశంలో అధికార పార్టీ సభ్యులు విపక్షపాత్రను పోషించారు. సంక్షేమాభివృద్ధి రంగాల్లో నెలకొన్న అనేక సమస్యలను అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఏకరువు పెట్టారు. ప్రాథమిక, మౌలిక రంగాలను బలోపేతం చేయటానికి జిల్లా అధికారులకు కీలక సూచనలు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సత్యకుమార్ యాదవ్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఆయన అధ్యక్షతన తొలి డీఆర్‌సీ సమావేశం జరిగింది. నూతన కలెక్టర్ లక్ష్మీశా సంధానకర్తగా వ్యవహరించారు. శాఖల వారీగా పురోగతిని వివరించేలా చెప్పించటం, ప్రజా ప్రతినిధులకు సందేహాలుంటే వారిచేత అడిగించటం చేయించారు. ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన అన్ని అంశాలను వారి చేత చెప్పించేందుకు శాఖల వారీగా వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునేలా ఎంతో పరిణితితో కలెక్టర్ సంధానకర్తగా వ్యవహరించటం ఆకట్టుకుంది. ముందుగా వ్యవసాయ రంగంపై స్థూలంగా చర్చ జరిగింది. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ 2024- 25 రబీకు సంబంధించి రైతులకు రాయితీపై విత్తనాలు అందించేందుకు సంసిద్ధంగా ఉన్నామని, భూసార పరీక్షలకు 11,200 శాంపిల్స్ తీయటం జరిగిందన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి చర్చ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో పథకం అపహాస్యంగా మారిపోయిందని ప్రజా ప్రతినిధులు ఏకరువు పెట్టారు. జిల్లాలో 48 శాతం మాత్రమే పనులు జరిగాయని, కొత్తగా వాటర్ సోర్స్‌తో కలిపి డీపీఆర్ తయారు చేయించాలని సూచించారు. గృహనిర్మాణ రంగానికి సంబంధించి జక్కంపూడిలోని టిడ్కో గృహాలను పూర్తితో పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి హడ్కో నుంచి రుణ ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

ప్రజా ప్రతినిధులు సంధించిన ప్రశ్నలు

ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ పేరును తిరిగి ఎన్టీఆర్ వర్శిటీగా పేరు మార్చిన క్రమంలో ఆవరణలో ఇంకా వైఎస్‌ఆర్ విగ్రహం ఉందని దాన్ని తొలగించాలని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రస్తావించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద పులిచింతల నుంచి నీటిని సంగ్రహించే ముందు సరిహద్దు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ టెన్త్ పరీక్షలను ఆప్షన్ ఇస్తే తెలుగులో కూడా రాసే అవకాశం ఉన్నా సరైన ప్రచారం జరగటం లేదన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కొండపల్లి ఖిల్లాకు వెళ్లే దారి అధ్వాన్నంగా ఉందని ప్రస్తావించారు. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ నెమలి వేణు గోపాలస్వామి ఆలయాభివృద్ధి చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఇన్‌చార్జి మంత్రి

జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి తర్వాత మీడియాతోనూ మాట్లాడారు. గత ఐదేళ్లలో ఒకే ఒక్క డీఆర్‌సీ సమావేశం జరిగిందని, ఇక మీదట తరచూ డీఆర్‌సీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి మూడు నెలలకు క్రమం తప్పకుండా డీఆర్‌సీలు నిర్వహిస్తామన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, గ్రామీణ నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టడం, తాగునీరు అంశాలపై దృష్టి నిలుపుతాయన్నారు.

ఏమిటీ సమన్వయ లోపం..?

కృష్ణా జిల్లాలో డీఆర్‌సీ సమావేశం జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలో పక్షం కిందటే డీఆర్‌సీ తేదీ ఇచ్చారు. ఉమ్మడి కృష్ణా ప్రాంతాలతో కలిపి నిర్వహించాల్సిన జడ్పీ సమావేశాలను ఏకపక్షంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లాలో డీఆర్‌సీ ఉన్న రోజునే జడ్పీ సమావేశం నిర్వహించటంతో జిల్లాకు చెందిన వారెవ్వరూ వెళ్లలేకపోయారు. అలాగే ఏలూరు జిల్లా నుంచి ఎవరూ వెళ్లలేదని తెలుస్తోంది. జడ్పీ అన్నది ఉమ్మడి జిల్లా వ్యవహారమైనా ఏకపక్ష నిర్వహణపై విమర్శలు వచ్చాయి.

3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు డిసెంబరు 3న మొగల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, కావున జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా నడుపబడుతున్న ప్రత్యేక పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ పిల్లలు, జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల కోసం పనిచేస్తున్న సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి క్రికెట్ సెలక్షన్స్ మంగళగిరికి మార్పు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో డిసెంబరు 1న ఉదయం 8 గంటలకు జరగాల్సిన కేడీసీఏ అండర్-12 బాలుర సెలక్షన్స్ వేదికను వర్షం కారణంగా మంగళగిరి ఇండోర్ స్టేడియానికి మార్చినట్టు కేడీసీఏ సెక్రటరీ ఎం రవీంద్ర చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని అర్హతపత్రాలు, కిట్, డ్రెస్‌తో ఉదయం 8 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

నిబంధనల ప్రకారం పోటీల నిర్వహణ

భవానీపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఇటీవల రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలను పారదర్శకంగా నిర్వహించి, పలువురు క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు బీహార్‌కు పంపామని, ఇందులో అవాస్తవాలు వల్లించి క్రీడాకారులకు ద్రోహం చేయాలని చూస్తే సహించేది లేదని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీ నాగేశ్వరరావు వెల్లడించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్ఏఐ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిన క్రీడాకారులతో పోటీలు నిర్వహించామని, అండర్-20లో రాష్ట్రవ్యాప్తంగా 130 మంది నమోదు కాగా 50 మంది హాజరు కాగా, వారిలో మెడల్స్ సాధించిన వారిని ఎంపిక చేసినట్టు వివరించారు. రాష్ట్ర అసోసియేషన్‌లో నిధుల కొరత కారణంగా పోటీల నిర్వహణ ఆలస్యమైనా జట్టును జాతీయ పోటీలకు పంపి పారదర్శకతను నిరూపించామన్నారు. అశోక్ బాబు, సుబ్బారావు, క్రిస్టోఫర్, నాగం సతీష్ పాల్గొన్నారు.

భవానీదీక్షల విరమణకు ఏర్పాట్లు



భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో రామారావు, పశ్చిమ ఏసీపీ, సీఐ

వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో డిసెంబరు 21 నుంచి 25 వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లను శనివారం ఈవో కేఎస్ రామారావు, పశ్చిమ ఏసీపీ, వన్‌టౌన్ సీఐ, దుర్గగుడి ఈఈ పి.వైకుంఠరావు పరిశీలించారు. క్యూలు, హోమగుండాల ఏర్పాట్లు, అన్నవితరణ, ప్రసాదం కౌంటర్లు, తదితరాలను ఏఏ ప్రాంతాల్లో ఉన్నాయన్నదానిపై సమీక్షించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు. భక్తులు పెద్ద ఎత్తున దీక్షల విరమణలకు రానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు జరగాలని అధికారులు సూచించారు. డిప్యూటీ ఈఈలు, ఏఈఈలు, ముఖ్యఅర్చకుడు ఆర్. శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు.

సహస్రలింగార్చన సేవ

దుర్గగుడిలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా శనివారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన సేవ నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్రలింగార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. సహస్రలింగార్చన సేవలో ఈవో రేఎస్ రామారావు దంపతులు పాల్గొన్నారు. సహస్రలింగార్చన సేవలో స్వామిని పుష్పాలు, బిల్వాలతో నయనమనోహరంగా అలంకరించారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

● అధికారుల బెదిరింపులే కారణమంటూ సూసైడ్ నోట్

అవనిగడ్డ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న మహేష్ అధికారులు వేధిస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం ఆర్టీసీ డిపోలో కలకలం రేపింది. ఇటీవల కరకట్టపై రోడ్డు ప్రమాదానికి గురైన బస్సును మహేష్ బాబే డ్రైవ్ చేయగా, శనివారం అతడిని శిక్షణ నిమిత్తం మచిలీపట్నం డీపీటీవో వద్దకు పంపించారు. శిక్షణ సమయంలో డీపీటీవో వాణిశ్రీ మహేష్‌ను కించపరిచేలా దుర్భాషలాడటంతో అక్కడి నుంచి బయలుదేరి వస్తూ 3 పేజీల సూసైడ్ నోట్ రాసుకువచ్చి అవనిగడ్డ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు ఇచ్చి అక్కడే కుప్పకూలిపోయాడు. మార్గమధ్యలోనే మహేష్‌బాబు పురుగు మందు సేవించాడని గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే అతడిని అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం పంపించారు.



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

డిపో గేటు వద్ద ధర్నా చేసిన ఆర్టీసీ సిబ్బంది

మహేష్‌బాబు ఆత్మహత్యాయత్నంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్టీసీ సిబ్బంది డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించి కార్మికులపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, కుమార్, నారాయణ, సంజీవరావు పాల్గొన్నారు.

కొవిడ్ తర్వాత పెరిగిన ఫంగల్ ఇన్ఫెక్షన్లు

- ఉత్పరివర్తనాలతో మొండి వ్యాధులుగా మార్పు
- స్వల్ప కాలం నుంచి దీర్ఘకాలంగా మారిన చికిత్సలు
- ఐఏడీవీఎల్ జాతీయ అధ్యక్షుడు మజుందార్ ఆందోళన

గుంటూరు మెడికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ మహమ్మారి తర్వాత పలు రకాల కొత్త ఫంగల్ వ్యాధులు వెలుగు చూస్తున్నట్లు చర్మవ్యాధుల వైద్య నిపుణుల సంఘం (ఐఏడీవీఎల్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మజుందార్ షినోయ్ వెల్లడించారు. శనివారం గుంటూరులో ఐఏడీవీఎల్ ఆంధ్రప్రదేశ్ శాఖ 43వ వార్షిక సమావేశం 'ఏపీ క్యుటికాన్ 2024' ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది వైద్య నిపుణులు హాజరైన ఈ సదస్సులో మజుందార్ మాట్లాడుతూ కొవిడ్ మహమ్మారి తర్వాత పలు రకాల ఫంగస్‌లు మ్యుటేషన్లకు (ఉత్పరివర్తనాలు) లోనై తీవ్రమైన కొత్త వ్యాధులను కలిగిస్తున్నాయన్నారు. గతంలో చూడని పలు రకాల ఫంగల్ ఇన్ఫెక్షన్లు ప్రస్తుతం ప్రబలాయని చెప్పారు. వీటి తీవ్రత ఊహించని రీతిలో ఉందని, మందులకు లొంగడడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పమేరియన్ వంటి పెంపుడు కుక్కల ద్వారా కూడా పలు రకాల ఫంగల్ వ్యాధులు ప్రబలుతున్నట్లు చెప్పారు. గతంలో 2-3 వారాల చికిత్సతో తగ్గిపోయే ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ప్రస్తుతం 2-3 నెలలు మందులు వాడినా తగ్గడం లేదన్నారు.

చర్మవ్యాధుల చికిత్సల్లో కృత్రిమ మేధ

ఆధునిక కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం చర్మవ్యాధుల వైద్య రంగంలోనూ ప్రవేశించి అద్భుతాలు చేస్తున్నట్లు ఢిల్లీ ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ సోమేష్ గుప్తా తెలిపారు. సమీప భవిష్యత్తులో ఏఐ పరిజ్ఞానంతో వైద్యుడు రోగితో మాట్లాడుతున్నప్పుడే ఎలక్ట్రానిక్ హెల్త్ డాక్యుమెంటేషన్ సిద్ధమవుతుందని వివరించారు. బేసల్ సెల్ కార్సినోమా(చర్మకేన్సర్)ను కృత్రిమ మేధ 75 శాతం కచ్చితంగా గుర్తించిందని, అదే డెర్మటాలజిస్టులు 45 శాతం, ప్రైమరీ వైద్యులు 22 శాతం మాత్రమే కచ్చితంగా గుర్తించారని తెలిపారు. స్కిన్ జీపీటీ, చాట్ జీపీటీ వంటివి విరివిగా వినియోగించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. రోగుల వివరాలను సామాజిక మాధ్యమాల్లో పెడితే వైద్యులకు జరిమానా తప్పదని హెచ్చరించారు. ఐఏడీవీఎల్ జాతీయ కార్యదర్శి డాక్టర్ కటకం భూమేష్ కుమార్ మాట్లాడుతూ చర్మవ్యాధుల వైద్య నిపుణులు వృత్తి ధర్మాన్ని పాటిస్తూనే పలు సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత అధ్యక్షత వహించారు.

హెచ్ఐవీ చికిత్సలో గేమ్ చేంజర్!

- త్వరలో అందుబాటులోకి 'లెంకపావీర్' ఇంజెక్షన్
- ఏడాదికి రెండుసార్లు వేసుకుంటే వైరస్ నియంత్రణ
- ఇన్ఫెక్షన్ వ్యాధుల స్పెషలిస్ట్ కల్యాణ్ చక్రవర్తి వెల్లడి


లెంకపావీర్

గుంటూరు మెడికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ఎయిడ్స్ చికిత్సల్లో లెంకపావీర్ ఇంజెక్షన్‌ను సరికొత్త గేమ్ చేంజర్‌గా భావిస్తున్నారు. ఇప్పటి వరకు హెచ్ఐవీ పాజిటివ్ తేలిన వారు యాంటీ రెట్రోవైరల్ థెరపీ చికిత్స పొందుతున్నారు. ఇవి మాత్రల రూపంలో నోటి ద్వారా తీసుకొనే ఔషధాలు. ప్రతి రోజూ ఒక మాత్రను రోగులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇకపై మాత్రతో పనిలేకుండా ఏడాదిలో కేవలం రెండు లెంకపావీర్ ఇంజెక్షన్లను తీసుకొంటే సరిపోతుంది. ఆరు నెలలకు ఒక ఇంజెక్షన్ చొప్పున ఏడాదిలో రెండుసార్లు మాత్రమే వీటిని తీసుకొంటే చాలని వైద్యులు చెబుతున్నారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్ఫెక్షన్ వ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ కె.కల్యాణ్ చక్రవర్తి శనివారం గుంటూరులో మీడియాకు ఈ విషయాలు వెల్లడించారు. 2030 నాటికి హెచ్ఐవీని అంతమొందించాలనే లక్ష్యానికి లెంకపావీర్‌ను ముఖ్యమైనదిగా భావించొచ్చన్నారు. లెంకపావీర్ ఇంజెక్షన్లు ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో అందుబాటులోకి వచ్చాయని, త్వరలో డాక్టర్ రెడ్డీస్, హెటిరో, ఎంక్యూర్ కంపెనీల ద్వారా మన దేశంలోకి వస్తున్నట్టు చెప్పారు. ఇదే స్ఫూర్తితో హెచ్ఐవీ నివారణకు వ్యాక్సిన్లను అందుబాటులోకి తేవడానికి కృషి జరుగుతోందన్నారు. జీన్ ఎడిటింగ్ ద్వారా వైరస్ జన్యువును నియంత్రించే మరో పరిశోధన జరుగుతుందని, దీనిని క్రిస్పర్ టెక్నాలజీ అంటారని తెలిపారు.

టీసీఎస్ వచ్చేస్తోంది

విశాఖలో దిగ్గజ ఐటీ కంపెనీకి లైన్‌క్లియర్.. లీజుకు 'డల్లాస్ టెక్నాలజీస్' బిల్డింగ్

- రుషికొండ ఐటీ పార్కు హిల్-2పై కార్యాలయం
- లీజు ఒప్పందానికి ప్రభుత్వం పచ్చజెండా
- మరింత అదనపు స్థలం కేటాయింపునకూ ఓకే
- అన్ని శాఖలూ సహకరించాలని ఆదేశం
- తొలి దశలో 2 వేల మందికి ఉద్యోగాలు


నిర్మాణంలో ఉన్న డల్లాస్ టెక్నాలజీస్ భవనం నమూనా

విశాఖపట్నం, అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిగ్గజ సాఫ్ట్‌వేర్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) విశాఖపట్నంలో కార్యకలాపాల ప్రారంభానికి మార్గం సుగమమైంది. రుషికొండ ఐటీ పార్కు హిల్-2పై నాన్ సెజ్ ఏరియాలోని 'డల్లాస్ టెక్నాలజీస్' భవనాన్ని లీజుకు తీసుకొని అందులో కార్యాలయం నడపడానికి టీసీఎస్ ముందుకువచ్చింది. లీజు ఒప్పందానికి ఆమోదం తెలుపుతూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో టీసీఎస్ తొలి దశలో రెండు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. ఆ తరువాత మరింత విస్తరిస్తుంది. విశాఖపట్నం ఐటీ కేంద్రంగా అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ యాంకర్(పెద్ద) కంపెనీలు లేకపోవడం లోటుగా ఉండేది. దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి, టాప్ -10 కంపెనీలు వచ్చేలా చేస్తామని ఐటీ మంత్రి నారా లోకేశ్ గతంలో ప్రకటించారు. ఆ మేరకు టీసీఎస్ ప్రతినిధులను విశాఖకు ఆహ్వానించారు. నగరంలోని ఐటీ పార్కుల్లో భవనాలు, భూములు చూసుకోవాలని, ఏమి కావాలంటే అవి సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అయితే తమకు తొలుత భవనమే కావాలని, అది కూడా సెజ్ పరిధిలో ఉండకూడదని టీసీఎస్ ప్రతినిధులు స్పష్టంచేశారు. రుషికొండలో హిల్-2పై డీనోటిఫై చేసిన ప్రాంతంలోని డల్లాస్ టెక్నాలజీ ఎల్ఎల్‌పీ నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎంపిక చేసుకున్నారు. ఇది ఇన్ఫోసిస్ పక్కనే ఉండడం గమనార్హం.

టీసీఎస్‌ను ఆకర్షించిన 'డల్లాస్'

డల్లాస్ టెక్నాలజీస్ కంపెనీకి ఏపీఐఐసీ 2016లో హిల్-2పై 7,774.90 చ.మీ. భూమిని కేటాయించింది. అందులో రెండేళ్ల క్రితం ఆ కంపెనీ భవన నిర్మాణం ప్రారంభించింది. గ్రౌండ్+3 అంతస్థుల భవనం నిర్మించింది. త్వరలో కార్యకలాపాలు ప్రారంభించాలని యోచిస్తోంది. అందులో 1,400 మంది వరకు పనిచేసుకోవచ్చు. ఈ నెల మొదటి వారంలో విశాఖకు వచ్చిన టీసీఎస్ బృందాన్ని 'డల్లాస్' భవనం ఆకర్షించింది. వారితో చర్చలు జరిపారు. లీజుకు ఇవ్వాలని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే లీజుకు ఇవ్వడానికి డల్లాస్ యాజమాన్యం అంగీకరించింది. అయితే డల్లాస్ భవనంలో సీటింగ్ సామర్థ్యం రెండు వేల మందికి సరిపడా విస్తరించాలని టీసీఎస్ కోరింది. పక్కనే ఖాళీగా ఉన్న భూమిని ప్రభుత్వం కేటాయిస్తే అక్కడ కూడా నిర్మాణం చేపట్టి పూర్తిస్థాయిలో ఇస్తామని డల్లాస్ తెలిపింది. ఇదే విషయాన్ని డల్లాస్ ప్రతినిధులు ప్రభుత్వానికి కూడా తెలియజేశారు. పక్కనే 1,909 చ.మీ. స్థలం ఉందని, అందులో 1,600 చ.మీ. కావాలని, గతంలో చ.మీ. రూ.6,720 చొప్పున కేటాయించారని, అదే ధరకు ఇవ్వాలని కోరారు. భవనం వెనుక సెట్‌బ్యాక్స్ విషయంలో కొంత మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు.

ఎస్ఐపీబీలో కీలక నిర్ణయం

డల్లాస్ ప్రతిపాదనలపై ఈనెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా టీసీఎస్‌కు భవనాన్ని లీజుకు ఇవ్వడానికి డల్లాస్‌కు అనుమతి మంజూరుచేశారు. నిబంధనల ప్రకారం ఉపాధి కల్పించాలని, పదేళ్లపాటు అది కొనసాగాలని టీసీఎస్‌కు స్పష్టంచేశారు. సెట్‌బ్యాక్స్ ప్రయోజనాల కోసం కోరిన స్థలాన్ని మంజూరు చేయాలని దానికి చ.మీ.కు రూ.10 వేలు చొప్పున వసూలు చేయాలని ఏపీఐఐసీకి సూచించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తక్షణమే భవనాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం కార్యకలాపాలు ప్రారంభించుకోవడానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీచేయాలని ఆదేశించారు. విశాఖపట్నానికి వస్తున్న తొలి మెగా ఐటీ కంపెనీ కాబట్టి, అది త్వరగా ప్రారంభం కావడానికి అవసరమైన అన్నిరకాల పనులు పూర్తిచేసుకోవడానికి ప్రభుత్వ శాఖలన్నీ సహకరించాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆయా శాఖలకు ఉత్తర్వులు జారీ చేశారు. సింగిల్ డెస్క్ పోర్టల్ 2.0 ద్వారా అనుమతులు ఇవ్వాలని సూచించారు.

పులివెందుల వైసీపీ నేతల చెరవీడిన తెలంగాణ కార్లు

- మంత్రి లోకేశ్ చొరవ..

సంగారెడ్డి వాసి సతీష్‌కు ఊరట

సంగారెడ్డి క్రైం, నవంబరు 30: గత మూడేళ్లుగా పులివెందుల వైసీపీ నాయకుల చెరలో ఉన్న తెలంగాణ వ్యక్తికి చెందిన ఆరు కార్లకు మంత్రి నారా లోకేశ్ చొరవతో మోక్షం లభించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సతీష్‌కుమార్ హరిహర కార్ రెంటల్ పేరిట సంస్థను నడుపుతున్నారు. వికారాబాద్ వాసి మణిరాజ్ 2021 ఏప్రిల్‌లో ఆరు కార్లను అద్దెకు తీసుకున్నాడు. 4 నెలలు అద్దె చెల్లించలేదు. ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో 2023 జనవరిలో సతీష్ సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మణిరాజ్‌ను సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను తీసుకున్న కార్లలో కొన్ని పులివెందుల వైద్య కళాశాలలో లీజుకు నడుస్తున్నాయని, మరికొన్ని వైసీపీ నేతల వద్ద ఉన్నాయని తెలిపాడు. ఈ విషయమై వైసీపీ నేతలతో మాట్లాడుదామని వేంపల్లె పోలీసులు సతీష్‌ను తీసుకెళ్లగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అనుచరులు వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, వైసీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డి తీవ్రంగా కొట్టారు. ఇడుపులపాయలోని గదిలో 5 రోజులు సతీష్‌ను బంధించి చిత్రహింసలు పెట్టారు. చంపేందుకు కుట్ర పన్నారు. ఏపీలో ప్రభుత్వం మారడంతో ఇటీవల సతీష్ మంత్రులు, నేతలను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. మంత్రి నారా లోకేశ్ దృష్టికీ తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ఏపీ పోలీసులు.. అవినాష్‌రెడ్డి అనుచరుల వద్ద ఉన్న కార్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి సంగారెడ్డి పట్టణ పోలీసులు వాటిని తీసుకువచ్చారు. కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి వైసీపీ నేతల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, తన ప్రాణానికి ముప్పు ఉందని సతీష్ పేర్కొన్నారు.

తొలగించిన 1200 మంది ఎంపీహెచ్ఏలను

తిరిగి తీసుకోవడం చెల్లదు

- ఉభయ రాష్ట్రాలకు తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ
- 2013 నాటి జీవో 1207 కొట్టివేత

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలతో తొలగించిన దాదాపు 1200 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఎంపీహెచ్ఏ) సిబ్బందిని తిరిగి తీసుకోవడం చెల్లదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. వారిని తిరిగి తీసుకుంటూ 2013లో జారీచేసిన జీవో నెంబరు 1207ను కొట్టివేసింది. ఎంపీహెచ్ఏ పోస్టుల భర్తీ కోసం 2002లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. కనీస విద్యార్హతలపై వివాదం రావడంతో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. తొలుత ఇంటర్మీడియెట్ కనీస అర్హతతో మెరిట్ లిస్టును రూపొందించారు. పదో తరగతి, హెల్త్ అసిస్టెంట్ డిప్లొమోలను కూడా కనీస అర్హతగా పరిగణించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో మెరిట్ జాబితా మారిపోయింది. హైకోర్టు తీర్పుతో 1200 మంది ఎంపీహెచ్ఏలను తొలగించారు. ఆ తర్వాత మంత్రుల బృందం ఈ అంశాన్ని పరిశీలించి, ఆ 1200 మందిని కాంట్రాక్టు పద్ధతిలో తిరిగి తీసుకోవాలని నిర్ణయించి జీవో 1207ను ప్రభుత్వం జారీ చేసింది. దీనిపై పలు పిటిషన్‌లు దాఖలవగా సమగ్రంగా విచారణ చేపట్టిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం తాజాగా తుదితీర్పు జారీచేసింది. రెండు రాష్ట్రాలూ 2002లో హైకోర్టు తీర్పు ప్రకారం మెరిట్ జాబితాలో ఉన్నవాళ్లనే కొనసాగించాలని పేర్కొంది. ఆ తర్వాత ఏమైనా ఖాళీలు ఏర్పడితే చట్టప్రకారం రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా భర్తీ చేపట్టవచ్చని తెలిపింది.

న్యాయాధికారుల పదవీ విరమణ వయసు పెంపు

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 60 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) సునీత ఉత్తర్వులు జారీ చేశారు.

జగన్‌తో టచ్‌లో ఉన్నారు!

- పులివెందుల కంపెనీకి బిల్లులు కూడా చెల్లించారు
- ఐఏఎస్‌పై చింతకాయల విజయ్ ఆరోపణ
- ఎన్నికల తర్వాత రూపాయి ఇవ్వలేదు: కృష్ణబాబు

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుపై టీడీపీ సోషల్ మీడియా విభాగం నేత చింతకాయల విజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన ఇప్పటికీ వైసీపీ కోసం పని చేస్తున్నారని, మాజీ సీఎం జగన్‌తో టచ్‌లో ఉన్నారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఆరోపించారు. గత ప్రభుత్వంలో కీలకమైన స్థానాల్లో పని చేశారని, ఈ మధ్యకాలంలో పులివెందులకు చెందిన కంపెనీకి బిల్లులు కూడా చెల్లించారని తెలిపారు. దీనిపై కృష్ణబాబు స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందుల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని స్పష్టం చేశారు. ఫేజ్-2 మెడికల్ కాలేజీలకు మాత్రమే రూ.125 కోట్ల వరకూ విడుదల చేశామన్నారు. అందులో పులివెందుల కాలేజీకి రూ.25కోట్ల బిల్లులు క్లియర్ అయ్యాయన్నారు. అదీ ఎన్నికల సమయంలో ఇచ్చామని, ఆ తర్వాత ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

ఆర్‌సి16లో దివ్యేందు




బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ(ఆర్‌సి16-వర్కింగ్ టైటిల్)లో బాలీవుడ్ నటుడు దివ్యేందు కీలక పాత్ర పోషిస్తున్నారు. 'మీర్జాపూర్' వెబ్‌సిరీస్‌లో మున్నా భాయ్ పాత్రలో తన దైన నటనతో మెప్పించిన దివ్యేందు ఈ సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సందర్భంగా దివ్యేందు పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బుచ్చిబాబు విడుదల చేశారు. మెలితిప్పిన మీసం, రగ్డ్ లుక్‌తో దివ్యేందు పోస్టర్‌లో కనిపిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ రోజు నుంచి అంచనాలు పెంచుతూ వస్తోన్న ఈ సినిమాను భారీ స్థాయిలో హై టెక్నికల్ వాల్యూస్‌తో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా రూపొందిస్తున్నారు. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కూడా ఈ సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలోకి ప్రవేశిస్తున్నారు. ఆయన చాలా పవర్ ఫుల్ పాత్రలో మెప్పించబోతున్నారు. కథానాయికగా జాన్వీ కపూర్, కీలక పాత్రలో జగపతిబాబు నటిస్తున్నారు. ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే మైసూర్‌లో ప్రారంభమైంది. మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ బేనర్ సమర్పణలో వృద్ధి సినిమాస్ సంస్థపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

ఆ నమ్మకాన్ని 'క' ఇచ్చింది

- కిరణ్ అబ్బవరం



థ్రిల్లర్ జానర్‌లో రూపుదిద్దుకుని ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని ఇచ్చిన చిత్రం 'క'. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ చిత్రం దీపావళికి విడుదలై ప్రపంచ వ్యాప్తంగా రూ 50 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్లు సాధించింది. ఇప్పుడు ఓటీటీలో కూడా విజయవిహారం చేస్తోంది. అతి తక్కువ సమయంలో 100 మిలియన్ల మినిట్స్ వ్యూయర్ షిప్ దక్కించుకుంది. సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఓటీటీలో కూడా విజయం సాధించిన సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ' డాల్బీ విజన్ 4 కే, అట్మాస్ టెక్నాలజీ వంటి సాంకేతిక విలువలతో ఓటీటీలోకి వచ్చిన తొలి తెలుగు సినిమా మాదే కావడం ఆనందంగా ఉంది. మా సినిమా సక్సెస్‌కు నిర్మాత గోపీ, దర్శకుడు సందీప్ , సుజిత్, డిస్ట్రిబ్యూటర్ వంశీ .. కారణం. మంచి సినిమా తీస్తే ప్రేక్షకుల ప్రేమను గెలుచుకోవచ్చు అనే ధైర్యాన్ని, నమ్మకాన్ని 'క చిత్రం కలిగించింది' అన్నారు.



ఆఖరి అధ్యాయం మొదలు

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ పోరాట యోధుడిగా నటిస్తున్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'హరి హర వీరమల్లు'. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను ఏ.ఎమ్ రత్నం సమర్పణలో ఏ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. విజయవాడలో ఈ సినిమా చివరి షెడ్యూల్ జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా, ఈ సినిమా సెట్స్‌లోకి పవన్ కల్యాణ్ అడుగుపెట్టినట్లు నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. 'ధర్మం కోసం పోరాటంలో ఆఖరి అధ్యాయం మొదలు' అని పేర్కొంది. ఈ షెడ్యూల్‌లో పవన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ చిత్రంలో అర్జున్ రాంపాల్, బాబీ డియోల్, నిధి అగర్వాల్, నర్గిస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 28న ఈ సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

యాక్షన్ బేస్డ్ మూవీ 'విడాముయర్చి'



మగిళ్ తిరుమేని దర్శకత్వంలో హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న చిత్రం'విడాముయర్చి'. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌లో సుభాస్కరన్ నిర్మించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతోంది. భారీ అంచనాలతో రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను పూర్తి చేసుకుంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటి వరకూ కనిపించని ఓ వైవిధ్యమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. 'ప్రపంచమంతా నిన్ను నమ్మకపోయినా పరవాలేదు...నిన్ను నువ్వు నమ్ముకో' అనే కాన్సెప్ట్‌తో యాక్షన్ బేస్డ్ మూవీగా తెరకెక్కింది. టీజర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు నెక్స్ట్ లెవల్‌కు చేరుకున్నాయి.

షెర్లాక్ హోమ్స్ సందడి



హాస్య నటుడు వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు. అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం టీజర్‌ను గురువారం విడుదల చేశారు. వంశీ నందిపాటి 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'మంచి కంటెంట్‌తో వస్తున్న చిత్రాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు నా కృతజ్ఞతలు. డిసెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. సినిమాలో మంచి పాత్ర పోషించినట్లు అనన్య నాగళ్ల చెప్పారు. దర్శకుడు మోహన్ మాట్లాడుతూ 'వంశీగారు మా సినిమాను తీసుకోవడంతో మాకు చాలా ధైర్యం వచ్చింది. ఫస్ట్ కాపీ చూసి ఆయన చెప్పిన మార్పులు పాలో అయ్యాం' అన్నారు.

తెలుగు హీరోయిన్‌ను పరిచయం చేస్తున్న వైవీఎస్



ఉత్తరాదికి చెందిన ఐదుగురు హీరోయిన్లను ఇంతవరకూ పరిచయం చేసిన దర్శకుడు, నిర్మాత వైవీఎస్ చౌదరి తన తాజా చిత్రం కోసం తెలుగు అమ్మాయి, కూచిపూడి డ్యాన్సర్ వీణారావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నారు. మహానటుడు ఎన్టీఆర్ మునిమనవడు, హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావు ఈ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వీణారావు లుక్‌ని మహిళా నిర్మాతలు సుప్రియ, స్వప్నాదత్ విడుదల చేశారు. సంప్రదాయ, ఆధునిక దుస్తుల్లో వీణారావు ఎంతో అందంగా ఉన్నారు. పాత్రలకు అనుగుణంగా నటించి ప్రేక్షకుల్ని రంజింప చేస్తానని తన అభిమాన నటి డాక్టర్ భానుమతి సాక్షిగా ప్రమాణం చేశారు. కొత్త హీరోయిన్‌కి అభినందనలు తెలిపి, ఆమె సక్సెస్ కావాలని సుప్రియ, స్వప్న కోరారు. ఈ సందర్భంగా వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ 'మా హీరో నందమూరి తారక రామారావు ఫస్ట్ దర్శన్‌కు ప్రపంచ వ్యాప్తంగా మంచి స్పందన వచ్చింది. హీరోయిన్ వీణ తెలుగు అమ్మాయి. మంచి డ్యాన్సర్. తనకి కూడా మంచి భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఫస్ట్ దర్శన్‌ను లాంచ్ చేసిన సుప్రియ, స్వప్నలకు నిర్మాత యలమంచిలి గీత ధన్యవాదాలు తెలిపారు.

సాహస గాథ



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్, 'కై పో చే' ఫేమ్ అభిషేక్ కపూర్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'ఆజాద్'. ఈ సినిమాతో అజయ్ దేవగణ్ మేనల్లుడు అమన్ దేవగణ్ హీరోగా, రవీనా టాండన్ కూతురు రషా తడానీ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. రోనీ స్క్రూవాలా, ప్రగ్యా కపూర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అజయ్ దేవగణ్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. ఈ సాహస గాథను వచ్చే ఏడాది జనవరి 17న తిలకించడానికి సిద్ధమవ్వండి అని తెలిపారు.

టాక్సీ డ్రైవర్ కథ



మోహన్‌లాల్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తుడరమ్'. ఆయనకు జోడీగా శోభన నటిస్తున్నారు. తరుణ్ మూర్తి దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ టాక్సీ డ్రైవర్‌గా నటిస్తున్నారు. శోభన గృహిణి పాత్రలో కనిపించనున్నారు. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన పోస్టర్‌లో మోహన్‌లాల్‌కు శోభన టీ గ్లాస్ అందిస్తూ కనిపించారు. అయితే గతంలో వీరిద్దరూ జంటగా నటించిన 'నడోడికట్టు' చిత్రంలోనూ ఇలాంటి సన్నివేశమే ఉంది. 1987లో విడుదలైన ఆ చిత్రంలో 'వైశాఖసంధ్యే' అంటూ సాగే గీతంలో మోహన్‌లాల్, శోభన టీ తాగుతూ కనిపించారు. ఆ సినిమా విడుదలై 37 ఏళ్లు అవుతోంది. దాంతో ఈ రెండు పోస్టర్స్‌ని పక్కపక్కన ఉంచి అభిమానులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

అప్‌డేట్స్

తెలుగులో 'పా..పా'



తమిళ బ్లాక్‌బస్టర్ 'డా..డా' మూవీని తెలుగులో 'పా..పా' టైటిల్‌తో జె.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రం డిసెంబరు 13న తెలుగు రాష్ట్రాలతోపాటు అమెరికా, ఆస్ట్రేలియాలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'తండ్రి కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి. తమిళంలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'డా..డా' చిత్రం 'పా..పా' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎంజిఎం సంస్థ నుంచి అచ్చిబాబు విడుదల చేస్తున్నారు' అని నిర్మాత నీరజ కోట తెలిపారు. సినిమాలో భాగ్యరాజా, వీటీవి గణేశ్, ఐశ్వర్య, ప్రదీప్ శక్తి తదితరులు నటించారు.

గంధర్వకోట రహస్యం



కథానాయిక హన్సిక ప్రధాన పాత్రలో నటిస్తున్న హారర్ చిత్రం 'శ్రీ గాంధారి'. ఆర్. కన్నన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో రాజునాయక్ విడుదల చేస్తున్నారు. శతాబ్దాల నాటి గంధర్వకోటకు సంబంధించిన రహస్యాల నేపథ్యంలో కథ సాగుతుంది, విస్టరీ, హారర్, సస్పెన్స్ అంశాలతో ఆసక్తికరంగా రూపొందిన చిత్రమిదని దర్శకుడు చెప్పారు.

విలేజ్ డ్రామా



సదన్, ప్రియాంక ప్రసాద్, హీరో హీరోయిన్లుగా పిఎల్ విఘ్నేశ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. విలేజ్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రాన్ని పిఎల్‌వి క్రియేషన్స్‌పై పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 13న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటిస్తూ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. సాయికుమార్ నటన ప్రత్యేకాకర్షణగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది.

మహిళలు సమాజ నిర్మాతలు



'మహిళలు సమాజ నిర్మాతలు అనే నిజాన్ని మనమంతా గుర్తుంచుకోవాలి' అని తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. 'నారి' చిత్రం టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌ని మంత్రి సీతక్క రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "నారి' సినిమా పెద్ద విజయాన్ని సాధించాలి. మహిళా సమస్యలపై మరిన్ని సినిమాలు చేయాలి' అని అన్నారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 25న విడుదల చేస్తున్నామని దర్శకనిర్మాతలు సూర్య వంటిపల్లి, శశి చెప్పారు.

చీరాలలో 'వీకెండ్'



విఐపి శ్రీ, ప్రియా దేషపాగ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'వీకెండ్'. ఖడ్గధార మూవీస్ బేనర్‌పై ఐ.డీ.భారతి నిర్మిస్తున్నారు. బి.రాము దర్శకత్వంలో పక్కా కమర్షియల్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీ షూటింగ్ చీరాలలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ప్రారంభమైంది. ఎన్ఆర్ఐ జయ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, సీనియర్ ఆర్టిస్ట్ అజయ్ ఘోష్ క్లాప్ కొట్టారు. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ చీరాలలో జరుగుతుందని దర్శకనిర్మాతలు తెలిపారు.

సెమీస్‌కు హాకీ కుర్రాళ్లు

తైపీపై 16-0తో భారీ విజయం

మస్కట్: జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత కుర్రాళ్లు అదరగొడుతున్నారు. ఈ మెగా టోర్నీలో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ సాధించారు. దీంతో.. తమ గ్రూప్‌లో 9 పాయింట్లతో టాపర్‌గా నిలిచిన భారత జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. పూల్-ఎలో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 16-0తో చైనీస్ తైపీపై భారీ గెలుపును అందుకుంది. ప్రత్యర్థికి ఏ దశలోనూ అవకాశమివ్వకుండా విజృంభించిన భారత జట్టులో దిల్‌రాజ్ సింగ్ ఏకంగా నాలుగు గోల్స్ కొల్లగొట్టాడు. రోషన్ కుజూర్, సౌరభ్ ఆనంద్ చెరో మూడు గోల్స్ కొట్టారు. పూల్-ఎలో భారత్ తన ఆఖరి మ్యాచ్‌ను ఆదివారం కొరియాతో ఆడనుంది. సెమీఫైనల్స్ మంగళవారం నుంచి జరుగుతాయి. ఈ టోర్నీలో అత్యధికంగా నాలుగుసార్లు విజేతగా నిలిచిన భారత్.. ప్రస్తుత ఫామ్ ప్రకారం చూస్తే ఐదోసారీ టైటిల్ ఎగరేసుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.



మళ్లీ డ్రానే

- ఐదో గేమ్‌లో లిరెన్‌ను నిలువరించిన గుకేష్
- ప్రపంచ చాంపియన్‌షిప్

సింగపూర్: గ్రాండ్‌మాస్టర్లు గుకేష్, డింగ్ లిరెన్ మధ్య ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఐదో గేమ్ కూడా డ్రా అయింది. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌ను డ్రా చేసేందుకు భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ చెమటోడ్చాల్సి వచ్చింది. శనివారం నాటి రౌండ్‌ను 40 ఎత్తుల తర్వాత ఫలితం లేకుండా ముగించేందుకు గుకేష్, లిరెన్ (చైనా) అంగీకరించారు. టోర్నీలో ఇది వరసగా మూడో డ్రా కావడం గమనార్హం. తొలి రౌండ్‌లో లిరెన్ నెగ్గగా, రెండు, నాలుగు గేమ్‌లు డ్రా అయ్యాయి. మూడో గేమ్‌లో గుకేష్ గెలిచాడు. ఇక 14 గేమ్‌ల ఈ ఫైనల్లో ఐదో రౌండ్ ముగిసే సరికి లిరెన్, గుకేష్ చెరో 2.5 పాయింట్లతో సమంగా నిలిచారు. టైటిల్ గెలవాలంటే ఇద్దరిలో ఏ ఆటగాడికైనా మరో ఐదు పాయింట్లు కావాలి. మొదట 7.5 పాయింట్లు సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు.

బీరాలు పలికి.. బెదిరిపోయి..!

దిగొచ్చిన పాకిస్థాన్ ● 'హైబ్రిడ్' చాంపియన్స్ ట్రోఫీకి ఓకే!







దుబాయ్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) దిగొచ్చింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అల్టిమేటానికి తలొగ్గింది. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ విధానం (భారత్ మ్యాచ్‌లను పాక్‌లో కాకుండా మరో దేశంలో నిర్వహించడం)లో నిర్వహించేందుకు అంగీకరించినట్టు సమాచారం. ఈమేరకు శనివారం జరిగిన ఐసీసీ బోర్డు సమావేశానికి తన సమ్మతిని తెలియజేసిందట. కాకపోతే..భారత్ ఆతిథ్యమిచ్చే భవిష్య ఐసీసీ టోర్నీలలో ఇదే హైబ్రిడ్ పద్ధతిని అనుసరించాలని కోరింది. మొత్తంగా పీసీబీ వెనక్కు తగ్గిన దరిమిలా ట్రోఫీ నిర్వహణపై స్పష్టత వచ్చింది. అయితే ఈ విషయాన్ని ఐసీసీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఐసీసీ కొత్త చీఫ్‌గా బీసీసీఐ కార్యదర్శి జై షా ఆదివారం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో.. ఒకరోజు ముందే ఈ వివాదం ముగియనుండడం గమనార్హం. వాస్తవానికి ఈ వన్డే టోర్నీకి వచ్చే ఫిబ్రవరిలో పాకిస్థాన్ ఆతిథ్యమివ్వాల్సి ఉంది. అయితే భద్రతా కారణాలతో ఆ దేశానికి వెళ్లేందుకు భారత్ నిరాకరించిన నేపథ్యంలో టోర్నీని హైబ్రిడ్ విధానంలో జరిపే ప్రతిపాదనను ఐసీసీ తీసుకొచ్చింది. కానీ దానికి పీసీబీ ససేమిరా అనడంతోపాటు ఈవెంట్‌నే బహిష్కరిస్తామని బీరాలు పలికింది. ఇందుకు ఆగ్రహించిన ఐసీసీ.. 'హైబ్రిడ్'కు అంగీకరిస్తే సరి, లేదంటే టోర్నీ ఆతిథ్య హక్కులు వదులుకోవాలని శుక్రవారం హుకుం జారీ చేసింది. అంతేకాదు పాక్ జట్టు లేకుండా చాంపియన్స్ ట్రోఫీని నిర్వహిస్తామని కూడా హెచ్చరించింది. ఐసీసీ అల్టిమేటంతో హడలిపోయిన పాక్ బోర్డు పట్టు సడలించింది. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించేందుకు ఒప్పుకొంది. అయితే ఈ విధానంలో జరిపినా..ఫైనల్‌ను లాహోర్‌లోనే నిర్వహించాలని మెలిక పెట్టింది. కానీ, ఐసీసీ ఆ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చినట్టు సమాచారం. భారత్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ టోర్నీల్లో కూడా హైబ్రిడ్ విధానాన్నే అనుసరించాలన్న పీసీబీ డిమాండ్‌పైనా ఐసీసీ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 2031 వరకు మూడు పురుషుల ఐసీసీ టోర్నీలకు భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. 2026 టీ20 వరల్డ్ కప్‌ను శ్రీలంకతో కలిసి సంయుక్తంగా, 2029 చాంపియన్స్ ట్రోఫీని, 2031 వన్డే ప్రపంచ కప్‌ను బంగ్లాదేశ్‌తో కలిసి భారత్ నిర్వహించాల్సి ఉంది. వీటిల్లో 2026, 2031 టోర్నీలకు శ్రీలంక, బంగ్లాదేశ్ ఆతిథ్య దేశాలు కావడంతో ఎలాంటి సమస్యా ఉండకపోవచ్చు. ఎటొచ్చీ 2029 చాంపియన్స్ ట్రోఫీతోనే చిక్కు. కారణం ఆ టోర్నీ ఏకైక ఆతిథ్య దేశం భారత్ కావడమే.

క్రికెట్ గెలవాలి..

క్రికెట్ గెలవాలనే ఉద్దేశంతోనే తాము హైబ్రిడ్ విధానానికి అంగీకరించామని పీసీబీ చైర్మన్ మొహిసిన్ నఖ్వీ చెప్పుకొచ్చాడు. 'మేం ఎలాంటి ఫార్ములా ప్రతిపాదించినా, అంతిమంగా క్రికెట్ గెలవడం ముఖ్యం' అని నఖ్వీ అన్నాడు. అంతకుముందు ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు చీఫ్ ముబాషిర్ ఉస్మానీని దుబాయ్‌లో నఖ్వీ కలిశాడు. దాంతో చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ పద్ధతికి పాకిస్థాన్ అంగీకరించిందని తెలిపోయింది.



దక్షిణాఫ్రికా ఘన విజయం

డర్బన్: శ్రీలంకతో తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 233 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. పేసర్ జాన్సెన్ మొత్తంగా 11 వికెట్లు తీసి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో రెండు టెస్టుల ఈ సిరీస్‌లో సఫారీ జట్టు 1-0తో ఆధిక్యంలో నిలిచింది. 516 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన లంక నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌లో 282 రన్స్‌కు కుప్పకూలింది. చాందిమల్ (83), ధనంజయ (59), కుశాల్ మెండిస్ (48) రాణించారు. జాన్సెన్‌కు 4.. రబాడ, కొట్జీ, కేశవ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 191, లంక 42 రన్స్ చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 366/5 (డిక్లేర్డ్) స్కోరు చేసింది. ఈ గెలుపుతో డబ్ల్యూటీసీ పట్టికలో సఫారీలు రెండో స్థానానికి ఎగబాకారు. భారత్ టాప్‌లో ఉంది.



మన షట్లర్లు.. అదరగొట్టారు

ఐదు విభాగాల్లోనూ ఫైనల్స్‌కు

- సింగిల్స్ తుదిపోరుకు సింధు, లక్ష్య సేన్
- డబుల్స్‌లో గాయత్రి, మిక్స్‌డ్‌లో తనీషా జోడీలు

లఖ్‌నవూ: సొంతగడ్డపై జరుగుతున్న సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు సత్తా చాటారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్.. ఇలా ప్రతి విభాగంలోనూ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, మహిళల్లో రెండుసార్లు విజేత పీవీ సింధు, పురుషుల డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి/సాయి ప్రతీక్, మహిళల్లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్యాస్ట్రో/ధ్రువ్ కపిల తుది పోరులో నిలిచారు. సెమీఫైనల్లో టాప్ సీడ్ సింధు 21-12, 21-9తో భారత్‌కే చెందిన 17 ఏళ్ల సంచలనం ఉన్నతి హుడా జోరుకు బ్రేక్ వేసింది. సింధు ఆదివారం జరిగే ఫైనల్లో వూ లూ యూ (చైనా)తో అమీతుమీ తేల్చుకోనుంది. టాప్ సీడ్ లక్ష్య 21-8, 21-14తో షొగో ఒగావ (జపాన్)ను ఓడించి జియా హెంగ్ జాసన్ (సింగపూర్)తో ఫైనల్‌కు సిద్ధమయ్యాడు. పురుషుల డబుల్స్ సెమీస్‌లో పృథ్వీ/ప్రతీక్ ద్వయం 21-17, 17-21, 21-16తో భారత్‌కే చెందిన ఇషాన్/శంకర్‌పై, మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జంట 18-21, 21-18, 21-10తో థాయ్‌లాండ్ జోడీ బెన్యపా ఐంసార్డ్/నుంటకర్న్ ఐంసార్డ్‌పై నెగ్గగా.. మరో భారత ద్వయం అశ్వినీ పొన్నప్ప/తనీషా 21-14, 16-21, 13-21తో చైనా జోడీ బావో లి జింగ్/లి కియాన్ చేతిలో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ సెమీస్‌లో ఐదో సీడ్ తనీషా/ధ్రువ్ జంట 21-16, 21-15తో చైనా జోడీ జి హోంగ్ జు-జి యా యి యాంగ్‌పై గెలిచింది.

యువ భారత్‌కు పాక్ ఝలక్

అండర్-19 ఆసియాకప్

దుబాయ్: అండర్-19 ఆసియాకప్‌ను భారత కుర్రాళ్లు పేలవంగా ఆరంభించారు. శనివారం గ్రూప్ 'ఎ'లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో భారత్ 44 పరుగులతో ఓటమి పాలైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్.. ఓపెనర్ షాజైబ్ ఖాన్ (159) రికార్డు శతకంతో చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 281 పరుగులు సాధించింది. మరో ఓపెనర్ ఉస్మాన్ ఖాన్ (60) హాఫ్ సెంచరీ సాధించాడు. షాజైబ్, ఉస్మాన్ తొలి వికెట్‌కు 160 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ టోర్నీ చరిత్రలో పాక్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన షాజైబ్.. ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (10) బాదిన బ్యాటర్‌గానూ నిలిచాడు. సమర్థ్ నాగరాజ్‌కు మూడు, ఆయుష్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 47.1 ఓవర్లలో 238 పరుగులకే కుప్పకూలింది. నిఖిల్ కుమార్ (60) ఒక్కడే ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత పదో నెంబర్ బ్యాటర్ మహ్మద్ ఇనాన్ (30)ది రెండో అత్యధిక స్కోరు. ఇక ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న పిన్న వయస్కుడు.. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం ఒక్క పరుగుతో నిరాశపర్చాడు. అలీ రజాకు 3.. ఫహామ్, సుభాన్ రెండేసి వికెట్లు తీశారు.


వైభవ్ సూర్యవంశీ (1)

టైటాన్స్ పరాజయం

నోయిడా: ఆల్‌రౌండర్ విజయ్ మాలిక్ 17 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా తెలుగు టైటాన్స్‌ను గెలిపించలేకపోయాడు. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 28-41 తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓడింది. జైపూర్ తరఫున నీరజ్ నర్వాల్, అర్జున్ దేశ్వాల్ సూపర్-10లు సాధించారు. ఫస్టాఫ్ హోరాహోరీగా సాగినా.. సెకండాఫ్‌లో పాంథర్స్ రైడింగ్, డిఫెన్స్‌లో మెరుగైన ప్రదర్శనతో మ్యాచ్‌ను సొంతం చేసుకొంది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 54-29తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది.

తొలిరోజు వర్షార్పణం

భారత్‌తో ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్ ప్రాక్టీస్ మ్యాచ్


ప్రాక్టీస్ మ్యాచ్ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో భారత ఆటగాళ్లు

కాన్‌బెర్రా: ఎడతెరిపిలేని వర్షం కారణంగా.. భారత్, ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్ జట్ల మధ్య శనివారం నుంచి జరగాల్సిన రెండ్రోజుల పింక్ బాల్ ప్రాక్టీస్ మ్యాచ్ తొలిరోజు ఆట రద్దయింది. దీంతో ఆదివారం వాతావరణం మెరుగుపడితే 50 ఓవర్ల చొప్పున మ్యాచ్ ఆడడానికి ఇరు జట్లూ అంగీకరించాయి. ఫలితంగా పెర్త్ టెస్ట్‌కు దూరమైన రోహిత్, గిల్‌కు అవసరమైనంత ప్రాక్టీస్ లభించలేదు. ఈనెల 6 నుంచి అడిలైడ్‌లో ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య పింక్ బాల్ టెస్ట్ జరగనుంది.

ఇంగ్లండ్ 499

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. హ్యారీ బ్రూక్ (171), కెప్టెన్ స్టోక్స్ (80), పోప్ (77)లతో పాటు టెయిలెండర్లు అట్కిన్సన్ (48), కార్స్ (33 నాటౌట్) విశేషంగా రాణించడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 499 పరుగుల భారీ స్కోరు సాధించింది. హెన్రీకి 4, స్మిత్‌కు 3, సౌథీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో తడబడిన కివీస్ మూడో రోజైన శనివారం ఆట ముగిసే సరికి 155/6 స్కోరుతో నిలిచింది. కేన్ విలియమ్సన్ (61) అర్ధసెంచరీ చేశాడు. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 348 రన్స్ సాధించింది.

కంపెనీల యాజమాన్యాలకు ఈపీఎఫ్‌ఓ ఆమ్నెస్టీ పథకం

ఆమోదించిన ధర్మకర్తల మండలి

EPFO

న్యూఢిల్లీ: కంపెనీల యాజమాన్యాలు తమ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చందా బకాయిలను ఎలాంటి పెనాల్టీ లేకుండా చెల్లించేందుకు వీలుగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) ఆమ్నెస్టీ (క్షమాభిక్ష) పథకాన్ని ప్రకటించింది. కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా నేతృత్వంలోని ఈపీఎఫ్‌ఓ ధర్మకర్తల కేంద్ర మండలి (సీబీటీ) ఈ పథకానికి ఆమోదం తెలిపింది. కేంద్ర కార్మిక శాఖ శనివారం ఈ విషయాన్ని వెల్లడించింది. కంపెనీలు తమ ఉద్యోగుల ఖాతాల్లో పీఎఫ్ చందాను ప్రతి నెలా నిర్దేశిత గడువులోగా జమ చేయాల్సి ఉంటుంది. అయితే, ఉద్యోగుల ఖాతాల్లో పీఎఫ్ సొమ్మును జమ చేయడంలో పూర్తిగా లేదా పాక్షికంగా విఫలమైన లేదా ఎగవేసిన కంపెనీల యాజమాన్యాలు స్వచ్ఛందంగా తమ తప్పును అంగీకరించడంతో పాటు ఆ బకాయిలను పెనాల్టీ లేదా చట్టపరమైన చర్యల నుంచి మినహాయింపుతో జమ చేసేందుకు ఆమ్నెస్టీ పథకం అనుమతిస్తుంది. ఆన్‌లైన్ డిక్లరేషన్ ద్వారా కంపెనీలు ఈ ప్రయోజనాలను పొందవచ్చు.

మరిన్ని విషయాలు..

- ఈపీఎఫ్ పథకం -1952లో సవరణలకూ ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. ఈ సవరణ ఫలితంగా ఈపీఎఫ్‌ఓ తన చందాదారులకు పీఎఫ్ సొమ్ము క్లెయిమ్‌లపై సెటిల్‌మెంట్ తేదీ వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. ఏదైనా నెలలో 24వ తేదీ వరకు పరిష్కరించే క్లెయిమ్‌లకు అంతక్రితం నెల వరకే ఈపీఎఫ్‌ఓ వడ్డీ చెల్లిస్తోంది. తాజా నిబంధన సవరణతో పీఎఫ్ చందాదారులకు మరింత లబ్ధి చేకూరనుంది.
- ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్‌ఐ) ప్రయోజనాల పొడిగింపును ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచే అమలు చేసేందుకూ ధర్మకర్తల మండలి ఆమోదించింది. దురదృష్టవశాత్తూ పీఎఫ్ చందాదారు మరణిస్తే, తన కుటుంబ సభ్యులకు ఈ బీమా పథకం కింద రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు లభిస్తుంది.
- గృహ కొనుగోలు లేదా నిర్మాణం, పెళ్లి, విద్య అవసరాల కోసం అడ్వాన్స్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ పరిమితిని రూ.50,000 నుంచి రూ.లక్షకు పెంచేందుకు మండలి అనుమతిచ్చింది.

పన్ను తగ్గింపుతో కంపెనీలకు రూ.3 లక్షల కోట్లు ఆదా!

2019లో కార్పొరేట్ ట్యాక్స్ తగ్గించిన కేంద్రం ..

ఆ తర్వాత గణనీయంగా తగ్గుతూ వచ్చిన కార్పొరేట్ పన్నుల రాబడి వాటా



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2019లో కార్పొరేట్ పన్ను తగ్గించడంతో గడిచిన ఐదేళ్లలో దేశీయ కార్పొరేట్ రంగానికి పన్ను చెల్లింపుల రూపంలో రూ.3 లక్షల కోట్ల వరకు ఆదా అయి ఉండవచ్చని నిపుణుల అంచనా. అందులో బడా కంపెనీలకే (బీఎస్ఈ 500 సూచీ నమోదిత సంస్థలు) అధిక ప్రయోజనం చేకూరిందని వారన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో (2012-13 నుంచి) పలు పన్ను మినహాయింపుల ద్వారా కార్పొరేట్ రంగానికి చేకూరిన రూ.8 లక్షల కోట్లకు పైగా లబ్ధికి ఇది అదనమని వారన్నారు. అప్పటివరకు కల్పిస్తూ వచ్చిన ప్రోత్సాహకాలను హేతుబద్ధీకరించడంతో పాటు దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు, ఉద్యోగావకాశాలను, కంపెనీల పోటీ సామర్థ్యాన్ని పెంచేందుకు కార్పొరేట్ పన్నును తగ్గించినట్లు ప్రభుత్వం సమర్థించుకుంది. కానీ, ఆ తర్వాత మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా గణనీయంగా తగ్గిందని.. దాంతో ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం వెచ్చించగలిగే సామర్థ్యాన్ని పరిమితం చేసిందన్నారు. 2019 సెప్టెంబరు 20న మోదీ సర్కారు అప్పటికే మనుగడలో ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి.. కొత్త మాన్యుఫాక్చరింగ్ కంపెనీలకు 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించింది.

కార్పొరేట్ల లాభాలు అప్.. పన్ను వృద్ధి డౌన్

2018-19 ఆర్థిక సంవత్సరంతో ముగిసిన ఐదేళ్లలో కంపెనీల లాభాలు 10.4 శాతం చొప్పున వృద్ధి చెందగా.. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్లలో కంపెనీల లాభాలు 32.5 శాతం పెరిగాయి. మరీ ముఖ్యంగా 2020-21లో కొవిడ్ సంక్షోభం వ్యాపారాలను కుదిపేసినప్పటికీ సంస్థల లాభాలు వేగంగా పెరగడం గమనార్హం. కాగా, గత ఐదేళ్లలో కార్పొరేట్ల పన్ను చెల్లింపులు మాత్రం 18.6 శాతమే పెరిగాయి.

26.5 శాతానికి తగ్గిన కార్పొరేట్ పన్ను ఆదాయం వాటా

2017-18 ఆర్థిక సంవత్సరానికి మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ ట్యాక్స్ వాటా దాదాపు 32 శాతంగా ఉండేది. ఆ తర్వాత కాలంలో కార్పొరేట్ పన్నుల వాటా తగ్గుతూ రాగా.. వ్యక్తిగత పన్ను ఆదాయం వాటా పెరుగుతూ వచ్చింది. 2024-25 బడ్జెట్ అంచనాల ప్రకారం.. మొత్తం పన్ను ఆదాయంలో ఈ విభాగ వాటా దశాబ్ద కనిష్ఠ స్థాయి 26.5 శాతానికి తగ్గనుంది. వ్యక్తిగత ఆదాయ పన్నుల వాటా 30.91 శాతానికి, జీఎస్‌టీ రెవెన్యూ వాటా 27.65 శాతానికి పెరగనుంది.

ఈ ప్రథమార్ధంలోనూ అంతే..

కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ప్రథమార్ధంలో (ఏప్రిల్-సెప్టెంబరు) మొత్తం పన్ను ఆదాయం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.18.1 లక్షల కోట్లకు చేరుకోగా.. అందులో కార్పొరేట్ పన్ను రాబడి కేవలం 2.3 శాతం వృద్ధితో రూ.4.6 లక్షల కోట్లకు పరిమితమైంది. వ్యక్తిగత పన్నుల ఆదాయం మాత్రం ఏకంగా 25 శాతం పెరిగి రూ.5.6 లక్షల కోట్లకు చేరుకుంది. ఇదే కాలానికి జీఎస్‌టీ రెవెన్యూలో సైతం 10.4 శాతం వృద్ధితో రూ.5.16 లక్షల కోట్లకు, కస్టమ్ సుంకాల ద్వారా ఆదాయమూ 6.4 శాతం పెరిగి రూ.1.12 లక్షల కోట్లకు చేరుకుంది. 2024-25 బడ్జెట్‌లో మొత్తం పన్ను ఆదాయాన్ని రూ.38.40 లక్షల కోట్ల స్థాయిలో అంచనా వేయగా.. ప్రథమార్ధంలో అందులో 47.2 శాతానికి సమానమైన ఆదాయం సమకూరింది. కార్పొరేట్ పన్ను ఆదాయం అంచనాలో మాత్రం 45.2 శాతమే సమకూరగా.. వార్షిక అంచనాలో వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 47.6 శాతానికి, జీఎస్‌టీ రాబడి 48. శాతంగా నమోదైంది.

బిజినెస్

ఫిబ్రవరి 10 నుంచి బెంగళూరులో ఏరో ఇండియా-2025

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఆసియా ఖండంలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన 'ఏరో ఇండియా-2025' ఫిబ్రవరి 10 నుంచి ఐదు రోజుల పాటు జరగనుంది. యలహంకలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో ఈ ప్రదర్శన నిర్వహిస్తారు. 1996 నుంచి రెండేళ్లకోసారి ఎయిర్‌షో నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే ఈ సదస్సులో భారతీయ వాయుసేన (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్)కు సంబంధించిన ప్రదర్శనలు కీలక ఉండనున్నాయి. ఐఏఎఫ్‌కు సుఖోయ్, సూర్యకిరణ్, ఏరోబాటిక్ ఫైటర్‌జెట్ బృందాలు, సారంగ్ హెలికాప్టర్స్ ఈ ప్రదర్శనలో కొలువు దీరనున్నాయి. కాగా ఎయిర్‌బస్, బోయింగ్, డసాల్ట్ ఏవియేషన్, లాకీడ్ మార్టిన్, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్, బ్రహ్మోస్ ఏరోస్పేస్‌తో పాటు పలు అంతర్జాతీయ విమానయాన సంస్థలు ఏరో ఇండియాలో పాల్గొననున్నాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), భారత్ ఫోర్జ్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఎల్ అండ్ టీ తమ ఉత్పత్తులను ఈ సదస్సుల్లో ప్రదర్శించనున్నాయి.

- అవీవా ఇండియా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి గాను రూ.63 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 25 శాతం పెరిగింది. కాగా నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) కూడా 13 శాతం వృద్ధితో రూ.14,636 కోట్లకు చేరుకున్నాయి.
- బెంగళూరులో ఈ నెల 18 నుంచి 20 వరకు ఎనిమిదో ఎడిషన్ అంతర్జాతీయ యూనిఫామ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సు (ఐయూఎంఎఫ్)ను నిర్వహిస్తున్నారు. షోలాపూర్ గార్మెంట్స్ తయారీ పరిశ్రమ (ఎస్‌జీఎంఏ) ఈ సదస్సును నిర్వహిస్తోంది. 120కి పైగా ప్రధాన బ్రాండ్లు ఈ ఫెయిర్‌లో పాల్గొననున్నాయి.

టర్నోవర్ రూ.50 లక్షలు దాటిందా..?



రాంబాబు గొండాల

నవీన్ చంద్ర ఒక వస్త్ర వ్యాపారి. రాష్ట్రవ్యాప్తంగా పలు ముఖ్య పట్టణాల్లో షోరూమ్స్ నిర్వహిస్తున్నారు. వ్యాపారం విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటాడో, ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నుల విషయంలోనూ అంతే కచ్చితత్వం పాటిస్తాడు. కట్టాల్సిన పన్నులకు బకాయిలను సకాలంలో చెల్లించాల్సిందిగా తన సిబ్బందికి చెబుతుంటాడు. అలాంటిది, డిపార్ట్‌మెంట్ నుంచి తనకు ఒక నోటీస్ అందింది. గడిచిన కొన్ని నెలల్లో తాను కట్టాల్సిన పన్ను మొత్తం అంటే 100 శాతం పన్ను మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారానే చెల్లించారనీ, జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే చెల్లించాల్సిన పన్నులో 99 శాతం మాత్రమే ఐటీసీ ద్వారా చెల్లించి విగతా మొత్తాన్ని నగదు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా వాడాల్సి ఉండగా మొత్తం పన్నును ఐటీసీ ద్వారా చెల్లించటం చట్ట ఉల్లంఘన కిందకు వస్తుందని, కాబట్టి ఆ తేడా మొత్తాన్ని వెంటనే చెల్లించమని తెలపటం జరిగింది. తనకు చట్ట ప్రకారం అర్హత ఉన్న ఇన్‌పుట్స్ మీదనే క్రెడిట్ తీసుకున్నాడు. ఆ క్రెడిట్‌నే పన్ను చెల్లింపునకు ఉపయోగించాడు. పన్ను మొత్తాన్ని క్రెడిట్ ద్వారా చెల్లించకూడదా? అసలు ఈ 99 శాతం లెక్కేమిటీ?

ఐటీసీని తీసుకోవటానికి నియమ నిబంధనలు ఎలా ఉన్నాయో తీసుకున్న క్రెడిట్‌ను వాడుకోవటానికి కూడా అలాగే నిబంధనలు ఉన్నాయి. పన్ను చెల్లించేటప్పుడు ముఖ్యంగా ఐటీసీ ద్వారా పన్ను చెల్లించేటప్పుడు ఈ విషయాలు తెలుసుకోవాలి. ఏదైనా నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు మించితే అప్పుడు ఈ 99 శాతం రూల్ అమల్లోకి వస్తుంది. అంటే చెల్లించాల్సిన పన్నులో 99 శాతానికి మించి ఐటీసీ వాడకూడదు. దీని అర్థం మిగతా ఒక శాతం కచ్చితంగా నగదు చెల్లింపు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి అని.

మరి టర్నోవర్ అంటే ఏమి తీసుకోవాలి? ఇందులో నెలలో జరిగిన మొత్తం సరఫరాల విలువ నుంచి పన్ను మినహాయింపు ఉన్న సరఫరాల విలువ, జీరో రేటెడ్ సరఫరాల విలువ మినహాయించాలి (జీరో రేటెడ్ సరఫరా అంటే ఎగుమతులకు లేదా సెజ్‌లకు పంపిన సరఫరా). ఇలా మినహాయించగా మిగిలిన మొత్తాన్ని టర్నోవర్ కింద లెక్కించాలి. ఇలా లెక్కించిన టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే ఈ నిబంధన వర్తిస్తుంది. అలా అని రూ.50 లక్షల టర్నోవర్ దాటిన ప్రతి కేసులోనూ ఈ 99 శాతం రూల్ అమలవుతుందని అనుకోకూడదు. దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. అవేమిటంటే..

- గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాలలోనూ రిజిస్ట్రేషన్ పొందిన సంస్థ లేదా వ్యక్తి రూ.లక్ష మించి ఆదాయ పన్ను (ఐటీ) కట్టి ఉన్నా లేదా గడచిన ఆర్థిక సంవత్సరం సదరు సంస్థ లేదా వ్యక్తి రూ.లక్ష మించి రిఫండ్ పొంది ఉన్నా (ఈ రిఫండ్ అనేది పన్ను చెల్లించకుండా చేసే జీరో రేటెడ్ సరఫరాలకు లేదా ఇన్వర్టెడ్ ట్యాక్స్ స్ట్రక్చర్‌కు సంబంధించినవి అయి ఉండాలి) లేదా ఇప్పటి వరకు అయిన టర్నోవర్ మీద ఇప్పటికే నగదులో ఒక శాతానికి మించి కట్టి ఉన్నా. ఇలాంటి సందర్భాల్లో ఈ రూల్ అమలు కాదు. మిగతా అన్ని సందర్భాల్లోనూ ఎప్పుడైతే టర్నోవర్ రూ.50 లక్షలు దాటుతుందో అప్పుడు కనీసం ఒక్క శాతం పన్ను క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి.
- కాబట్టి జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తులు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను తీసుకోవటానికి గల నియమ నిబంధనలతో పాటుగా తీసుకున్న క్రెడిట్‌ను ఎలా వాడాలి? ఎంత మేర వాడాలి? ఇతరత్రా నియమ నిబంధనలు కూడా తెలుసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



డిసెంబరు 1			
హైదరాబాద్	605	విజయవాడ	610
వరంగల్	607	గోదావరి	600
చిత్తూరు	633	విశాఖపట్నం	590
		దజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▼	71,500 ▼	1,00000 ▲
ముంబై	76,740 ▲	70,290 ▲	89,380 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	104
వరంగల్	95	గుంటూరు	104
కరీంనగర్	95	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	99
కర్నూలు	95	నెల్లూరు	99
విశాఖపట్నం	105	అనంతపురం	99
గోదావరి	104		





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
చర్చిల్ ఎట్ వార్	డాక్యుమెంటరీ	డిసెంబర్ 04
దట్ క్రిస్మస్	యానిమేషన్ మూవీ	డిసెంబర్ 04
ది ఓన్లీ గర్ల్		
ఇన్ ది ఆర్కెస్ట్రా	డాక్యుమెంటరీ	డిసెంబర్ 04
ది అల్టిమేటమ్	వెబ్‌సిరీస్	డిసెంబర్ 04
అమరన్	తమిళ చిత్రం (తెలుగులో)	డిసెంబర్ 05
బ్లాక్ డవ్స్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 05
ఎ నాన్సెన్స్ క్రిస్మస్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 06
బిగ్గెస్ట్ హైస్ట్ ఎవర్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 06
జిగ్రా	హిందీ చిత్రం	డిసెంబర్ 06
మేరీ	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 06
విక్కీ విద్యాకా వో వాలా వీడియో	హిందీ చిత్రం	డిసెంబర్ 06
అమెజాన్ ప్రైమ్		
జాక్ ఇన్‌టైమ్ ఫర్ క్రిస్మస్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 03
పాప్ కల్చర్ జెప్పడీ	వెబ్‌సిరీస్	డిసెంబర్ 04
మట్కా	తెలుగు చిత్రం	డిసెంబర్ 05
అగ్ని	హిందీ చిత్రం	డిసెంబర్ 06
ది స్టిక్కీ	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 06
జియో సినిమా		
క్రియేచ కమాండోస్	యానిమేషన్ మూవీ	డిసెంబర్ 06
లాంగింగ్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 07
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది ఒరిజినల్	కొరియన్ సిరీస్	డిసెంబర్ 03
లైట్ షాప్	కొరియన్ సిరీస్	డిసెంబర్ 04
జీ5		
మైరీ	హిందీ చిత్రం	డిసెంబర్ 06
సోనీ లివ్		
తనవ్ 2	హిందీ సిరీస్ (తెలుగులో)	డిసెంబర్ 06
బుక్ మై షో		
స్మైల్ 2	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 04

శౌర్యం, సాహసాల కథ



అగ్నిమాపక సిబ్బంది తమ పనిలో ఎదుర్కొనే కఠినమైన సవాళ్లు, వారి ధైర్య సాహసాల నేపథ్యంలో తెరకెక్కిన హిందీ చిత్రం 'అగ్ని'. డిసెంబర్ 06 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ముంబై నగరంలో చెలరేగిన మంటలను ఆర్పేక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చూపిన శౌర్యం, చేసిన త్యాగాల ఆధారంగా అల్లుకున్న కథ ఇది. ప్రతీక్‌గాంధీ, సయామీ ఖేర్, దివ్యేందు శర్మ కీలక కపాత్రలు పోషించారు. బాలీవుడ్ హీరో, ఫర్హాన్ అక్తర్ ఈ చిత్రాన్ని నిర్మించాడు. రాహుల్ ఢోలాకియా దర్శకుడు.

సండే సెలబ్రిటీ



ఆ శుక్రవారం ఇంకా రాలేదు

భావోద్వేగాలను సునాయాసంగా పండించగల టాలీవుడ్ నటులలో సత్యదేవ్ ఒకరు. జయాపజయాలతో సంబంధం లేకుండా వరుస చిత్రాలతో దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'తో తన అనుభవాలను పంచుకున్నారు.

'జీబ్రా' చిత్రానికి స్పందన ఎలా ఉంది?

'గ్లాడియేటర్' సినిమాలో 'విన్ ది క్రౌడ్.. యు విల్ గెట్ ఫ్రీడమ్' (ప్రజలను గెలుచుకుంటే నువ్వు స్వేచ్ఛను పొందుతావు) అని ఒక డైలాగ్ ఉంటుంది. ప్రస్తుతం నాకు అలా అనిపిస్తోంది. ప్రేక్షకులందరు 'జీబ్రా' సినిమాను చాలా ఆనందంగా చూస్తున్నారు. మంచి రివ్యూలు ఇచ్చారు. ఒకరిద్దరు మాత్రం కావాలని తక్కువ రేటింగ్స్ ఇచ్చారు. కొంత బాధ అనిపించింది. ఎందుకంటే అందరూ బావుందన్నప్పుడు- రివ్యూలు కావాలని రాస్తే ఇబ్బందిగా అనిపిస్తుంది కదా! 'బ్లఫ్ మాస్టర్'కు కూడా గతంలో ఇలాంటి రివ్యూలే కావాలని రాయించారు. వాటి ప్రభావం నుంచి బయట పడటానికి సమయం పట్టింది. అంతే కాదు... సినిమా విడుదల చేయటానికి మాకు చాలా తక్కువ థియేటర్స్ లభించాయి. కానీ వాటిలో చాలా షోలు హౌస్‌ఫుల్‌గా నడుస్తున్నాయి.

మీ నటనా ప్రస్థానం ఎలా సాగుతోంది?

వెనక్కి తిరిగి చూసుకుంటే చాలా బావుందనిపిస్తోంది. కానీ ఎందుకో నాకు రావాల్సినన్ని విజయాలు రాలేదనిపిస్తుంది. 'బ్లఫ్ మాస్టర్' బావుందని ఇప్పుడు అనేక మంది చెబుతూ ఉంటారు. కానీ అది పెద్ద విజయం సాధించలేదు. "ఉమామహేశ్వర ఉగ్రరూపస్య." సినిమాను ఇప్పటికీ మెచ్చుకుంటారు. కానీ కొవిడ్‌వల్ల ఆ సినిమా పెద్దగా ఆడలేదు. 'తిమ్మరసు' కూడా చాలా మంచి సినిమా. అది విడుదలయ్యే సమయంలో కొవిడ్ సెకండ్ వేవ్ వచ్చింది. సినిమా హాళ్లలో 50 శాతం మందినే అనుమతించేవారు. దాంతో అనుకున్నంత విజయం సాధించలేదు. తర్వాత 'కృష్ణమ్మ' రెండేళ్లు ఆగిపోయింది. విడుదలయిన వెంటనే- అంటే- ఆరు రోజులకే ప్రైమ్ ఓటీటీలో వదిలేశారు. దీంతో కలెక్షన్లు సరిగ్గా రాలేదు. ఇప్పుడు 'జీబ్రా'తో విజయం సాధించాను. ఇక్కడ ఒక మాట చెప్పాలి. నా సినిమాలు విజయాలు సాధించటానికి ఎంత చేయగలనో అంత చేస్తున్నాను. విజయాలు వచ్చేదాకా పట్టుదల వీడను. ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాను.

ఇలా విజయాలు తృటిలో తప్పిపోతుంటే బాధగా అనిపించదా?

మొదట్లో చాలా బాధగా అనిపించేది. "కచ్చితంగా అవుతుంది" అనుకున్నప్పుడల్లా ఎదురుదెబ్బ తగిలేది. దాని నుంచి బయట పడి మళ్లీ ట్రాక్ ఎక్కామనుకున్నప్పుడు మరో దెబ్బ.. ఇప్పటిదాకా ఇలా గడిచింది. దీనితో బహుశా నా ప్రయాణం ఇంకా మొదలవలేదు అనే సిద్ధాంతాన్ని నమ్మటం మొదలు పెట్టాను. కొందరికి అతి త్వరగా విజయం లభిస్తుంది. 25 ఏళ్లకే సీఈఓలు అయిపోతారు. 50 ఏళ్లు వచ్చేసరికి పతనం అంచుకు చేరుకుంటారు. కొందరు 50 ఏళ్లకు విజయం సాధించవచ్చు. కానీ ఆ విజయం వారి జీవితం చివరి దాకా ఉంటుంది. నాకు కూడా అంతేనేమో అనుకుంటాను. చాలా మంది ఒక శుక్రవారంతో నటుల జీవితం మారిపోతుందని అనుకుంటూ ఉంటారు. బహుశా ఆ శుక్రవారం నా జీవితంలో ఇంకా రాలేదు.

అపజయాలకు కారణాలేమిటో కనుగొన్నారా?

నేను 150 శాతం శ్రమిస్తాను. కానీ ప్రతిసారి విజయాలు తృటిలో ఎందుకు తప్పిపోతున్నాయో తెలియదు. ఉదాహరణకు బ్యాడ్మింటన్‌ను తీసుకుందాం. దీనిలో జయాపజయాలు మన ప్రతిభపైనే ఆధారపడి ఉంటాయి. కానీ సినిమా అలా కాదు. ఇదొక పెద్ద టీం స్పోర్ట్. మనం చాలా కష్టపడిన తర్వాత ఇతరులు వదిలేస్తే సినిమా ఆడదు. డైరక్షన్‌లో చిన్న లోపం నుంచి డిస్ట్రిబ్యూషన్ దాకా ఎక్కడ తేడా వచ్చినా సినిమా ఆడదు. అన్ని పరిస్థితులూ సక్రమంగా ఉంటేనే సినిమా ఆడుతుంది.



ఈ ఒడుదొడుకుల్లో మీకు ఎమోషనల్ సపోర్టు ఎవరు?

నా భార్య, నా కుమారుడు విక్కి. నాకు ఎమోషనల్ సపోర్టు. విక్కితో ఒక్క అరగంట ఆడుకుంటే చాలు... ఒత్తిడి అంతా మాయమైపోతుంది. జీవితం చాలా సులభమైనదనిపిస్తుంది. దీని కోసం ఇంతగా కిందామైనా పడిపోవాలా అనిపిస్తుంది. వీళ్లిద్దరితో పాటు చిరంజీవి గారు కూడా చాలా పెద్ద సపోర్టు. ఆయన నా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు రావటంతో 'జీబ్రా' అనే సినిమా ఉందనే విషయం చాలా మందికి తెలిసింది.

> **ఇప్పటిదాకా నేను పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లలో సినిమాలు చేయలేకపోయాను. నాకు అలాంటి ఛాన్స్ దొరకలేదు. 'జీబ్రా' తర్వాత నాకు అలాంటి అవకాశాలు వస్తాయనుకుంటున్నా.**

మీరు ఏ తరహా సినిమాలను ఇష్టపడతారు?

నాకు యాక్షన్ అంటే చాలా ఇష్టం. అయితే నాకు నచ్చేదాని కన్నా జనాలకు నచ్చేది చేయాలనేది నా ఉద్దేశం.

ఎలాంటి స్క్రిప్ట్‌లు ఎంచుకొంటున్నారు?

అందరూ రెండు రకాలైన సినిమాలు ఆడుతున్నాయని చెబుతున్నారు. వాటిలో మొదటిది... కొత్త ప్రపంచాన్ని చూపించేవి. 'అవతార్, కేజీఎఫ్, బాహుబలి, సలార్'.. ఇలాంటివన్నీ ఈ కోవకు వస్తాయి. రెండోది కామెడీ సినిమాలు. 'జీబ్రా'లో ఒక కొత్త ప్రపంచం ప్రేక్షకులకు కనిపిస్తుంది. అందుకే ఆ పాత్రను ఎంపిక చేసుకున్నా. ఇక రాబోయే సినిమా 'ఫుల్ బాటిల్'. ఇందులో నేను తాగుబోతు ఆటోడ్రైవర్ వేషం వేస్తున్నా. ఇది క్రైమ్ కామెడీ సినిమా. ఇలా జాగ్రత్తగా ఆలోచించి స్క్రిప్ట్‌లు ఎంచుకుంటున్నా.

ఎలాంటి సన్నివేశాల్లో నటించాలని అనుకొంటారు?

నేను భావోద్వేగాలు ఎక్కువగా ఉన్న సన్నివేశాల్లో బాగా నటిస్తాను. 'నేను ఏడిస్తే పక్కవాళ్లు ఏడ్వాలి.' అనేది నా భావన. అయితే ఎందుకో తెలియదు.. నేను ఏడ్చినట్లు నటించగలను కానీ సీను కోసం ఏడ్వలేను.

• సివిఎల్ఎన్ ప్రసాద్



తేనీరు ఇలా కూడా!

చాలామందికి ఉదయం లేవగానే తేనీటిని సేవించే అలవాటు ఉంటుంది. చిక్కని పాలలో కొన్ని నీళ్లు, పంచదార, తేయాకు పొడి వేసి బాగా మరిగించి తేనీటిని తయారు చేస్తారు. ఇది అందరికీ తెలిసిన పద్ధతే! ఒంట్లో నీరసంగా అనిపించినపుడు, ఆరోగ్యం బాగాలేనపుడు ఇంట్లో దొరికే కొన్ని దినుసులు ఉపయోగించి కొత్త రకంగా తేనీటిని తయారు చేసుకుని తాగితే క్షణాల్లో శరీరానికి శక్తి లభిస్తుంది. బడలికని పోగొట్టి మెదడుని ఉత్తేజితం చేసేందుకు తేనీటిలో కలపాల్సిన దినుసులు ఇవే...

అల్లం: ఒక చిన్న అల్లం ముక్కను పొట్టు తీసి కచ్చాపచ్చాగా నూరి మరుగుతున్న తేనీటిలో వేస్తే అందులోనుంచి వచ్చే సువాసనకే అలసట మొత్తం పోతుంది. ఈ తేనీటిని తాగిన వెంటనే అల్లంలోని జింజర్‌సోల్ అనే సమ్మేళనం గొంతు గరగరను పోగొడుతుంది. రాత్రి తిన్న ఆహారపదార్థాలు పొట్టలో సమస్యలు కలిగించకుండా వాటిని క్షణాల్లో జీర్ణం చేస్తుంది. రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది.

ఏలకులు : రెండు ఏలకులను పొట్టుతో సహా మెత్తగా నూరాలి. ఈ పొడిని కప్పు లేదా గ్లాసులో వేసుకోవాలి. అందులో ముందుగా తయారు చేసుకున్న వేడి తేనీటిని వడబోయాలి. తరవాత చెంచాతో కలిపితే తేనీటికి మంచి సువాసన పడుతుంది. ఈ తేనీటిని తాగడం వల్ల ఏలకులలో ఉండే రైబోఫ్లెవిన్, నియాసిన్ అనే విటమిన్లు; యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అందుతాయి. ఇవి కడుపులో ఆమ్లతత్వాన్ని నిరోధిస్తాయి. శరీరంలో జీవక్రియలను వేగవంతం చేస్తాయి.

దాల్చినచెక్క: మరుగుతున్న తేనీటిలో అర అంగుళం పొడవున్న దాల్చిన చెక్కను వేస్తే అందులోని ఔషధగుణాలన్నీ తేనీటిలోకి చేరతాయి. ఉదయాన్నే ఈ తేనేటిని తాగితే నిద్ర మత్తు వదలిపోతుంది. దాల్చిన చెక్కలో ఉండే పాలీఫెనాల్ సమ్మేళనాలు రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధీకరిస్తాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.



తులసి: వేడి తేనీటిలో నాలుగు లేదా అయిదు తులసి ఆకులు వేసుకుని తాగితే శరీరానికి రోగనిరోధక శక్తి అందుతుంది. ఒత్తిడి, మానసిక ఆందోళన, శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. తులసిలోని యాంటీ ఆక్సిడెంట్లు, సి విటమిన్ చర్మ సౌందర్యాన్ని పెంచుతాయి.

సోంపు: తేనీరు మరుగుతున్నపుడు అందులో అర చెంచా సోంపు గింజలు కలిపితే అది పొట్టను శుభ్రం చేసే కషాయంలా మారుతుంది. ఈ తేనీటిని తాగిన అర్ధగంటలోపే కడుపు ఉబ్బరం, అజీర్తి, కడుపులో మంట తదితర సమస్యలన్నీ పోతాయి.

లవంగాలు: లవంగ మొగ్గల్లో కె, సి విటమిన్లతోపాటు యూజినాల్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి దగ్గు, జలుబు, గొంతు గరగర లాంటి సమస్యలను నివారిస్తాయి. నోటి ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి. ఒక గ్లాసు తేనీటిలో రెండు లవంగాలను పొడి చేసి కలుపుకుని తాగితే చలికాలంలో వచ్చే శ్వాసకోశ సమస్యలనుంచి బయటపడవచ్చు.

మిరియాలు: వేడిగా ఉన్న తేనీటిలో చిటికెడు మిరియాల పొడిని కలుపుకొని తాగితే శరీరానికి సత్తువ లభిస్తుంది. ముక్కు దిబ్బడ, ముక్కు కారడం, తలనొప్పి, గొంతు నొప్పి తదితర సమస్యల నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుంది.

జింక్ కూడా ముఖ్యమే

విటమిన్ డీ, ఐరన్ మొదలైనవి తక్కువ అయితే ఏం జరుగుతుందో చాలా మందికి తెలుసు. కానీ మన శరీరానికి అత్యంత అవసరమైన జింక్ గురించి మాత్రం తెలియదు. మన శరీరానికి ప్రతి రోజు కనీసం 8 నుంచి 10 మిల్లీగ్రాముల జింక్ అవసరమవుతుంది. ఒక వేళ జింక్ తక్కువ అయితే దాని ప్రభావం శరీరంపై పడుతుంది. అప్పుడు శరీరం కొన్ని సంకేతాలు పంపుతుంది. ఆ సంకేతాలు ఏమిటో తెలుసుకుందాం.

తరచూ ఇన్‌ఫెక్షన్లు

జింక్ తగ్గటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీని వల్ల వైరస్, బ్యాక్టీరియాలపై రోగనిరోధక వ్యవస్థ సరైన పోరాటం చేయలేదు. దీనితో తరచు ఇన్‌ఫెక్షన్లు వస్తూ ఉంటాయి.

గాయాలు నెమ్మదిగా

గాయం మానాలంటే కణాల విభజన సక్రమంగా, చురుకుగా జరగాలి. ఈ రెండు ప్రక్రియలలోను జింక్ కీలకపాత్ర పోషిస్తుంది. జింక్ సరిగ్గా లేకపోతే గాయాలు త్వరగా మానవు.

జుట్టు ఊడిపోవటం

జింక్ తక్కువ ఉంటే జుట్టు ఊడిపోతూ ఉంటుంది. ఎవరికైనా జుట్టు ఊడిపోతుంటే జింక్ విలువలు ఎలా ఉన్నాయో తెలుసుకోవటానికి పరీక్షలు చేయించుకోవాలి.

ఆకలి మందగించటం

జింక్ తగ్గటం వల్ల రుచి, వాసన సరిగ్గా తెలియవు. దీని వల్ల ఆకలి తగ్గుతుంది. ఆకలి వేయకపోతే ఆహారం సరిగ్గా తినరు. దీని వల్ల తగినంత జింక్ లభించదు. ఇదంతా ఒక వలయంగా తయారవుతుంది.

చర్మ సమస్యలు

చర్మ ఆరోగ్యానికి జింక్ చాలా అవసరం. జింక్ సరిగ్గా లేకపోతే రకరకాల చర్మ సమస్యలు ఏర్పడే అవకాశముంది.

మెదడుపై

మెదడుపై కూడా జింక్ ప్రభావం చూపిస్తుంది. జింక్ సరిగ్గా లేకపోతే మెదడు సరిగ్గా పనిచేయదు. దీని వల్ల డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలు ఏర్పడతాయి.



రెండు నెలలు సందడే.. సందడి

తెలుగు చిత్ర పరిశ్రమలో రాబోయే రెండు నెలలు సందడి నెలకొననుంది. 'పుష్ప-2, డాకు మహారాజ్, కుబేర, గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం, సారంగ పాణి జాతకం' తదితర సినిమాలు విడుదల కానున్నాయి. వీటితోపాటు మరికొన్ని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ చిత్రాలపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టుగా సినిమాలు ఉంటే సరి. లేదంటే ప్రేక్షకుల్లో సినిమాల పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. థియేటర్లకు ప్రత్యామ్నాయంగా వారు ఓటీటీలను ఎంపిక చేసుకునే పరిస్థితులు ఏర్పడవచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నూట పాతికకు పైగా చిత్రాలు విడుదల కాగా వాటిలో కేవలం ఐదు శాతం మాత్రమే బాక్సాఫీసు వద్ద విజయాలను నమోదు చేశాయి.

'పుష్ప-2'తో మొదలు

ప్రపంచవ్యాప్తంగా అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'పుష్ప-2 ది రూల్'. సుకుమార్ డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా అల్లు అర్జున్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. విదేశాల్లో ఒక రోజు ముందుగా డిసెంబరు 4నే ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఓవర్సీస్‌లో ప్రీసేల్ బుకింగ్‌లో మిలియన్ డాలర్ల మార్క్‌ను చేరుకుంది. అమెరికన్ బాక్సాఫీసులో అత్యంత వేగంగా టికెట్ల ప్రీసేల్ ద్వారానే వన్ మిలియన్ డాలర్ల మార్క్‌ను చేరిన సినిమాగా 'పుష్ప-2' నిలిచింది. ఇంత భారీ అంచనాలు, ప్రీ బుకింగ్‌ల మధ్య రిలీజ్ అవుతోంది. ఈ సినిమా విజయం, దాని తర్వాత విడుదలవుతున్న చిత్రాలను ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఈ చిత్రం నచ్చితే దాని ఫీల్‌గుడ్‌తో ప్రేక్షకులు తదుపరి సినిమా చూడటానికి ఇష్టపడతారు. లేదంటే ఓటీటీలో వస్తుంది కదా, అప్పుడు చూడొచ్చులే అనే భావనలోకి వెళతారు.

వీటిపై భారీ అంచనాలు

నాగార్జున, ధనుష్, రష్మిక మందన ప్రధాన పాత్రధారులుగా నటించిన 'కుబేర' చిత్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా గ్లింప్స్‌లో ధనుష్ బిచ్చగాడిలా, నాగార్జున ప్రభుత్వ అధికారిగా కీలక పాత్రల్లో నటించారు. చాలా గ్యాప్ తరవాత డైరెక్టర్ శేఖర్ కమ్ముల భిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.



సంక్రాంతి పండగ వచ్చిందంటే నందమూరి అభిమానులు బాలయ్య సినిమా చూడాల్సిందే! వారి ఆశలకు అనుగుణంగానే 'డాకు మహారాజ్' చిత్రం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఓ వైపు ఫైనల్ షూటింగ్, మరో వైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్నారు మేకర్స్. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రేక్షకుల్లో అంచనాలను పెంచాయి. అందుకు కారణం.. బాలకృష్ణను మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో దర్శకుడు బాబీ చూపించబోతున్నారు. జనవరి 12న విడుదలవుతోంది.

'గేమ్ ఛేంజర్' షూటింగ్ దాదాపుగా పూర్తి అయినట్లే. దాంతో ఆల్ ఇండియా రేంజ్‌లో, ఓవర్సీస్ రేంజ్‌లో ప్రమోషనల్ ఈవెంట్స్‌కి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే లక్నోలో జరిగిన మెగా ఈవెంట్‌లో టీజర్‌ని రిలీజ్ చేశారు. దీనికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. దీంతో నేషనల్ వైడ్ బ్లాక్ బస్టర్ పక్కా అనే కాన్ఫిడెన్స్‌లో ఉంది చిత్ర బృందం. జనవరి 10న విడుదలవుతోంది.

వెంకటేష్- అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంపైనా ప్రేక్షకులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలకు భిన్నంగా క్రైమ్ ఎలిమెంట్స్‌తో ట్రయాంగిల్ స్టోరీగా తెరకెక్కిన చిత్రమిది. జనవరి 14న విడుదలవుతోంది.

అన్ని ఆటంకాలనూ అధిగమించి

స్వీయ దర్శకత్వంలో కంగన రనౌత్ నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. ఎన్నోసార్లు విడుదల వాయిదా పడుతూ వచ్చిన ఈ చిత్రం అన్ని ఆటంకాలను అధిగమించి వచ్చే ఏడాది జనవరి 17న విడుదలకు సిద్ధమవుతోంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. కంగన ఈ విషయంపై హత్యా బెదిరింపులను కూడా ఎదుర్కొన్నారు. భారతదేశంలో చీకటి రోజులుగా పిలిచే ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ఈ చిత్రంలో చూపించారు. ఇందులో కంగన ఇందిరాగాంధీ పాత్రలో కనిపించనున్నారు. పూర్తిగా రాజకీయ కోణంలో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో వేచి చూడాలి.

జాతకాల నేపథ్యంలో...

'జెంటిల్‌మెన్, సమ్మోహనం' వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సినిమా 'సారంగపాణి జాతకం'. కామెడీ జానర్‌లో రాబోతున్న ఈ సినిమాలో ప్రియదర్శితోపాటు శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిషోర్, హర్ష కీలకపాత్రల్లో నటించారు. సారంగపాణి జాతకం, జీవితం చుట్టూ తిరిగే ఫన్నీ ఎలిమెంట్స్‌తో చిత్రం తెరకెక్కినట్లు దీని టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. హీరో జాతకాలను బాగా నమ్ముతాడు.'మన జీవితం మొత్తం మన చేతిలోనే రాసి ఉంటుంది' అని చెబుతాడు. దాంతో ప్రేక్షకులు అమితాసక్తితో ఎదురు చూస్తున్నారు. డిసెంబరు 20న ఈ సినిమా విడుదలవుతోంది.

సంక్రాంతి సెంటిమెంట్

టాలీవుడ్‌లో సంక్రాంతి పండుగ సెంటిమెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు సినిమా వాళ్లకు సంక్రాంతి కీలకమైన సీజన్. కలెక్షన్లు కూడా అధికంగానే వసూళ్లు అవుతాయి. అందుకే నిర్మాతలందరూ ఈ సీజన్‌పై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తూ ఉంటారు. 2024 సంక్రాంతికి గుంటూరు కారం (మహేష్ బాబు), సైంధవ్ (వెంకటేశ్), నా సామిరంగ (నాగార్జున), హనుమాన్ (తేజ) సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో చిన్న సినిమాగా విడుదలైన 'హనుమాన్' ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. మిగతా సినిమాలు అంతగా ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి. అయితే ఈ సంక్రాంతికి గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం వంటి పెద్ద చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటిలో 'డాకు మహారాజ్' మినహా మిగిలిన రెండూ దిల్ రాజుకు చెందినవే.

ఇష్టానుసారంగా విభజన

వెంకటగిరి నియోజకర్గంలో ఆరు మండలాలు ఉండగా.. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లాలో ఉన్నాయి. మిగిలిన రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. అలాగే నగరి నియోజకవర్గంలో పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలో ఉండగా... నగరి, నింద్ర, విజయపురం మండలాలు చిత్తూరు జిల్లాలో ఉన్నాయి. ఇలా నియోజకవర్గాలు రెండు జిల్లాల పరిధిలో ఉండటంతో అభివృద్ధి పరంగా, రాజకీయపరంగా సమస్యలు ఎదురవుతున్నాయి. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సర్వేపల్లి సెగ్మెంట్ మొత్తం నెల్లూరు జిల్లాలో ఉంది. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో భాగమైన చంద్రగిరి సెగ్మెంట్ తిరుపతి జిల్లాలో ఉంది. రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు నియోజకవర్గాన్ని చిత్తూరు జిల్లాలో చేర్చారు. దీంతో ఎన్నికల సమయంలో అధికారులు ఇబ్బంది పడ్డారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాలను రాజకీయంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాబల్యం కోసం చేశారన్న విమర్శలు ఉన్నాయి.

రాజకీయ కోణంలో...

రాజంపేట జిల్లాకు అన్నమయ్య పేరు పెట్టారు. జిల్లా ప్రధాన కేంద్రంగా రాయచోటిని ఎంపిక చేశారు. ప్రజలు వ్యతిరేకించినా జగన్ రాజకీయ కోణంలో తన పార్టీ నాయకుల కోరిక మేరకు కొనసాగించారు. జగన్ కార్యాలయంలో పనిచేసిన ఓ కీలక అధికారిది కూడా అదే ప్రాంతం కావడం మరో కారణం. జిల్లా కేంద్రం కాబోతోందని తెలియడంతో వైసీపీ నేతలు, ఆ అధికారి భారీగా భూములు కొనుగోలు చేసి రియల్ వెంచర్లు వేశారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేయడం ప్రజల కన్నా వారికే మేలు చేసిందన్న విమర్శలున్నాయి.



కొలిక్కిరాని 'కార్యాలయాలు' (రేపటి సంచికలో)

(రేపటి సంచికలో)

జగన్ పెట్టిన జిల్లాల కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రమంతా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాలను వేర్వేరు జిల్లాలలో కలిపేశారు. ప్రతీ లోక్‌సభ స్థానాన్ని ఓ జిల్లాగా ఏర్పాటు చేస్తానన్న మాటను కూడా జగన్ నిలబెట్టుకో లేదు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలను మరో జిల్లాలో కలిపారు. ప్రజల సౌకర్యం గురించి ఆలోచించకుండా సుదూర ప్రాంతాలను కలిపి జిల్లాగా ఏర్పాటు చేశారు. ఇలా చెబుతూ పోతే జిల్లాల పునర్విభజనలో ఎన్నో లోపాలు ఉన్నాయి. చాలా జిల్లాలలో ఇదే పరిస్థితి. కొత్త జిల్లాల కేంద్రాలలో ఇప్పటికీ కార్యాలయాలు లేవు. నాడు జగన్ చేసిన తప్పులను సరిదిద్దుతామని ప్రతిపక్షనేతగా చంద్రబాబు పలు సభల్లో హామీ ఇచ్చారు. నాడు జిల్లాల విభజన ద్వారా జగన్ తెచ్చిపెట్టిన కష్టాల నుంచి కూటమి ప్రభుత్వం విముక్తి కల్పిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. జగన్ చేసిన తప్పిదాలను సరిదిద్దాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అడ్డగోలుగా విభజన

రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో 13 పెద్ద జిల్లాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ జిల్లాల ఏర్పాటు చట్టం-1974 ప్రకారం కొత్త జిల్లాలను ప్రజా ప్రయోజనాలు, పాలనా అవసరాల మేరకు ఏర్పాటు చేయాలి. ప్రాంతాల జనాభా, వెనుకబాటుతనం తదితర కారణాలను పరిగణనలోకి తీసుకోవాలి. రాజకీయ ప్రయోజనాలు, వాటి కారణాల ప్రాతిపదికన జిల్లాల విభజన జరగకూడదని చట్టం చెబుతోంది. బ్రిటీష్ పాలకులు కూడా ఈ నియమాన్ని పాటించారు. గ్రామాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణలో ఈ సూత్రమే ప్రామాణికం. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల ప్రజలకు దూరభారం తగ్గించాలి. జిల్లా కేంద్రానికి తక్కువ సమయంలో చేరుకునేలా ఉండాలి. కానీ 2022లో నాటి సీఎం జగన్ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకుసాగారు. సీఎస్ నేతృత్వంలో అధ్యయన కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ సిఫారసులను పక్కనపెట్టి, సొంత రాజకీయ అజెండాతో ముందుకెళ్లారు. 2022 జనవరిలో 26 జిల్లాలు ఏర్పాటు చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్‌లు ఇచ్చారు. జగన్ నిర్ణయాలపై తీవ్రస్థాయిలో ప్రజావ్యతిరేకత వచ్చింది. సొంత పార్టీ నేతలు, కేడర్ కూడా జిల్లాల విభజనను తప్పుపట్టారు. దీంతో ప్రజాభిప్రాయం తీసుకొని సవరణలు చేస్తామని ఓ పెద్ద నాటకానికి తెరలేపారు. జిల్లాలు, డివిజన్ల కూర్పును సవరించాలని వచ్చిన 18 వేల విన్నపాలను జగన్ బుట్టదాఖలు చేశారు. సొంత పార్టీ నేతలు, అందులోనూ సొంత కోటరీ చెప్పినట్టు చేశారు. తనకు ఇష్టం వచ్చినట్లుగా, ఓ రాజు తరహాలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తూ జిల్లాల విభజనపై ఏప్రిల్‌లో తుది నోటిఫికేషన్‌లు ఇచ్చారు. ఆ తర్వాత కూడా సొంత మనుషుల సిఫారసుల మేరకు కొత్త డివిజన్‌లు ఏర్పాటు చేశారు. 13 జిల్లాలను 26కి పెంచారు. 65 రెవెన్యూ డివిజన్లను 77 చేశారు. వికేంద్రీకరణ పేరిట ప్రజలకు తీవ్ర కష్టాలు కొనితెచ్చిపెట్టారు. మచ్చుకు కొన్ని ఉదంతాలు...



అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో ఓ ప్రైవేటు పంక్షన్ హాలులో నడుస్తున్న ఎస్పీ కార్యాలయం

జిల్లా కేంద్రం 250 కి.మీ. దూరంలో

కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు దూరాభారం తగ్గాలి. కానీ రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లలోని 11 మండలాల ప్రజలు తమకు లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడేరు కేంద్రంగా పాడేరుతో పాటు ఈ రెండు రెవెన్యూ డివిజన్లతో అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేశారు. రంపచోడవరం డివిజన్ నుంచి పాడేరు 245 కి.మీ. దూరంలో ఉంది. పునర్విభజనకు ముందు జిల్లా కేంద్రం కాకినాడకు చేరుకోవాలంటే 80 నుంచి 180 కి.మీ. వెళ్తే సరిపోయేది. ఇప్పుడు పాడేరుకు వచ్చి వెళ్లాలంటే ఒక రోజు పడుతుంది. చింతూరు డివిజన్ వాసులదీ ఇదే పరిస్థితి. పాడేరుకు వెళ్లాలంటే 250 కి.మీ. దూరం ప్రయాణించాలి. ఈ రెండు డివిజన్లు దూరంగా ఉండడంతో జిల్లా అధికారులు కూడా పాడేరు డివిజన్‌కే పరిమితమవుతున్నారు.

అటూ.. ఇటూ

సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలాన్ని తొలుత పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిడితో విజయనగరం జిల్లాలో చేర్చారు. దీంతో మెంటాడ మండలం సాలూరు నియోజకవర్గంలో ఉన్నా మన్యం జిల్లాతో ఎటువంటి సంబంధం లేదు. ఆ మండల ప్రజలు పాలనాపరంగా ఇబ్బందులు పడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాను పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాలు, వాటి పరిధిలో ఉన్న 15 మండలాలతో ఏర్పాటు చేశారు. పాలకొండ నియోజకవర్గంలో భామిని, సీతంపేట, పాలకొండ మండలాల ప్రజలు జిల్లా కేంద్రం పార్వతీపురానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూరాభారంతో పాటు వ్యయ ప్రయాసలు భరించాల్సి వస్తోంది. ఇక పాలకొండ డివిజన్ పరిధిలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల ప్రజలు డివిజన్ కేంద్రం పాలకొండ వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. గతంలో పార్వతీపురం డివిజన్‌లో ఉన్న ఈ మండలాలను కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత పాలకొండ డివిజన్‌లో కలిపారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పెందుర్తి.. 2 ముక్కలు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం రెండు ముక్కలైంది. పెందుర్తి మండలాన్ని విశాఖ జిల్లాలో, సబ్బవరం, పరవాడ మండలాలను అనకాపల్లి జిల్లాలో చేర్చారు. నియోజవర్గంలో అభివృద్ధి పనుల విషయంపై ఎమ్మెల్యే రెండు జిల్లాల అధికారులను కలవాల్సి ఉంటుంది. ఇక పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉంది. ఎంపీ కూడా రెండు జిల్లాల అధికారులను కలవాల్సి ఉంటుంది.

అంతా గజిబిజి

విజయనగరం జిల్లాను ప్రాంతీయ, సామాజిక మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏర్పాటు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జిల్లాలను విభజించినట్టు గత వైసీపీ ప్రభుత్వం చెప్పింది. దీని ప్రకారం ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గాన్ని విజయనగరం పరిధిలోకి తేవాలి. కానీ శ్రీకాకుళం జిల్లాలో ఉంచింది. అలాగే ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గం విశాఖ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉంది. కానీ విజయనగరం జిల్లాలోనే కొనసాగించింది. ఆ నియోజకవర్గ ప్రజలు ఏమో విశాఖ జిల్లాలో కలపాలని కోరారు.



విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నడుస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం

విజయవాడ నుంచి విడదీసి...

పెనమలూరు, గన్నవరం మండలాలు విజయవాడకు ఆనుకుని ఉంటాయి. ఈ ప్రాంత వాసులకు విజయవాడతో అనుబంధం ఎక్కువ. అయితే ఈ రెండు మండలాలను విజయవాడతో సంబంధం లేకుండా 70 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా జిల్లాలో కలిపారు. విజయవాడ నుంచి విడదీయవద్దని, ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని 2,500 అభ్యంతరాలు వచ్చినా పట్టించుకోలేదు. గన్నవరంలోని అంతర్జాతీయ విమానాశ్రయం కృష్ణా జిల్లా పరిధిలోకి వెళ్లింది. వాస్తవానికి ఇది విజయవాడ విమానాశ్రయం. విమానాశ్రయంలో ప్రొటోకాల్ విధులు నిర్వహించటానికి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి తేలిగ్గా ఉంటుంది. జిల్లాల పునర్విభజనతో దూరంగా ఉన్న మచిలీపట్నం నుంచి ఉన్నతాధికారులు రావాల్సి వస్తోంది. గన్నవరం విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉంది. అయినా అడ్డగోలుగా విభజించేశారు.



ప్రజాభీష్టానికి భిన్నంగా...

బాపట్ల జిల్లాలో అద్దంకి నియోజకవర్గ ప్రజలు జిల్లా కేంద్రానికి రావాలంటే దాదాపు 3గంటలు ప్రయాణం చేయాలి. అప్పట్లో ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. జిల్లా కేంద్రంగా చీరాలను చేయాలనే డిమాండ్‌ను కొన్ని రాజకీయ పక్షాలు చేశాయి. తద్వారా జంట నగరాలుగా బాపట్ల, చీరాల అభివృద్ధి చెందుతాయని, అద్దంకి వాసులకు దూరం తగ్గుతుందనే వాదనను తెచ్చారు. కానీ ఇవేవీ పట్టించుకోకుండా అశాస్త్రీయంగా జిల్లాను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ పాలనా పరమైన చిక్కులు తొలగకపోగా, భవిష్యత్తులో రాజకీయ పరమైన డిమాండ్లు ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి.



అభివృద్ధికి విఘాతం

జిల్లాల పునర్విభజన కోనసీమ అభివృద్ధికి అవరోధంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. చమురు సంస్థ ద్వారా రావాల్సిన నిధులు పక్క జిల్లాకు వెళ్తున్నాయి. దేశంలోనే అత్యధిక చమురు, సహజ వాయువులను ఉత్పత్తి చేసే గాడిమొగలోని రిలయన్స్, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్లు ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్లరేవు మండలంలో ఉన్నాయి. వాటిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కాకుండా కాకినాడ జిల్లాలో విలీనం చేశారు. దీంతో కోనసీమ అభివృద్ధిలో కీలకమయ్యే సీఎస్ఆర్ ఫండ్స్ కాకినాడకు వెళ్లిపోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాంతం ఓ జిల్లా.. నేతలు మరో జిల్లా



రాజమహేంద్రవరం బొమ్మూరులో ఉన్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం

రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలో ఉంది. దీని పరిధిలోని పెదపూడి మాత్రం కాకినాడ జిల్లాలో ఉంది. ఎమ్మెల్యే, ఎంపీ తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన వారు. చిన్న సమస్య అయినా ప్రజాప్రతినిధులు కాకినాడకు వెళ్లవలసిన పరిస్థితి. ఇక చిన తిరుమలగా ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమల ఏలూరు జిల్లాలో ఉంది. ఎమ్మెల్యే, ఎంపీ మాత్రం తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉన్న మండపేట నియోజకవర్గ ప్రజలకు రాజమండ్రి దగ్గర. కానీ చాలా దూరంలోని కోనసీమలో కలిపారు.

గిరిజనుల సుస్థిరాభివృద్ధికి ప్రణాళికలు

- అరుదైన అటవీ ఉత్పత్తుల గుర్తింపు, మార్కెటింగ్, బ్రాండింగ్‌పై దృష్టి
- అటవీ శాఖ, అటవీ అభివృద్ధి సంస్థ, బీఐపీపీల మధ్య ఎంవోయూ

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనుల జీవన శైలి మార్చేందుకు, వారిని ఆర్థిక ప్రగతి దిశగా నడిపించేందుకు అటవీ శాఖ సరికొత్త ప్రణాళికతో ముందుకెళ్తోంది. అరుదైన అటవీ ఉత్పత్తుల గుర్తింపుతో పాటు కార్పొరేట్ స్థాయి మార్కెటింగ్ ద్వారా వారి జీవన స్థితిగతులు మెరుగుపర్చేందుకు ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకంలో పటిష్ఠ ప్రణాళిక తయారైంది. దీనిలో భాగంగా రాష్ట్ర అటవీ శాఖ, అటవీ అభివృద్ధి సంస్థ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలోని భర్తీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(బీఐపీపీ) సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. శుక్రవారం మంగళగిరిలోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో ఒప్పంద పత్రాలపై ఈ మూడు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం కలప ఉత్పత్తులను మినహాయించి, ఇతర నాణ్యమైన, అరుదైన అటవీ ఉత్పత్తులకు అదనను విలువ జోడించి, మార్కెటింగ్, బ్రాండింగ్ చేయడంపై దృష్టి పెట్టనున్నారు. పర్యావరణ హితంగా డిజిటల్, జియోస్పాషియల్ సాంకేతికత ఆధారంగా అరుదుగా దొరికే ఉత్పత్తులను గుర్తించనున్నారు. ప్రాజెక్టులో ఆయా ప్రాంతాల్లోని గిరిజన మహిళలను భాగస్వాములను చేసి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తారు. దీనిపై అటవీ ముఖ్య దళాధికారి చిరంజీవ్ చౌదరి మాట్లాడుతూ, 'అడవి పుత్రుల ఆర్థిక ప్రగతికి ఈ ఒప్పందం గేమ్ ఛేంజర్ అవుతుంది. అటవీ ఉత్పత్తుల ద్వారా సంపద సృష్టి భారీగా పెరుగుతుంది' అని అన్నారు. 40% గిరిపుత్రులు అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఈ ఎంవోయూతో వారికి మేలు జరుగుతుందని ఎఫ్‌డీసీ ఎండీ రాజేంద్ర ప్రసాద్ కజూరియా చెప్పారు.

6 నుంచి కృష్ణవేణి సంగీత నీరాజనం ఉత్సవాలు

న్యూఢిల్లీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 6 నుంచి 8 వరకు విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం 2024 పేరుతో సంగీత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఉత్సవాల్లో కర్ణాటక సంగీతానికి ఆంధ్రప్రదేశ్ అందించిన సేవలు, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆడిటోరియం, దుర్గాఘాట్, కనకదుర్గ ఆలయంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ముందస్తుగా(ప్రీక్వెల్ ఈవెంట్స్) కూడా శనివారం నుంచి పలువురు కళాకారులతో అరసవల్లి, రాజమండ్రి, మంగళగిరి, అహోబిలం, తిరుపతిలో ప్రారంభిస్తున్నారు.

కేజీబీవీల్లో డైట్ చార్జీలు రూ.1600కు పెంపు

- ఉత్తర్వులు జారీ.. లక్ష మంది విద్యార్థులకు ప్రయోజనం

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచుతూ సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి రూ.1400 ఇస్తుండగా దానిని రూ.1600కు పెంచినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లోని 1.1లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. డైట్ చార్జీలతో విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నారు.

రోజా... ఎక్స్‌లో నాపై రాయిస్తున్నదెవరు?



- అధిక ధరకు కొనడం భారం కాదా?
- నిజాన్ని దాచలేరు.. లంచం తీసుకున్నది నిజం: షర్మిల

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 'గౌరవ మాజీ మంత్రి రోజా... ఇంతకూ నాపై ఎక్స్ వేదికగా రాతలు రాయిస్తున్నదెవరు?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. 2022లో సోలార్ విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.2.14 పలికిందంటూ నేను చేసిన ట్వీట్‌పై బదులు ఇవ్వడంలో తెర వెనుక ఎవరున్నారు? అని ఆమె నిలదీశారు. శనివారం ఎక్స్ వేదికగా షర్మిల స్పందించారు. 'ఇవి మీ రాతలేనా? సాక్షి పంపిన స్క్రిప్టా? లేదంటే సకల శాఖల మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి రాసినవా? దేశంలో సోలార్ విద్యుత్తు ధరలు గణనీయంగా తగ్గుతుంటే.. 25 ఏళ్లకు సెకీతో ఎందుకు కాంట్రాక్టు కుదుర్చుకున్నారు? ఐదేళ్ల తర్వాత సోలార్ విద్యుత్తు యూనిట్ రూ.1.50కే పడిపోవచ్చునేమో? ఇతర రాష్ట్రాల ఒప్పందాలను సమీక్షించకుండా, ఏకపక్షంగా అదానీ వద్ద రూ.2.49కు ఎందుకు కొన్నారు? అదానీ మీద మీకు అంత ప్రేమ ఎందుకు? 2020లో గుజరాత్‌లో సోలార్ విద్యుత్తు ధర రూ.1.99 మాత్రమే. వెనుకబడ్డ ఆంధ్రప్రదేశ్ అదానీ నుంచి 2021లో 50 పైసలు ఎక్కువగా పెట్టి ఎందుకు కొనాల్సి వచ్చింది? ఇది రాష్ట్రం నెత్తిన అధిక భారం మోపినట్లు కాదా? అదానీతో చేసుకొన్న కొనుగోలు ఒప్పందం వల్ల యూనిట్ రూ.2.49కే వస్తుందని చెప్పినా .. వీలింగ్ చార్జీలు, జీఎస్టీ అన్నీ కలిపి రూ.4.46 పడుతుందని విద్యుత్తు అధికారులే చెబుతుండటంపై ఏం సమాధానం చెబుతారు? 2019లో అధికారంలోకి వచ్చాక చంద్రబాబు హయాంలో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయడంలో మర్మమేమిటి? నిజాన్ని దాచలేరు. రూ.1,750 కోట్ల లంచం తీసుకున్నది వాస్తవం' అని తేల్చి చెప్పారు.

ఆర్టీసీకి స్కోచ్ అవార్డు

జాతీయ స్థాయిలో జారీ చేసే 'స్కోచ్' అవార్డు 2024ను ఏపీఎస్ఆర్టీసీ అందుకుంది. నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టికెట్ల జారీకి యాప్ సౌలభ్యం, డిజిటల్ టికెట్ల జారీ, అన్ని ఆర్టీసీ బస్సులకూ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రతిభ చూపినందుకు అవార్డు దక్కిందని ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. శనివారం ఢిల్లీలో ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు(ఐటీ) ఈ అవార్డు అందుకున్నారు.

తొమ్మిదిసార్లు విద్యుత్తు చార్జీలు పెంచినందుకు సన్మానం చేయాలా?

- మంత్రి గొట్టిపాటి



అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తొమ్మిదిసార్లు విద్యుత్తు చార్జీలను పెంచి.. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు పేర్లతో ప్రజలను బాదేసినందుకు సన్మానం చేయాలా? అని మాజీ సీఎం జగన్‌ను విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశ్నించారు. శనివారం ఆయన అమరావతిలో మీడియాతో మాటాడారు. 'జగన్.. రాష్ట్రానికి పనికొచ్చే పనులు ఏం చేశారు? వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు. ఆయన అవినీతి కార్యకలాపాలతో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కు వెళ్లిపోయింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్తు వ్యవస్థపై రూ.లక్షల కోట్ల ఆర్థిక భారం పడింది' అని మంత్రి గొట్టిపాటి విమర్శించారు.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రంలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్తు సంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఉద్యోగులకు మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. శనివారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో పాటు ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్తు షాక్‌తో ఏ ఒక్కరి ప్రాణమూ పోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్తు పోల్స్, తీగలను అందుబాటులో ఉంచుకోవాలని ట్రాన్స్‌కో, డిస్కమ్‌లను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.

4న పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ సర్వే

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ సర్వేను డిసెంబరు 4న నిర్వహించనున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేసి, వారి సామర్థ్యాలను పెంపొందించేందుకు జాతీయ స్థాయిలో ఈ సర్వే చేపడుతున్నట్లు వివరించారు.

2 గంటల్లోనే రైతుకు ధాన్యం డబ్బులు



ధాన్యం డబ్బులు జమ కావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్న రైతు గోవిందు (మధ్యలో వ్యక్తి)

జగ్గంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లి గ్రామానికి చెందిన ఆచంట గోవిందు అనే రైతు 10 ఎకరాల్లో పండించిన వరి పంటను శుక్రవారం రైతు భరోసా కేంద్రానికి విక్రయించాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ధాన్యం విక్రయించినట్టుగా వేలి ముద్ర వేయగా.. ఆ తర్వాత సాయంత్రం 3 గంటల సమయంలో ఆయన బ్యాంకు ఖాతాలో సుమారు రూ.6 లక్షలు జమయ్యాయి. కేవలం రెండు గంటల్లోనే ధాన్యం విక్రయించిన డబ్బులు ఖాతాలోకి పడటంపై రైతు గోవిందు ఆనందం వ్యక్తం చేశారు.

డిసెంబరులో ఇస్రో బిజీ బిజీ..!

- 20 రోజుల్లో రెండు పీఎస్ఎల్వీ ప్రయోగాలు

సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇస్రో డిసెంబరులో రెండు పీఎస్ఎల్వీ రాకెట్ల ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. శ్రీహరికోట ఈ ప్రయోగాలకు వేదిక కానుంది. ఈ నెల 4న నిర్వహించే పీఎస్ఎల్వీ-సీ59 ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహంతో పాటు మరో నాలుగు చిన్న శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెట్టనుంది. సూర్యుడి వాతావరణం, సౌర కరోనాను అధ్యయనం చేయడం ప్రోబా-3 మిషన్ లక్ష్యం. గతంలోనూ ఈఎస్ఏకు చెందిన ప్రోబా-1 (2001), ప్రోబా-2 (2009)లను కూడా ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. 24న పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం చేపట్టేందుకు కూడా ఇస్రో సన్నాహాలు చేస్తోంది. ఈ రాకెట్ ద్వారా రీశాట్-1బీ ఉపగ్రహంతో పాటు మరో నాలుగు విదేశీ ఉపగ్రహాలను రోదసీలోకి పంపనుంది.

ప్రోబా-3తో సౌర కరోనా అధ్యయనం

దాదాపు 200 మిలియన్ యూరోలతో అభివృద్ధి చేసిన ప్రోబా-3 మిషన్ రెండేళ్లపాటు కొనసాగనుంది. దీనిలో ఓక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్, కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్ అనే ఉపగ్రహాలు ఉన్నాయి. ప్రయోగం అనంతరం కక్ష్యలో ఈ రెండూ విడిపోయినప్పటికీ కచ్చితమైన సమన్వయంతో పనిచేస్తాయని, రెండూ కలిసి సోలార్ కరోనాగ్రాఫ్‌ను ఏర్పరుస్తాయని ఈఎస్ఏ వర్గాలు వెల్లడించాయి. ప్రోబా-3లోని ఏఎస్‌పీఐఐసీఎస్ పరికరం సూర్యుని లోపలి, బాహ్య కరోనా వీక్షణను అందిస్తుంది. దీనిలో ఉండే 1.4 మీటర్ల డిస్క్ కరోనాను నిశితంగా పరిశీలించడానికి ఉపయోగపడుతుంది. డిజిటల్ అబ్సల్యూట్ రేడియోమీటర్ సూర్యుడి శక్తి ఉత్పత్తిని నిత్యం కొలుస్తుంది.

భారత్‌కు ప్రయోజనం ఏమిటి..?

ప్రోబా-3ని ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెడితే.. తక్కువ ఖర్చుతోనే అంతరిక్ష ప్రయోగ సేవలందించే సంస్థగా నమ్మకం పెరగనుంది. అలాగే ఈ మిషన్ అందించే డేటా భారత శాస్త్రవేత్తలకు కూడా ఉపయోగపడనుంది. కొంతమంది భారతీయ పరిశోధకులు ఇప్పటికే బెల్జియం శాస్త్రవేత్తలతో కలిసి ప్రోబా-3 మిషన్ కోసం పనిచేశారు. సౌర అధ్యయనంలో కొత్త కోణాలను ఆవిష్కరించేందుకు ఇది అవకాశం కల్పిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

అదానీతో ఒప్పందాలన్నీ అక్రమమే

» ముడుపులు తీసుకున్నవారిపై చర్యలేవీ: అజశర్మ

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అదానీ సంస్థతో వైసీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ అక్రమమేనని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఆరోపించారు. శనివారమిక్కడ సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో గౌతమ్ అదానీ గత ప్రభుత్వ పెద్దలకు ముడుపులు చెల్లించినట్టు అమెరికా న్యాయ వ్యవస్థ పది రోజుల క్రితం బయటపెట్టిందని, అయినా ఇప్పటి వరకు ముడుపులు పుచ్చుకున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. జీవీఎంసీ కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అల్లూరి జిల్లాలో ఉన్న భూములన్నీ అదానీకి కట్టబెట్టిందన్నారు. మోదీ తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టం అమలుకు రాష్ట్రంలోని 3 పార్టీలు మద్దతివ్వడంతో నేడు ఆ భారాన్ని ప్రజలు మోయాల్సి వస్తోందని మండిపడ్డారు.

వక్ఫ్ బోర్డు నియామకం రద్దు

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, నిర్వహణ, మైనార్టీ సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా చర్యలు చేపడుతోందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఇందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జారీ చేసిన జీవో 47ను ఉపసంహరిస్తూ.. ప్రభుత్వం శనివారం జీవో 75ను జారీ చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వక్ఫ్‌బోర్డు ఎలెక్టెడ్ మెంబర్లు, నామినేటెడ్ మెంబర్ల ఎంపిక విషయంలో అప్పట్లోనే హైకోర్టులో పిటిషన్లు దాఖలవ్వడంతో, విచారణ జరిపిన కోర్టు.. వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎన్నికపై స్టే ఇచ్చిందన్నారు. దీంతో బోర్డు నియామకం లేక 13 నెలలుగా పరిపాలన శూన్యత ఏర్పడిందన్నారు. త్వరలో కొత్త బోర్డును నియమిస్తూ ఉత్తర్వులిస్తామన్నారు.

ఒక రోజు ముందుగానే పింఛన్

» తొలి రోజే 94.54% పంపిణీ పూర్తి... వర్షంలోనూ 'భరోసా'

» భర్త చనిపోతే మరుసటి నెలలోనే భార్యకు వితంతు పెన్షన్

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కానుక ఈసారి ఒక రోజు ముందుగానే అందింది. డిసెంబరు 1న ఆదివారం కావడంతో సచివాలయ ఉద్యోగుల విధులకు ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 63.92 లక్షల మంది సామాజిక పింఛనుదారులకు గానూ శనివారం సాయంత్రానికి 60.53 లక్షల మందికి (94.54 శాతం) పెన్షన్ అందజేశారు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో వర్షాలు తీవ్రంగా ఉన్నప్పటికీ సచివాలయ ఉద్యోగులు ఇంటింటికెళ్లి పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లాలో 93.75 శాతం, తిరుపతిలో 92.04 శాతం, నెల్లూరులో 92.01 శాతం పంపిణీ పూర్తిచేశారు. కాగా.. వితంతు పింఛన్‌పై ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. వృద్ధాప్య పెన్షన్ తీసుకునే భర్త మరణిస్తే.. వెంటనే భార్యకు పెన్షన్ మంజూరయ్యేలా నిర్ణయించింది. భర్త 1న గానీ, ఆ తర్వాత కానీ మరణిస్తే ఆ మరుసటి నెల నుంచి పెన్షన్ అందజేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

2030 నాటికి సోలార్ విద్యుత్ రూ.1.90కే!

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 2030 నాటికి సోలార్ విద్యుత్ యూనిట్ రూ.1.90కే లభిస్తుందని 'ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (టెరీ) స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎనర్జీ వరల్డ్' వెబ్‌సైట్ శనివారం టెరీ అధ్యయన నివేదికను బహిర్గతం చేసింది. రాష్ట్రంలో సెకీతో రాష్ట్ర ప్రభుత్వం యూనిట్ రూ.2.49 చొప్పున 25 ఏళ్లకు చేసుకున్న కొనుగోలు ఒప్పందమే బ్రహ్మాండమైనదని ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. ఇందుకు విరుద్ధంగా 2030 నాటికి దేశవ్యాప్తంగా యూనిట్ సోలార్ విద్యుత్ రూ.1.90కి దిగివస్తుందని టెరీ అధ్యయన నివేదికలో పేర్కొంది. విద్యుత్ రంగంలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, ఫలితంగా యూనిట్ సౌర విద్యుత్ ధర రూ.1.75 నుంచి రూ.1.65 దాకా నిలకడగా ఉండే వీలుందని తెలిపింది.

గుడ్డు ధర పైపైకి.. రిటైల్‌లో రూ.6.50

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర పెరుగుతోంది. ఆదివారం మార్కెట్‌లో హోల్‌సేల్ ధర రూ.5.90గా నెక్ (నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ) నిర్ణయించింది. దీంతో రిటైల్‌లో రూ.6.50 నుంచి రూ.7కు విక్రయించే అవకాశం ఉంది. ఏటా శీతాకాలంలో గుడ్డు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఉత్తర, తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతులు పెరుగుతాయి. ఇదే సమయంలో క్రిస్మస్, న్యూఇయర్ కేకుల తయారీ కోసం గుడ్లు భారీగా సిద్ధం చేసుకుంటుంటారు. ఈ నేపథ్యంలో 2 వారాల నుంచి రేటు క్రమేపీ పెరుగుతూ వస్తోంది. చలికాలం ముగిసే వరకూ గుడ్డుకు గిరాకీ ఉంటుందని, రేటు మరింత పెరగవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి.



మాఫియా

అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ప్రజావేదికలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కనే తెరిచి ఉంచిన దుకాణాలు



నేమకల్లులో రుద్రమ్మకు పింఛను అందజేస్తున్న సీఎం చంద్రబాబు

భరతం పడతా!

అనంతపురం నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో భూ మాఫియా, గంజాయి మాఫియా పేట్రేగిపోయాయని.. వాటికి అడ్డుకట్టవేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇక నుంచి ఎవరైనా భూ కబ్జాలు, గంజాయి పెంపకం, అమ్మకాలకు పాల్పడితే తాట తీస్తామని హెచ్చరించారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన 'ప్రజా వేదిక-పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో రుద్రమ్మ ఇంటికి వెళ్లి రూ.4 వేలు పింఛన్ సొమ్ము అందజేశారు. వారి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు. సమస్యలడిగి తెలుసుకున్నారు. రుద్రమ్మకు ఇంటితోపాటు గొర్రెల యూనిట్‌ను మంజూరు చేయాలని కలెక్టర్‌ను అక్కడికక్కడే సీఎం ఆదేశించారు. తర్వాత అదే కాలనీలోని దివ్యాంగురాలు బోయ భాగ్యమ్మ ఇంటికి వెళ్లి, రూ.15 వేలు పింఛన్ సొమ్ము అందజేశారు. అనంతరం ప్రజావేదికలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూ మాఫియా, గంజాయి మాఫియా లేకుండా చేస్తామన్నారు. వారి భరతం పడతానని స్పష్టంచేశారు. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని.. ప్రజల భూములు కాపాడేందుకు యాంటీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తీసుకొచ్చామని చెప్పారు.

మద్యం దోపిడీకి అడ్డుకట్ట వేశామని.. ఎక్కడైనా బెల్టుషాపులు పెడితే బెల్టు తీస్తామని తేల్చిచెప్పారు.

> "మద్యం తయారీ నుంచి షాపుల్లో అమ్మే వరకు వాళ్ల మనుషులను పెట్టుకుని దోచుకున్నారు. మద్యం ఆదాయాన్ని సొంత ఖజానాకు మళ్లించుకున్నారు. గత ఐదేళ్లలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యమయ్యాయి.. తవ్వే కొద్దీ తప్పులు, అప్పులు, అవినీతి బయటపడుతున్నాయి. వాళ్లు చేసిన పాపాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి." - సీఎం చంద్రబాబు

మద్యం జోలికి నాయకులెవరూ ఎవరూ వెళ్లకూడదని స్పష్టం చేశారు. తహసీల్దారు కార్యాలయాలు, ఆస్పత్రులనూ తాకట్టుపెట్టి రుణాలు తెచ్చారని.. ఇలా చాలా దుర్మార్గమైన కార్యక్రమాలు చేశారని దుయ్యబట్టారు.

ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లండి..

ఇసుక ప్రకృతి ఇచ్చిన వరం. గత పాలకులు దీనిపైనా వ్యాపారం చేశారు. అక్రమంగా రూ.వేల కోట్లు సంపాదించుకున్నారు. మీ ఊర్లోని ఇసుకను ట్రాక్టర్‌తో మీరే తీసుకెళ్లండి. ఎవరైనా అడ్డువస్తే నా పేరు చెప్పండి. నిలదీయండి.. అవసరమైతే తాటతీస్తామని చెప్పండి. గంజాయి, డ్రగ్స్‌తో పిల్లలు ఏమైపోతారోనని భయం వేస్తోంది. గత ఐదేళ్లలో విశాఖను గంజాయి రాజధానిగా చేసి.. ఎక్కడ చూసినా గంజాయి పంట పండించారు. గంజాయి సాగుపై డ్రోన్స్ ద్వారా డేగ కన్ను పెట్టాం. ఎవడైనా గంజాయి పండించినా.. విక్రయించినా అదే వారికి చివరి రోజు అవుతుంది. ఖబడ్దార్! పేద వాళ్లకు అందించే రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి విదేశాలకు అక్రమంగా తరలిస్తున్నారు. అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

'వైసీపీ ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన వ్యవస్థలన్నింటినీ గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యాం. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు. రు.10 లక్షల కోట్ల అప్పులు చేశారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు ఇవ్వలేదు. ఇప్పుడు రూ.లక్షల కోట్ల అప్పులున్నా.. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలిస్తున్నాం. పింఛన్ సొమ్మును రూ.4వేలకు పెంచి ప్రతి నెలా 1నే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నాం. మహిళల కన్నీళ్లు తుడిచేందుకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూనే.. అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం. విజన్-2047 అమలు చేస్తున్నాం. 2047 వచ్చేనాటికి మన రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉంటుంది. ఇష్టానుసారంగా అప్పులు చేశారు. ఎన్ని పాపాలు చేయాలో అన్నీ చేశారు. అందుకే రాష్ట్రం దివాలా తీసింది. దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలోపెట్టి మళ్లీ రాష్ట్రాన్ని గట్టెక్కిస్తా.

ఫోన్ చేస్తా.. వాస్తవాలు చెప్పండి..

అన్ని సేవలూ మీకు అందిస్తాం. నేను ఫోన్ చేసి అడిగినప్పుడు మనస్సాక్షిగా వాస్తవాలు చెప్పండి. తప్పులు చెప్పొద్దు. ఒకవేళ అబద్ధాలు చెబితే నేను కనిపెడతా. కృత్రిమ మేధ (ఏఐ) వచ్చింది. నువ్వు వాస్తవం మాట్లాడుతున్నావా.. రాజకీయం మాట్లాడుతున్నావా... తేల్చేస్తుంది. ధాన్యం సేకరణకు సంబంధించి వాట్సాప్‌లో మెసేజ్ పెడితే ధాన్యం కొనుగోలు చేసి, 48 గంటల్లో వారికి ఇవ్వాల్సిన డబ్బులు అందిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితంగా ఇస్తాం. ఉచితంగా సోలార్ ప్యానెల్స్ అందజేస్తాం. కుటుంబంలో భర్తను కోల్పోయిన వారికి తక్షణమే పింఛన్ అందించేలా చర్యలు తీసుకుంటాం. అధికారులు పింఛన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు.

రాష్ట్రాన్ని గుంతల మయం చేశారు

వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని గుంతలమయం చేసిపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,500 కోట్లతో 30 వేల పనులకు శ్రీకారం చుట్టాం. సంక్రాంతిలోగా ఆ పనుల పూర్తికి కృషి చేస్తున్నాం. సీమను రతనాల సీమగా మార్చే బాధ్యత మాది. హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలున్నా ఎన్నికల్లో పోటీకి అర్హులే. జనాభాను మనం పెంచుకోవాలి.. జనాభానే మన ఆస్తి. బీసీలకు పుట్టినిల్లు టీడీపీయే. వారికి న్యాయం చేసే బాధ్యత మాది అంటూనే వివిధ వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చంద్రబాబు వివరించారు.

ఇంకా ఎన్నికల వేడి తగ్గలేదు..!

చంద్రబాబు ఇందిరమ్మ కాలనీ నుంచి కాలినడకన ఆంజనేయ స్వామి ఆలయం, ప్రజా వేదికకు వెళ్లే మార్గంలో గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించి, వారితో ఫోటోలు దిగారు. 'చంద్రన్నా... టీవీలో మిమ్మల్ని చూశాం. ఇప్పుడు నేరుగా చూస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని మహిళలు అన్నారు. నేమకల్లు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యుల పేరిట అర్చన చేయించారు. ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేసి ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. శాలువా కప్పి, పూల మాల వేసి సన్మానించారు. నేమకల్లు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. అక్కడి నుంచి ప్రజావేదికకు చేరుకున్న చంద్రబాబు.. 'తమ్ముళ్లూ.. హుషారుగా ఉన్నారా..? ఆడబిడ్డలూ బాగున్నారా' అని ఆప్యాయంగా పలకరించారు. 'మీ ఉత్సాహం చూస్తుంటే ఇంకా ఎన్నికల వేడి తగ్గలేదనిపిస్తోంది. మీకున్న ఈ ఉత్సాహం... ఆనందం.. ఈ జోష్ భవిష్యత్‌లో శాశ్వతంగా ఉండేలా పనిచేస్తున్నాను' అని అన్నారు. నేను రాజకీయాల్లో 45 సంవత్సరాలుగా ఉన్నాను. ఎన్నడూ ఇవ్వనంత గెలుపును ప్రజలు ఇచ్చారు.

బాబు వచ్చాడు.. జాబ్ గ్యారెంటీ!

» వచ్చే 5 నెలల్లో 4 లక్షల ఉద్యోగాలు

'బాబు వస్తే.. జాబు వస్తుందని చాలా సార్లు చెప్పాను. మా తమ్ముళ్లు నాపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. అందుకే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చే పరిశ్రమలకు ఎక్కువ ప్రోత్సాహకాలు ఇస్తాం. ఒకప్పుడు ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నాను. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నాను. 5 నెలల్లో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడితో 4 లక్షల ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత నాది. నైబర్‌హుడ్ పద్ధతి తీసుకొస్తున్నాం. సెల్ ఫోన్ ద్వారా పని నేర్చుకుని డబ్బులు సంపాదించే మార్గం చూపిస్తాం. యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తాం. వర్క్‌ఫ్రం హోం ద్వారా పనులు కల్పించేందుకు చొరవ చూపుతాం. ఆడ బిడ్డలు ఇంట్లో ఉంటూనే ఐదారు గంటలు పనిచేయగలితే డబ్బులు సంపాదించే పనులకు శ్రీకారం చుడతాం. సీఎంగా బాధ్యతలు తీసుకున్న వెంటనే నేను చేసిన 5 సంతకాల్లో మెగా డీఎస్సీ ఫైలు ఉంది. త్వరలో పిల్లందరికీ ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటా.

జగన్ పేరు లేదా?

» నివేదికను ఆసాంతం ఆయన చదవాలి

» కాకినాడ పోర్టుపై పవన్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నాం: పురందేశ్వరి



అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌కు అదానీ మూడు సార్లు వచ్చి విద్యుత్ ఒప్పందం చేసుకుని వెళితే అప్పటి ముఖ్యమంత్రికి ఈ విషయం తెలీదా? అమెరికా దర్యాప్తు సంస్థల నివేదికలో తన పేరు ఎక్కడా లేదంటోన్న జగన్ వ్యాఖ్యాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. నివేదిక మొత్తం చదివి ఆ సమయంలో ఏపీ ముఖ్యమంత్రి ఎవరో ప్రజలకు చెప్పాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. విజయవాడలో బీజేపీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సంఘటనా పర్వ్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'విద్యుత్ ఒప్పందాల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డి అమెరికా దర్యాప్తు సంస్థల నివేదికల్లో ఏముందో చదవాలి. అందులో ఏపీ, తమిళనాడు, ఒడిశా, జమ్మూకశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వాల పెద్దల ప్రస్తావన ఉంది. ఆయా రాష్ట్రాల్లో ఆ సమయంలో జరిగిన వాటికి జగన్, స్టాలిన్, నవీన్ పట్నాయక్ బాధ్యత వహించాలి. ఆ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు లేకున్నా అదానీతో బీజేపీకి సంబంధాలు అంటగట్టి రాద్ధాంతం చేయడం ఇండీ కూటమికి తగదు. కాకినాడ పోర్టు నుంచి అక్రమంగా బియ్యం ఎగుమతి అవుతున్నట్లే అక్రమంగా ఆయుధాలు దిగుమతై దేశ భద్రతకు ముప్పు కాబోవా అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల్ని బీజేపీ సమర్థిస్తోంది. కాకినాడ పోర్టు నుంచి బియ్యం అక్రమ ఎగుమతులపై చాలాకాలంగా బీజేపీ ప్రశ్నిస్తూనే ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలోని నాయకుల పేర్లు ఇందులో బలంగా వినిపించాయి. ఆర్డీపీపీ బూడిద వివాదంపై సీఎం చంద్రబాబు దగ్గరికి వెళ్లి బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వివరణ ఇచ్చారు. పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రస్తావించి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తీసుకొస్తాం. రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో బీజేపీ తరఫున అభ్యర్థి ఉంటారో లేదో ఢిల్లీ అధిష్ఠానం నిర్ణయిస్తుంది' అని అన్నారు. పార్టీ జాతీయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మణ్ (రాజ్యసభ ఎంపీ) మాట్లాడుతూ, 'దేశం కోసమే బీజేపీ పని చేస్తుంది. ప్రతి కార్యకర్త దేశ సేవకు కట్టుబడి ఉండటం ముఖ్యం. సిద్ధాంతమే పరమావధిగా దేశం, ధర్మం కోసం పనిచేస్తున్న బీజేపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ పార్టీని విస్తరించాలి. పోలింగ్ బూత్, మండల, జిల్లా ఎన్నికలు జనవరిలోపు పూర్తి చేయాలి' అని పార్టీ శ్రేణులు, నేతలకు సూచించారు.

జగన్, అదానీ వ్యవహారంపై విచారణ జరపాలి

» మోదీ, షా, నిర్మలకు గోనె ప్రకాశరావు లేఖ

న్యూఢిల్లీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గతంలో ఆంధ్రప్రదేశ్ సీఎంగా జగన్‌రెడ్డి, గౌతమ్ అదానీతో కుదుర్చుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందంలోని అక్రమాలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, సీబీఐ లేదా జేపీసీ ద్వారా విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు లేఖలు రాశారు. అదానీపై అవినీతి ఆరోపణలలో తన పేరు లేదని జగన్ అనుకుంటున్నాడని, ఏమీ కాదన్న ధీమాతో ఉన్నారని శనివారం మీడియా సమావేశంలో చెప్పారు. 'అక్రమంగా ఒక్క డాలర్ వచ్చినా శిక్ష ఖాయం. అలాంటిది జగన్‌కు రూ.1,750 కోట్లు వచ్చాయి. అమెరికా కోర్టుకు వైఎస్ జగన్ హాజరు కాక తప్పదు' అని ప్రకాశరావు స్పష్టం చేశారు.

'స్టెల్లా' సీజ్‌కు చిక్కుముడులెన్నో..!

» కాకినాడలో రేషన్ బియ్యం నౌకపై చర్యలకు అధికారులకు అడ్డంకులు

» కస్టమ్స్‌కు మాత్రమే సీజ్ చేసే అధికారం

» నౌకలో స్మగ్లింగ్ వస్తువులు ఉంటేనే కేసుకు అవకాశం

» స్మగ్లింగ్ చట్టం కిందకు రేషన్ బియ్యం రావంటున్న పోర్టు అధికారులు

» నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా తాత్కాలికంగా షిప్‌ను ఆపాలని నిర్ణయం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ పోర్టుకు వచ్చిన పశ్చిమాఫ్రికా నౌక స్టెల్లా ఎల్ పనామాను సీజ్ చేసే విషయంలో అధికారులకు పలు చిక్కుముడులు ఎదురవుతున్నాయి. నౌకలో రేషన్ బియ్యం ఉన్నందున దానిని సీజ్ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం అధికారులను ఆదేశించారు. అయితే ఇప్పుడీ వ్యవహారంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒకదేశం నుంచి మరో దేశానికి కార్గో కోసం వచ్చిన నౌకను నిబంధనల ప్రకారం సీజ్ చేసే అధికారం ఒక్క కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌కు మాత్రమే ఉంటుంది. అది కూడా ఆ నౌకలో స్మగ్లింగ్ వస్తువులు గుర్తిస్తే కేసు నమోదు చేసి కొన్ని రోజులు నిలిపివేస్తారు. అయితే కాకినాడ యాంకరేజ్ పోర్టుకు వచ్చిన నౌకలో లోడ్ అయిన రేషన్ బియ్యం స్మగ్లింగ్ కిందకు రాదని పోర్టు అధికారులు చెబుతున్నారు. కస్టమ్స్ చట్టం ప్రకారం రేషన్ బియ్యం స్మగ్లింగ్ జాబితాలో లేదంటున్నారు.



కాకినాడ యాంకరేజ్ పోర్టులో ఉన్న స్టెల్లా నౌక

అడ్మిరాల్టీ కేసుతో ఆపగలరా?

సముద్ర జలాల్లో ఏదైనా నౌకను సీజ్ చేయాలంటే ఈ కేసును అడ్మిరాల్టీ న్యాయస్థానంలో పిటిషన్ వేయాల్సి ఉంటుంది. మన రాష్ట్రంలో ఇది అమరావతిలోని హైకోర్టు పరిధిలోకి వస్తుంది. అడ్మిరాల్టీ న్యాయస్థానం నౌకలు, వాటి బిల్లుల చెల్లింపుల్లో వివాదాల కేసులను మాత్రమే పర్యవేక్షిస్తుంది. కానీ రేషన్ బియ్యం ఎగుమతి చేస్తుందనే ఫిర్యాదును స్వీకరిస్తుందా? లేదా? ఏ కారణాలు చెబితే కేసు ముందుకు వెళ్తుందనేది అధికారులకు కూడా అంతుపట్టడం లేదు. పైగా బియ్యం స్మగ్లింగ్‌పై ఇంతవరకు దేశంలో ఏ అడ్మిరాల్టీ న్యాయస్థానంలోను కేసు నమోదవలేదు. అయితే బియ్యం వ్యవహారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ పరిధిలోది కాబట్టి ఆ శాఖ మాత్రమే నౌకను సీజ్ చేసేందుకు అడ్మిరాల్టీ కోర్టులో కేసు వేయాల్సి ఉంటుంది. దీనికంటే ముందు నౌకను సీజ్ చేయాలంటూ కస్టమ్స్, పోర్టు అధికారులకు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. బియ్యం కేసు స్మగ్లింగ్‌లోకి రాదు కాబట్టి దీనిని కస్టమ్స్ తిరస్కరించవచ్చని చెబుతున్నారు.

నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఉంటే..

నౌకను తాత్కాలికంగా ఆపగలిగే అవకాశం ఉన్న 'నో డ్యూ సర్టిఫికెట్' ఇవ్వకుండా చూడాలని కాకినాడ యాంకరేజ్ పోర్టు అధికారులు భావిస్తున్నారు. పోర్టుకు నౌక వచ్చినందుకు తమకు చార్జీలు చెల్లించేశారని, బాకీలు లేవని పేర్కొంటూ పోర్టు అధికారులు సంబంధిత నౌకకు నిబంధనల ప్రకారం నో డ్యూ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. దీన్ని షిప్పింగ్ ఏజెంట్లు కస్టమ్స్ అధికారులకు పంపితే అన్నీ పరిశీలించి నౌక కదలడానికి ఆదేశాలు జారీచేస్తారు. అయితే నౌకకు సంబంధించి షిప్పింగ్ ఏజెంట్లు పోర్టుకు చార్జీలు చెల్లించేస్తే నో డ్యూ సర్టిఫికెట్ ఆపకుండా ఉండడం సాధ్యం కాదని చెబుతున్నారు. అయినా తాత్కాలికంగా ఈ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఆపాలని అధికారులు నిర్ణయించారు.

తుఫానుతో బియ్యం లోడింగ్‌కు విరామం

మరోపక్క స్టెల్లా నౌకలో 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతికిగాను 38 వేల మెట్రిక్ టన్నులు లోడ్ అయింది. ఈలోగా తుఫాను రావడంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. పోర్టులో బియ్యం ఎగుమతులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈలోపు రేషన్ బియ్యం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సముద్రంలో ఈదురు గాలులు, అలల తీవ్రత అధికంగా ఉండడంతో మరికొన్ని రోజులు బియ్యం లోడింగ్ జరిగే అవకాశం లేదు. ఆ తర్వాత జరిగినా మిగిలిన భాగం బియ్యం నౌకలో లోడింగ్ చేయడానికి వారం పడుతుంది. ఆలోగా ఏంచేయాలనేది పౌరసరఫరాలశాఖ ఆదేశాలను బట్టి అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. నౌకలో లోడ్ అయిన రేషన్‌బియ్యం బస్తాలన్నీ వెనక్కి తీసుకుని నౌకను పంపించడమా.. లేదంటే రేషన్‌బియ్యం కాని బియ్యం బస్తాలతో లోడింగ్ చేయడమా అనేది కూడా తేల్చాల్సి ఉంది.



నెల్లూరు జిల్లా వేదాయపాళెం వద్ద రోడ్డుపై నిలిచిన నీరు



ఏలూరు జిల్లా పెదవేగి మండలం అమ్మపాలెంలో రోడ్డుపై బరకాలు కప్పి భద్రపరిచిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ జేడీ హబీబ్‌బాషా

'ఫెంగల్' అలజడి

- మహాబలిపురం, కారైక్కాల్ మధ్య తీరం దాటిన తుఫాన్
- తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కుంభవృష్టి
- నెల్లూరు జిల్లాలో 20 అడుగులు ముందుకు సంద్రం
- నేడు, రేపు దక్షిణ కోస్తా, సీమలో భారీవర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. సముద్ర అలలు ఎగసిపడుతున్నాయి. దక్షిణ కోస్తా, రాయలసీమల్లోని అనేక ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండగా, మిగిలినచోట్ల తేలిక పాటి వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల భారీ నుంచి అతిభారీ, అక్కడక్కడా కుంభవృష్టి వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి మహాబలిపురం, కారైక్కాల్ మధ్య పుదుచ్చేరి సమీపంలో తుఫాను తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 70 నుంచి 80, అప్పుడప్పుడు 90 కి.మీ. వేగంతో గాలులు వీచినట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. విశాఖ, తిరుపతిల్లో పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తడ మండలం భీములవారిపాలెంలో 131.5 మిల్లీమీటర్లు, సూళ్లూరుపేట మండలం మన్నార్‌పోలూరులో 128.75 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే పుత్తూరు మండలం కేవీఎం అగ్రహారంలో 116, దొరవారిసత్రంలోని పూలతోటలో 114, తడలో 108, చిత్తమూరు మండలం మల్లంలో 103, నగరిలో 92 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు మల్లంలో 111.5, అల్లంపాడులో 103.5, విద్యానగర్‌లో 98.5 మి.మీ. వర్షం కురిసింది. నెల్లూరు జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం నుంచి ఎడతెరపి లేని వర్షం కురవడంతో కాలువలు, రోడ్లు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షానికితోడు చలితీవ్రత పెరగడంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. ఆది, సోమవారాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వద్ద సముద్రం 20 అడుగులు ముందుకు వచ్చింది.



పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నేలకొరిగిన వరి

ప్రవాహంలో చిక్కుకుపోయిన బస్సు..

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం సమీపంలో నేరేడు కాలువ పొంగి ప్రవహిస్తోంది. 40మంది ప్రయాణికులతో వచ్చిన ఆర్టీసీ బస్సు కాజ్‌వేపై నీటి ఉధృతిలో చిక్కుకుని ఆగిపోయింది. బస్సులో ఉన్నవారిని గ్రామస్థులు క్షేమంగా గట్టుకు చేర్చారు.

నేడూ, రేపూ వర్షాలు..

ఆది, సోమవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం కోస్తాలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం సూచించింది. కృష్ణపట్నం ఓడరేవులో 6వ నంబరు డేంజర్ సిగ్నల్, నిజాంపట్నం, మచిలీపట్నం, విశాఖపట్నం, కాకినాడ, గంగవరం, భీమునిపట్నంలో మూడో నంబరు హెచ్చరిక ఎగురవేశారు



ఉప్పాడలో 4 మీటర్ల ఎత్తున కెరటాలు

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం ఉప్పొంగుతోంది. ఈదురుగాలులతో పాటు హోరున వర్షం కురుస్తోంది. సముద్రంలో కెరటాలు మూడు నుంచి నాలుగు మీటర్ల ఎత్తులో దూసుకొస్తున్నాయి. కెరటాలు భూమిలోపల నుంచి కోరుకుంటూ రావడంతో ఉప్పాడ పాత బజారు, మాయాపట్నం, సూరాడపేట, జగ్గరాజుపేట, అమీనబాద్, కొత్తపట్నం తదితర తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు చెందిన ఇళ్లు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. తిరుపతి జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. 30 విద్యుత్ స్తంభాలు, రెండు ఇళ్లు కూలిపోయాయి. రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్, కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ నిండిపోయాయి. వాగులు, వంకల్లో ప్రవాహాలు మొదలయ్యాయి. 30 చెరువులు నిండిపోయి కలుజులు పారుతున్నాయి. పలు మండలాల్లో వరి పొలాలు నీట మునిగాయి. 15 చోట్ల కాజ్‌వేలపై నీటి ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిపివేశారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా 62 ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. ఇండిగో, స్పైస్ జెట్, ఎయిర్ అలయెన్స్, స్టార్ ఎయిర్ లైన్స్ సంస్థలకు చెందిన 11 విమాన సర్వీసులు రద్దు చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం రేణిగుంటలో ల్యాండ్ కాలేకపోవడంతో బెంగళూరుకు మళ్లించారు. విశాఖపట్నంలోనూ వాతావరణం అనుకూలించక పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. చెన్నై-విశాఖ-చెన్నై, తిరుపతి-విశాఖ-తిరుపతి విమాన సర్వీసులను రద్దు చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి తిరుపతి జిల్లాలో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా వరి కోతలు నిలిచిపోయాయి. ఏలూరు జిల్లాలో అక్కడక్కడ రహదారులపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది.



సాగరం..కలుషితం!

విశాఖపట్నం నగరంలోని ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ సముద్రంలోకి చేరుతున్నాయి. తుఫాన్‌తో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో ఆ వ్యర్థాలన్నీ తీరానికి కొట్టుకువచ్చాయి. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకునేవారు సంచులు పట్టుకొని తీరంవైపు పరుగు తీస్తున్నారు. వారి సంచులు క్షణాల్లో నిండిపోతున్నాయి. జోడుగుళ్లపాలెం బీచ్‌లో శనివారం ఉదయం కనిపించిన దృశ్యమిది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి.



తిరుమలలో కన్పించని భక్తుల సంచారం

తిరుమలలో ఎడతెరపిలేని వర్షం

తుఫాను ప్రభావంతో తిరుమలలో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. శ్రీవారి ఆలయ ప్రాంతం, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, రోడ్లు, కాటేజీలు, బస్టాండ్, పార్కులు తడిసి ముద్దయ్యాయి. చలిగాలులతో కూడిన వర్షానికి యాత్రికులు వణికిపోయారు. సాయంత్రం నుంచి భక్తులు గదులకే పరిమితమయ్యారు. సాయంత్రం ఆలయం ముందు నిర్వహించే సహస్రదీపాలంకరణ సేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండండి

- సహాయ, పునరావాస కార్యక్రమాలకు సమాయత్తంకండి
- ఫెంగల్ తుఫానుపై సీఎం సమీక్ష

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో అంచనా వేసి, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. ఫెంగల్ తుఫానుపై జిల్లా కలెక్టర్లు, విపత్తు నిర్వహణ శాఖ, సీఎంవో, రియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులతో సీఎం సమీక్షించారు. 'తుఫాను పరిస్థితిని ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలను అప్రమత్తం చేయాలి. అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని, పూర్తి సమన్వయంతో పని చేయాలి. ఆకస్మిక వరదలు వస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు సహాయక బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. సహాయ, పునరావాస కార్యక్రమాలకు కలెక్టర్లు సమాయత్తం కావాలి. ధాన్యం రైతులకు నిర్దిష్ట సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేయాలి' అని అధికారులను ఆదేశించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి: అచ్చెన్న

తుఫాన్ నేపథ్యంలో రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, మత్స్య శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలని కోరారు. కాగా, తుఫాను ప్రభావంతో ఆదివారం దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ ప్రాంతాల్లో ఆకస్మికంగా వరదలు సంభవించే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

అమరావతిలో 50 కోట్లతో తపాలా ప్రధాన కార్యాలయం

- మరో 20కోట్లతో ఉద్యోగుల క్వార్టర్లు: కేంద్ర మంత్రి పెమ్మసాని
- కేంద్రం నిధులతో కొండవీడు అభివృద్ధికీ కృషి: ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

చిలకలూరిపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 'అమరావతిలో రూ.50 కోట్లతో ఆంధ్రప్రదేశ్ పోస్టల్ శాఖ ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నాం. మరో రూ.20 కోట్లతో అక్కడే పోస్టల్ ఉద్యోగులకు నివాస గృహసముదాయాన్ని కూడా నిర్మించబోతున్నాం' అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో రూ.2.3 కోట్ల వ్యయంతో నిర్మించబోతున్న హెడ్‌పోస్టాఫీసు భవన శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. యర్రగొండపాలెం పోస్టాఫీసు నూతన భవన ప్రారంభోత్సవం, ప్యాపిలి పోస్టాఫీసు నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమాన్ని కూడా మంత్రి ఆన్‌లైన్ ద్వారా చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ... 'దేశంలో అవినీతి అతి తక్కువగా ఉన్న ప్రభుత్వ శాఖ పోస్టల్ శాఖ. రాష్ట్రంలో 10 వేల పోస్టాఫీసులు ఉన్నాయి. తపాలా సేవల విషయంలో ఆంధ్ర సర్కిల్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండడం గర్వకారణం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను ఉపయోగిస్తూ పోస్టల్ సేవలను సిబ్బంది బలోపేతం చేస్తున్నారు' అని అన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి మేరకు కేంద్రం నుంచి నిధులు తెచ్చి కొండవీటి కోటను అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, తపాలా శాఖ ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె ప్రకాశ్, జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, ఆర్డీవో మధులత, విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేట హెడ్ పోస్టాఫీస్ శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

రిమాండ్ ఖైదీలకు రాచమర్యాదలు చేస్తే చర్యలు

- ఈగల్ కోసం ఏటా 9 కోట్లు: హోంమంత్రి అనిత

విజయనగరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీలకు రాచమర్యాదలు చేసే ఆలోచన ఎవ్వరికీ లేదని, అటువంటి ఘటనలు ఎక్కడైన చోటు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయనగరం డీఆర్‌సీ సమావేశానికి శనివారం హాజరైన ఆమె విలేకరులతో మాట్లాడారు. రిమాండ్ ఖైదీలకు రాజభోగాలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై హోం మంత్రిని వివరణ అడగ్గా... 'విచారణ జరుగుతోంది. 24 గంటల్లో నివేదిక వస్తుంది. అందులోని అంశాల ఆధారంగా చర్యలు తీసుకుంటాం. ఎంతటి ఉన్నతాధికారులు ఉన్నా చర్యలకు వెనుకాడబోము. గంజాయి సాగు, రవాణాను అరికట్టేందుకు ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. దీనికోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.9కోట్లు ఖర్చు చేయనుంది. జిల్లాల్లో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే ఉపేక్షించం, కేసులు నమోదు చేస్తాం' అని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

మాజీ మంత్రి రోజాపై ఫిర్యాదు

కర్నూలు క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజాపై రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతరత్నం కర్నూలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'గత ఏడాది ఫిబ్రవరి 10న బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో నాటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పర్యటించారు. ఆ సందర్భంగా బీచ్‌లో చెప్పులు వదిలి తన వద్ద పని చేసే ప్రభుత్వ ఉద్యోగి మనోహర్‌ను చెప్పులు తీసుకుని రా అని చెప్పి పంపారు. దళితుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ప్రవర్తించిన ఆమెపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి' అని కర్నూలు త్రీటౌన్ సీఐ శేషయ్యకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

రేషన్‌తో నెలకు వంద కోట్లు అక్రమార్జన

- ఈ వ్యాపారం వ్యవస్థీకృత మాఫియాగా మారింది
- సీఎంకు టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి లేఖ

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ద్వారా రాష్ట్రంలో రూ.వంద కోట్లు లంచాల రూపంలో చేతులు మారుతోందని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 'రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ఒక వ్యవస్థీకృత మాఫియాగా మారిపోయింది. పార్టీలు, ప్రభుత్వాలతో సంబంధం లేకుండా సాగిపోతోంది. ప్రతి నియోజకవర్గంలో స్మగ్లర్లు ఈ వ్యాపారం చేసేవారిని తయారు చేశారు. అధికారులు, రాజకీయ నేతలు సరాసరి రూ.50 లక్షల వరకూ సంపాదిస్తున్నారు. రాష్ట్రం మొత్తం మీద ఇలా చేతులు మారుతున్న మొత్తం నెలకు రూ.100 కోట్లు ఉంటుంది. బియ్యం పథకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఆ బియ్యం స్మగ్లర్లకు ఆదాయ వనరుగా మారుతోంది' అని ఆ లేఖలో పేర్కొన్నారు. అధికారులకు తెలిసినా మౌనంగా ఉండిపోతున్నారని, ప్రభుత్వాలు మారుతున్నా అక్రమ వ్యాపారం ఆగడం లేదని ఆరోపించారు. దీనిపై ఆయన కొన్ని సూచనలు చేశారు. 'తెల్లరేషన్ కార్డులు ఉన్నవారిలో నిజంగా బియ్యం అవసరం ఉన్నవారు ఎందరు? ఇతర ప్రభుత్వ పథకాల కోసం కార్డులను ఉంచుకొన్న వారెందరో గుర్తించాలి. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పథకాలు అమలు చేయాలి. రేషన్ షాపులు, వాహనాలపై నిఘా పెంచాలి. స్మగ్లర్లపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడంతోపాటు దొరికిన వాహనాలను సీజ్ చేయాలి' అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి సూచించారు.

వారిపై దయచూపొద్దు

- చట్టాన్ని అమలు చేయాల్సిన వారే ఉల్లంఘించారు
- ఐపీఎస్‌లు కాంతి రాణా, విశాల్ గున్నీ ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేయండి
- దర్యాప్తు పూర్తి చేసేందుకు పిటిషనర్ల కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం
- హైకోర్టులో కౌంటర్లు దాఖలు చేసిన సీఐడీ

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ, పోలీసు అధికారులు హనుమంతరావు, సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వరరావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేయాలని హైకోర్టును సీఐడీ కోరింది. 'కేసులో ఏ2గా ఉన్న అప్పటి నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు సూచనల మేరకు వీరంతా ప్రణాళిక ప్రకారం జెత్వానీని కుట్రపూరితంగా కేసులో ఇరికించినట్లు దర్యాప్తులో తేలింది. జెత్వానీని అరెస్ట్ చేయాలని ఐపీఎస్ అధికారులు కాంతి రాణా, విశాల్‌గున్నీలకు పీఎస్ఆర్ ఆంజనేయులు సూచించారు. కేసు నమోదు చేయడానికి ఒకరోజు ముందే ముంబైకి వెళ్లేందుకు వీలుగా కాంతిరాణా దిగువస్థాయి పోలీసులకు విమాన టికెట్లు బుక్ చేశారు. పర్యవసానాలు ఆలోచించకుండా పైఅధికారి చెప్పినట్లు ఐపీఎస్ అధికారులు నడుచుకున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అమాయక మహిళను కేసులో ఇరికించడం ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. కుక్కల విద్యాసాగర్‌తో కలిసి కుట్రలో పాల్గొనడం ద్వారా పోలీస్ మ్యాన్యువల్ ఆర్డర్‌ను ఉల్లంఘించారు. పోలీసు ఉన్నతాధికారులే నేరంలో భాగం కావడం ద్వారా పోలీస్ శాఖకు అపకీర్తి తెచ్చారు. ఇలాంటి వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే కేసు దర్యాప్తును పక్కదారి పట్టించే అవకాశం ఉంది. కీలక సాక్షులపై ఒత్తిడి చేసి వాస్తవాలను తారుమారు చేసే ప్రమాదం ఉంది. దర్యాప్తు నిరాటంకంగా సాగాల్సి ఉంది. వాస్తవాలను వెలికితీసి దర్యాప్తు పూర్తి చేసేందుకు పిటిషనర్ల కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం. ఇలాంటి అధికారులకు బెయిల్ మంజూరు చేస్తే ప్రజలు ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం కోల్పోతారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే చట్టాన్ని ఉల్లంఘించిన నేపథ్యంలో వీరి విషయంలో దయ చూపవద్దు. దర్యాప్తు కీలక దశలో ఉంది. ఈ దశలో నిందితులకు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుంది. ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేయండి' అని సీఐడీ కోరింది. జెత్వానీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కాంతిరాణా తాతా, విశాల్‌గున్ని తదితరులు వేసిన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. దీంతో సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత వేర్వేరుగా కౌంటర్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై హైకోర్టు సోమవారం తుది విచారణ జరపనుంది.

విద్యాసాగర్‌కు బెయిల్ ఇవ్వొద్దు

సినీ నటి జెత్వానీ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతూ సీఐడీ హైకోర్టును కోరింది. కేసులో మరికొందరు సాక్షులను విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. పిటిషనర్ రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తి అని, బెయిల్‌పై బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని వివరించింది. ఇదే కారణంతో దిగువకోర్టు పిటిషనర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిందని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.